thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 285 | కరీంనగర్ ఆదివారం, 22 డిసెంబర్, 2024 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. భారత్‌పై తీవ్ర ప్రభావం!

న్యూఢిల్లీ : ఇరాన్ నుంచి క్షిపణులు ఇజ్రాయెల్‌పైకి దూసుకెళ్తున్నాయి.. ఇజ్రాయెల్ దళాలు లెబనాన్‌లో దాడులు జరుపుతున్నాయి.. మనకు కొన్ని వేల కి.మీ.ల దూరంలో ఈ పరిణామాలు జరుగుతున్నా.. మన మీద ఇవి తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయి. పశ్చిమాసియాతో భారత్‌కు సన్నిహిత సంబంధాలు ఉండటమే దీనికి కారణం. చమురు దిగుమతులు, పలు రకాల ఉత్పత్తుల ఎగుమతులు, గల్ఫ్ దేశాల్లో కొన్ని లక్షల మంది భారతీయులు పని చేస్తుండటం.. వీటన్నింటిపైనా ప్రభావం కనిపించే అవకాశం ఉంది.

# 'దడ' పుట్టిస్తున్న హైడ్రా!




## ఆ దెబ్బకు సామాన్యుల నుండి సెలబ్రిటీల దాకా...
## వణికిపోయారుగా!

హైదరాబాద్ : 2024 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్లో హైడ్రా సామాన్యుల నుంచి సెలబ్రిటీల దాకా ప్రతి ఒక్కరికి వెన్నులో వణుకు పుట్టించింది.

తెలంగాణలోని హైదరాబాద్లో చెరువుల అక్రమ నిర్మాణాలపైన కూల్చివేతల దిశగా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకొని హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చింది. హైదరాబాదులో చిన్నపాటి వర్షానికి కాలనీలు, రహదారులు ముంపుకు గురవుతున్న నేపథ్యంలో ఆ పరిస్థితులను మార్చాలని నిర్ణయించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ అక్రమ నిర్మాణాల కూల్చివేతకు హైడ్రాకు అధికారాలిచ్చారు.

**100 రోజుల వ్యవధిలో 300 నిర్మాణాల కూల్చివేతలు...** ఎఫ్టీఎల్ పరిధిలోను , బఫర్ జోన్ పరిధిలో ఉన్న అనేక అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేయడంతో నేటికీ హైడ్రా పైన హైదరాబాద్ వాసులలో ఆందోళన కనిపిస్తుంది. నోటీసులు ఇవ్వకుండానే అక్రమ నిర్మాణాలు అంటూ అనేక భవనాలను హైడ్రా కూల్చి వేసింది.

హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆధ్వర్యంలో దాదాపు 100 రోజుల వ్యవధిలో 30 ప్రాంతాలలో 300 నిర్మాణాలను కూల్చివేయడం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనలు రేపింది.

**నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో చర్చ...** పగలు రాత్రి తేడా లేకుండా, ముఖ్యంగా ఆదివారాలలో కూడా హైడ్రా కూల్చివేతలకు పాల్పడింది. ముఖ్యంగా ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా పేరు మార్మోగింది. హైదరాబాద్లోని హైడ్రా తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కూడా ఆక్రమణలను తొలగించాలని చెరువులు, కుంటలు ఆక్రమించి కట్టిన భవనాలను కూల్చివేయాలని పెద్ద ఎత్తున డిమాండ్ వినిపించింది.

**హైడ్రా కూల్చివేతలతో సామాన్యులు లబోదిబో...** అమీన్ పూర్, మాదాపూర్, కూకట్ పల్లి ఇలా అనేక చోట్ల అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. హైడ్రా చర్యలతో సామాన్యులు కూడా కొంత ఇబ్బంది పడ్డారు. నోటీసులు ఇవ్వకుండా, ఇంట్లోని సామాను కనీసం తీసుకోనివ్వకుండా హైడ్రా కూల్చివేతలకు పాల్పడడంతో ఎంతోమంది బాధితులు లబోదిబోమన్నారు. కన్నీటి పర్యంతమయ్యారు. మరికొందరు హైడ్రా కూల్చివేతలతో హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు హైడ్రాకు పలు ప్రశ్నలకు సంధించి చట్టబద్ధత పైన నిలదీసింది.

**ప్రభుత్వ ఆస్తుల రక్షణ పూర్తి బాధ్యత ఇస్తూ ఆర్డినెన్స్...** దీంతో హైడ్రాకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. దానిని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు పంపి ఆయన ఆమోదాన్ని పొందింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రా కు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అక్రమ కట్టడాలను కూల్చివేసే పవర్ ను హైడ్రాకు ఇచ్చింది.

**జిహెచ్ఎంసి చట్టంలో కూడా పలు మార్పులు...** ఈ మేరకు జీవో నెంబర్ 199 ను విడుదల చేసిన ప్రభుత్వం జిహెచ్ఎంసి చట్టంలో కూడా పలు మార్పులు చేసింది. హైడ్రా కూల్చివేతలకు మాత్రమే కాకుండా చెరువులు కుంటల పునరుద్ధరణకు కూడా రంగంలోకి దిగింది. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు చెరువులు కుంటలను పునరుద్ధరణ చేస్తూ హైడ్రా వ్యవస్థ 2024 సంవత్సరంలో ఒక బలమైన వ్యవస్థగా ఎదిగింది.




## సంక్రాంతి నుంచి రైతు భరోసా : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్గొండ: ధరణి కారణంగా నష్టపోయిన రైతులకు న్యాయం చేసేందుకే భూమాతను తీసుకొస్తున్నామని, జనవరి 2 నుంచి భూభారతి పేరుతో భూధార్ కార్డులు ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా అమలు చేస్తామని ప్రకటించారు. నల్గొండ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఇందిరా స్వశక్తి మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు రూ. లక్ష కోట్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో మళ్లీ వీఆర్వో వ్యవస్థను తీసుకొస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాములలో మహిళా సంఘాల సభ్యులతో పైలెట్ ప్రాజెక్ట్ కింద సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. మహిళలు ప్రతి నెల రూ. 3 నుంచి రూ. 4 వేలు అదనపు ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం కాల్వలను మార్చిలోపు పూర్తిచేసి చెరువులన్నింటినీ నీటితో నింపి మొదటి దశలో 50 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని ఇరిగేషన్ ఆఫీసర్లను ఆదేశించారు. కెనాల్ పనులకు సంబంధించిన భూసేకరణ కోసం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ. 37 కోట్లు మంజూరు చేసిందని, వారం రోజుల్లో మరో రూ.35 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు.

# తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా

## అసెంబ్లీలో ప్రభుత్వం ఆమోదించిన కీలక బిల్లులివే..




హైదరాబాద్, డిసెంబర్ 21: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడ్డాయి. ఏడు రోజుల పాటు సభ జరుగగా.. 37.44 గంటల పాటు నడిచింది. ఈ సమావేశాల్లో మొత్తం 8 బిల్లులు పాస్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం నుంచే అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీ వేడీగా చర్చలు జరిగాయి. ఒకనొక సమయంలో శాసనసభలో యుద్ధవాతావరణమే నెలకొంది. కేటీఆర్‌పై కేసు నమోదు చేసిన రోజున.. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రచ్చ రచ్చ చేశారు. ఇక అసెంబ్లీ సమావేశాల చివరి రోజున.. అల్లు అర్జున్ అరెస్ట్, పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన అంశాలపై హాట్ డిస్కషన్ నడిచింది.

**ఎనిమిది బిల్లులకు ఆమోదం..** తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో నాలుగు అంశాలపై లఘు చర్చ జరిగింది. అలాగే 8 బిల్లులకు అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. భూ భారతి 2024, పంచాయితీ రాజ్ చట్ట సవరణ బిల్లు, మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ యూనివర్సిటీస్ చట్ట సవరణ బిల్లు, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యూకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ చట్ట సవరణ బిల్లు, గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ సవరణ బిల్లు, తెలంగాణ పేమెంట్స్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్ క్వాలిఫికేషన్ సవరణ బిల్లు, జీహెచ్ఎంసీ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఇక అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్ర అప్పులపై లఘు చర్చ జరిగింది. రాష్ట్ర అప్పులపైనా లఘు చర్చ నిర్వహించారు. టూరిజం పాలసీ, గుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. సభలో ఔటర్ రింగ్ రోడ్డు లీజ్‌పై సిట్ విచారణకు ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి.




# రైతు బంధుపై... ఫుల్ క్లారిటీతో ఉన్నాం!

## రెండు సార్లు సీఎం అయ్యి.. వందేళ్ల విధ్వంసం

## కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

## ప్రతి పేద రైతుకు రైతు బంధు అందుతుంది!!

హైదరాబాద్: రైతులను ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా విధివిధానాలపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. రైతు భరోసాపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. "రైతు సమాజాన్ని ఆదుకునేందుకు మా ప్రభుత్వం ముందు ఉంటుంది. గత ప్రభుత్వం రైతు బంధు అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ఈ పథకాన్ని తెచ్చారు. సాగులో లేని భూములకూ రైతుబంధు ఇచ్చారు. దీని ద్వారా రూ. 22,600 కోట్ల ఆయాచిత లబ్ధి చేకూర్చారు. రియల్ ఎస్టేట్, పారిశ్రామికవేత్తలకూ ఇచ్చారు. రాళ్లకు, గుట్టలకూ రైతుబంధు ఇద్దామా..?" అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. రైతు భరోసా అమలు చేయడానికి సభ్యులంతా సలహాలు ఇవ్వాలని సీఎం కోరారు.

**భారాసను ఆదర్శంగా తీసుకోవాలా..? :** "జమీందార్లు, భూస్వాములకు రైతు బంధు ఇవ్వాలా..? మీరు ఇచ్చారు కాబట్టి.. మమ్మల్నీ రాళ్లు, గుట్టలకు రైతు బంధు ఇవ్వాలంటున్నారు. భారాసను ఆదర్శంగా తీసుకోవాలని అంటున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుంటే మేం కూడా ప్రతిపక్షంలోనే ఉండేవాళ్లం. 2023లో అధికారం.. 2024లో డిపాజిట్లు కోల్పోయిన మీరు మాకు ఆదర్శం కాదు. నిజమైన లబ్ధిదారులెవరికీ అన్యాయం జరగకూడదు" అని సీఎం అన్నారు.

**ఆ సంఘానికి అధ్యక్షుడు అసెంబ్లీకి రాలేదు..** "రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర తొలి స్థానంలో ఉంది. తెలంగాణ రెండో స్థానంలో ఉంది. భారాస పాలనలో 3 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు తగ్గించామని చెబుతున్నారు. అబద్ధాలు చెప్పే సంఘానికి అధ్యక్షుడు అసెంబ్లీకి రాలేదు. ఆ సంఘానికి ఉపాధ్యక్షుడు అసెంబ్లీకి వచ్చారు" అని సీఎం ఎద్దేవా చేశారు.

**ఆ మొత్తాన్ని అదానీకి తిరిగిచ్చాం..** "స్కిల్ వర్సిటీ కోసం అదానీ రూ. 100 కోట్లు ఇచ్చారు. దీనిపై ప్రతిపక్షం చేసిన నానాయాగీ వల్ల ఆ మొత్తాన్ని అదానీకి తిరిగి ఇచ్చాం.

రూ. 100 కోట్లు తిరిగి ఇవ్వడం వల్ల రాష్ట్రానికి నష్టం. రెండు సార్లు సీఎం అయ్యి.. వందేళ్ల విధ్వంసం చేసి.. వెయ్యేళ్లకు సరిపడా మీరు సంపాదించుకున్నారు" అని సీఎం ఆరోపించారు. తొమ్మిదిన్నర ఏళ్ల భారాస పాలనలో రూ. 7 లక్షల కోట్ల అప్పు చేశారని.. పదేళ్లు కష్టపడి కేసీఆర్ 'కూలేశ్వరం' కట్టారని సీఎం ఎద్దేవా చేశారు.







## అలాంటి ఘటనలు జరిగితే సినిమాలకు ప్రత్యేక రాయితీలు ఉండవు: సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా సంచలన ప్రకటన చేశారు. ప్రజల ప్రాణాలు పోయే ఘటనలు జరుగుతాయంటే సినీ పరిశ్రమకు ప్రత్యేక రాయితీలు కల్పించనని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బంది పెట్టిన ఎవరినీ ప్రభుత్వం వదిలి పెట్టదని హెచ్చరించారు. 'పుష్ప2: ది రూల్' మూవీ విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, బాలుడు తీవ్రంగా గాయపడి కోమాలో ఉన్నాడు. అసలు ఏం జరిగిందో ప్రభుత్వం ప్రకటన చేయాలని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ కోరారు. ఈ అంశంపై సీఎం స్పందించి ప్రకటన చేశారు. తాజా పరిస్థితులపై ప్రతిపక్షాల విమర్శలు, సినిమా పరిశ్రమ వ్యవహారశైలిపైనా మాట్లాడారు. "సంధ్య థియేటర్ ఘటన విషయంలో పోలీసులు వారి విధి నిర్వహణను సక్రమంగానే నిర్వహించారు. ఎప్పుడైతే అల్లు అర్జున్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారో రాజకీయ పార్టీలు, కొందరు వ్యక్తులు పైశాచికంగా, నీచంగా నన్ను తిడుతూ పోస్టులు పెట్టారు. సినిమా చూడటానికి వెళ్లిన కుటుంబంలో మహిళ చనిపోతే, 11వ రోజు వరకూ హీరో, ప్రొడ్యూసర్ ఎవరూ వారిని పరామర్శించలేదు. కనీసం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుని దగ్గరకి కూడా పోలేదు. ఇది ఏ రకమైన మానవత్వం. ఇలా వ్యవహరించిన వారిని పోలీసులు తమ విధి నిర్వహణలో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఉద్యమాల సమయంలో చేశామని చెప్పుకొనే వాళ్ల.., పదేళ్లు మంత్రిగా చేసిన వ్యక్తులు సోషల్‌మీడియాలో అడ్డగోలుగా పోస్టులు పెట్టారు. ఉద్యమాల సమయంలో సినిమా షూటింగ్‌లు జరగొద్దని వీళ్లంతా దాడులు చేయలేదా? ఈ రోజు వాళ్లకు ఆ హీరో భగవత్ స్వరూపుడు అయ్యాడు. 'అలాంటి వ్యక్తిని పోలీసులు ముట్టుకుంటారా' అని ప్రశ్నిస్తున్నారు. ఓ మహిళ చనిపోయిన ఘటనలో విచారణకు పిలిస్తే దాన్ని కూడా ఈ రాజకీయ పార్టీలు తప్పుపడుతున్నాయి. ప్రభుత్వాన్ని బదనాం చేయాలని, ముఖ్యమంత్రిని తిట్టాలని నీచమైన భాష వాడారు." "సినిమా పరిశ్రమను ప్రోత్సహించాలని ఎవరు ఇవ్వని విధంగా రాయితీలను మా ప్రభుత్వం కల్పించింది. టికెట్ ధరల పెంపునకు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ప్రజల ప్రాణాలు పోతుంటే కూడా వాళ్లను ఏమీ అనొద్దని అంటారేంటి? ఫిల్మ్‌స్టార్, సూపర్‌స్టార్, పొలిటికల్ స్టార్స్ హత్యలు చేసినా, వాళ్లను విచారించొద్దని మీరు చట్టం చేస్తానంటే అమలు చేస్తాం. బాబా సాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన చట్టం ప్రకారం సంధ్య థియేటర్ ఘటనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వాళ్లపై కేసులు పెట్టి విచారించాల్సిందే. బాధితులను ఆదుకోవాల్సిందే. ఒక్కరోజు అతను పోలీస్‌స్టేషన్‌కు పోయి వస్తే, ఏదో పెద్ద ప్రమాదం జరిగినట్టు కన్నీళ్లు కారుస్తున్నారు. ఈ సినీ ప్రముఖుల్లో ఒక్కరైనా ఆస్పత్రికి పోయారా? కానీ, ఆయన జైలు నుంచి రాగానే, వీళ్లంతా ఇంటికి క్యూ కట్టి, ఈ ప్రభుత్వాన్ని తిడుతున్నారు. ఆ పిల్లాడిని పరామర్శించేందుకు కొందరైనా సినీ ప్రముఖులు ముందుకు రాలేదంటే, సినీ ఇండస్ట్రీ, అందులోని ప్రముఖులు ఏం ఆలోచన చేస్తున్నారో, కోరుకుంటున్నారో తెలియదు" "అతన్ని ఒక్కరోజు అరెస్టు చేయగానే, హైకోర్టులో స్పెషల్ పిటిషన్, లంచ్ మోషన్ పెట్టారు. బెయిల్ కూడా వచ్చేలా చేశారు. రాత్రి జైలుకు వెళ్తే, ఉదయం బయటకు వచ్చారు. నేనేం చేయను. అది నా ఇల్లు కాదు. అలా అయి ఉంటే, వెళ్లలా? వద్దా? అన్నది నేను చెప్పేవాడిని. జైలు తలుపు నా చేతిలో లేదు. న్యాయ వ్యవస్థ ద్వారా వాళ్లు వెళ్లారు. రాజకీయ పార్టీలు, 10ఏళ్లుగా మంత్రులుగా పనిచేసిన వాళ్లు అతనిపై కేసులు ఎందుకు పెట్టారని నన్ను అడుగుతున్నారు. మా తమ్ముడికే కేసుల నుంచి మినహాయింపు ఉండదు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ఈ ప్రభుత్వం నడుచుకుంటుంది. ఆ పిల్లాడి ఆరోగ్యాన్ని మేం నిరంతరం పర్యవేక్షిస్తున్నాం." "నేను సినీ ప్రముఖులకు ఒక విషయం స్పష్టంగా చెబుతున్నా. అమానవీయ ఘటనలను ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం ఉపేక్షించదు. సినిమాలు తీసుకోండి, వ్యాపారం చేసుకోండి. డబ్బులు సంపాదించుకోండి. ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు తీసుకోండి. షూటింగ్‌లకు సంబంధించి ప్రత్యేక అనుమతులు కూడా తీసుకోండి. ప్రజల ప్రాణాలు పోతుంటే మాత్రం మా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. నేను కుర్చీలో ఉన్నంత వరకూ ఇలాంటి ఘటనలను ఉపేక్షించను. ప్రజల ప్రాణాలు పోయే ఘటనలు జరిగితే ప్రత్యేక మినహాయింపులు ఉండవు. తెలంగాణ ప్రజల ప్రాణాలు కాపాడటమే నా బాధ్యత, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినీ ప్రభుత్వం వదిలి పెట్టదు" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

## రైతుబంధులో కోతలు విధిస్తామని మేం చెప్పలేదు: మంత్రి తుమ్మల



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. "మేం ఇచ్చిన నోట్‌లో రైతు భరోసాపై ఏమీ చెప్పలేదు. గత ప్రభుత్వంలో జరిగిన విధివిధానాలే సభ ముందు ఉంచాం. భారాస ఏది చెబితే.. అది అమలు చేయాలనే ఆలోచన వారికి ఉంది. ఏ పంటకు ఎంత ఇస్తామనేది ఇంకా నిర్ణయించలేదు. సభలో సభ్యుల సూచనల తర్వాతే నిర్ణయిస్తాం. పత్తి, చెరకుకు ఏం చేయాలనేది సభ్యులు చెబితే.. చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రైతుబంధులో కోతలు విధిస్తామని మేం చెప్పలేదు. ప్రజలు, సభ్యుల అభిప్రాయం ప్రకారం విధివిధానాలు నిర్ణయిస్తాం" అని తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.




## భారాస పాలనలో కూలిపోయే ప్రాజెక్టులు కట్టారు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: భారాస హయాంలో గరిష్ఠంగా 14 గంటల కరెంట్ మాత్రమే వచ్చేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఒక సబ్‌స్టేషన్‌లో లాగ్ బుక్ పరిశీలిస్తే ఈ విషయం తెలిసిందని చెప్పారు. ఆ 14 గంటల్లోనూ ఐదారు సార్లు కోతలుండేవని విద్యుత్ సిబ్బంది చెప్పేవారన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. "భారాస 24 గంటల విద్యుత్ సరఫరా చేయలేదు.. ఆధారాలు పంపిస్తాం. నల్గొండ జిల్లాలో ఆ పార్టీ హయాంలో కొత్తగా ఒక ఎకరా సాగులోకి వచ్చినా.. నేను రాజీనామా చేస్తా. ఉచిత విద్యుత్ అందించింది కాంగ్రెస్.. దాని పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దే. భారాస పాలనలో నీళ్లు, విద్యుత్.. ఏమీ ఇవ్వలేదు. వాళ్ల పాలనలో కూలిపోయే ప్రాజెక్టులు కట్టారు. మిషన్ భగీరథ ద్వారా కుళాయి నీళ్లు వచ్చాయని ప్రజలు చెబితే.. మరో సారి ఓట్లు అడగం. మిషన్ భగీరథలో రూ.50 వేలకోట్లు తినేశారు" అని కోమటిరెడ్డి ఆరోపించారు.

**అలా ఎలా మాట్లాడతారు..?: హరీశ్‌రావు...** మంత్రి ఆరోపణలను భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండించారు. "మిషన్ భగీరథకు అయిన ఖర్చు రూ.28 వేల కోట్లు. రూ.50 వేల కోట్లు తిన్నారని మంత్రి కోమటిరెడ్డి ఎలా మాట్లాడతారు? మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి. కాళేశ్వరం ద్వారా నల్గొండ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీళ్లు అందించాం. నల్గొండలో వైద్య కళాశాల పెట్టింది కేసీఆర్. ఉమ్మడి నల్గొండలో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాం" అని హరీశ్ రావు అన్నారు.

## పటాన్‌చెరు పరిధిలో భారీగా డ్రగ్స్ పట్టివేత

పటాన్‌చెరు అర్బన్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలో భారీగా డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. కిలో ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు, యాంటీ నార్కోటిక్స్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్, టీజీ నాబ్ ఎస్పీ సాయి చైతన్య వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకల కోసం డ్రగ్స్ విక్రయించేందుకు రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర నిందితులను పట్టుకున్నామన్నారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ శివారులో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం సాయంత్రం టీజీ నాబ్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు.




వారి నుంచి 1000 గ్రాముల నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీరిద్దరూ డ్రగ్స్ కేసులో నిందితులుగా గుర్తించారు. ముంబయికి చెందిన మహమ్మద్ సలీం అబ్దుల్ హమీద్ షేక్, ముఖేష్ దుబేలుగా పోలీసులు గుర్తించారు.

## మీ ఆటలు సాగవిక.. సినీ ఇండస్ట్రీకి సీఎం వార్నింగ్..

హైదరాబాద్, డిసెంబర్ 21: సినిమా ఇండస్ట్రీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఇకపై టికెట్ ధరల పెంపు, బెనిఫిట్‌షోలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. తాను సీఎంగా ఉన్నంత కాలం అనుమతి ఇవ్వబోనని తేల్చి చెప్పారు. తాము అధికారంలో ఉన్నంత కాలం సినిమా వాళ్ల ఆటలు సాగనివ్వనని వార్నింగ్ ఇచ్చారు. సినిమా వాళ్లు వ్యాపారాలు చేసుకోండన్న సీఎం.. మనుషుల ప్రాణాలతో చెలగాటం ఆడాలని చూస్తే ఊరుకోమని తేల్చి చెప్పారు. చట్టం అందరికీ ఒక్కటే అనే విషయం గుర్తుంచుకోవాలని హితవు చెప్పారు. హీరో అల్లు అర్జున్ అరెస్ట్ తర్వాత కొన్ని రాజకీయ పార్టీలు పైశాచికంగా ప్రవర్తించాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. పలువురు నాయకులు చేసిన కామెంట్స్‌ను ఆయన అసెంబ్లీలో ఉటంకించారు. తనను నీచంగా తిట్టుకుంటూ పోస్టులు పెట్టారన్నారు. మంత్రిగా పని చేసిన ఒక వ్యక్తి అడ్డగోలుగా పోస్టులు పెట్టారన్నారు. సదరు హీరో భగవత్ స్వరూపుడు అన్నట్లుగా హంగామా చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రిని తిట్టడానికి నీచమైన భాషను వాడారన్నారు. ప్రజల ప్రాణాలు తీస్తుంటే కూడా వాళ్లను ఏం చేయొద్దా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. స్టార్, ఫిల్మ్ స్టార్స్, సూపర్ స్టార్స్, పొలిటికల్ స్టార్స్‌కు ప్రత్యేక ప్రివిలేజ్ ఉందా? అని సీఎం ప్రశ్నించారు. సినిమా వాళ్లు హత్యలు చేసినా విచారణ చేయొద్దంటూ చట్టం చేద్దామా? అని అసెంబ్లీలో ప్రశ్నించారు సీఎం రేవంత్.

## 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్లు నిరూపిస్తే మేమంతా రాజీనామా చేస్తాం: కేటీఆర్



హైదరాబాద్: సాగు విస్తీర్ణం పెరగాలనే ఉద్దేశంతోనే రైతుబంధు ఇచ్చామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (%ఖు=%) అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. "2019-20లో సాగు విస్తీర్ణం 141 లక్షల ఎకరాలుంది. 2020-21లో సాగు విస్తీర్ణం 204 లక్షల ఎకరాలని నివేదికలో చెప్పారు. రైతుబంధు ఇవ్వడం వల్లే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇదే విషయాన్ని ప్రభుత్వం ఇచ్చిన నోట్ స్పష్టం చేస్తోంది. 4.50 లక్షల మంది గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చాం. పోడు పట్టాలున్న గిరిజనులకు రైతుబంధు ఇస్తారో.. లేదో ప్రభుత్వం చెప్పాలి. రైతుబంధుకు కోతలు పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంది. లేకపోతే.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి గురించి మంత్రి చెప్పేవారు కాదు. తెలంగాణలో పీఎం కిసాన్ సమ్మాన్ 20 శాతం మంది రైతులకే వస్తోంది. రైతుబంధు యథాతథంగా ఇస్తామంటే.. ఈ చర్చ ఎందుకు? పత్తి, కంది 8 నెలల పంట.. ఆర్థిక సాయం ఒక పంటకు ఇస్తారా? రెండు పంటలకు ఇస్తారా అనేది ప్రభుత్వం చెప్పాలి. పామాయిల్, మామిడి, ఉద్యాన పంటలకు రైతుభరోసా ఇస్తారా? 3 పంటలు సాగు చేసే రైతులకు మూడు విడతలుగా ఇస్తారా? మూడో పంటకు ఇవ్వాలని గతంలో రేవంత్ అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పది రోజులు పొడిగించాలి. ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథపై చర్చ చేపట్టాలి. నల్గొండ జిల్లా అభివృద్ధిపై కూడా ఒకరోజు చర్చ చేపట్టాలి. గతంలో జరిగిన తప్పులు ఎత్తిచూపితే మీకు ఇబ్బందిగా ఉంది. గతంలో చేపట్టిన ప్రాజెక్టులకు మాత్రం దబ్బా కొట్టడం సబబా? భారాస హయాంలో 24 గంటల విద్యుత్ ఇవ్వలేదని తప్పుడోవ పట్టిస్తున్నారు. భారాస పాలనలో సగటున 19.2 గంటల విద్యుత్ ఇచ్చినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. కాంగ్రెస్ పాలనలో 24 గంటలు ఇస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారు. సభ వాయిదా వేసి నల్గొండ జిల్లాకు వెళ్లి పరిస్థితులు పరిశీలిద్దాం. 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్లు చూపెడితే భారాస శాసనసభాపక్షం మొత్తం రాజీనామా చేస్తుంది. రైతుబంధు మీద కాంగ్రెస్ విపరీతమైన దుష్ప్రచారం చేసింది. రైతు బతుకును మార్చిన గేమ్ ఛేంజర్ రైతుబంధు" అని కేటీఆర్ అన్నారు.

## అల్లు అర్జున్‌పై అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన కామెంట్స్..



హైదరాబాద్, డిసెంబర్ 21: పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా అల్లు అర్జున్ వ్యవహార శైలిని ప్రస్తావించారు. పుష్ప-2 మూవీ విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందినా హీరో సినిమాను చూసి వెళ్లారని విమర్శించారు. దుర్ఘటనపై బాధ్యత లేకుండా సినిమా చూసి వెళ్లేటప్పుడు అభిమానులకు చెయ్యి ఊపుతూ వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ బాధ్యతారహిత్యంగా వ్యవహరించారని విమర్శించారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

## శాసనసభను ఇలా ఆలస్యంగా నడపడం కరెక్ట్ కాదు.. స్పీకర్‌కు హరీశ్‌రావు సూచన



హైదరాబాద్ : శాసనసభను పది నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించడంపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ అనుమతితో మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. సమయం 10:10 కావొచ్చింది. ఈ సెషన్‌లో ఏ ఒక్క రోజు కూడా అసెంబ్లీ పది అంటే పది గంటలకు ప్రారంభం కాలేదు. మీరు లాస్ట్ సెషన్ చూడండి.. పదేండ్లు సభ నడిపితే.. పది అంటే పది గంటలకు కచ్చితంగా ఠంచన్‌గా సభ నడిపాం. సభ సమయ పాలన పాటించడం ముఖ్యం. ప్రతి రోజు ఈ సెషన్‌లో 5, 10, 15 నిమిషాలు ఆలస్యంగా సభ ప్రారంభం కావడం కరెక్ట్ కాదు. సభ అందరికీ ఆదర్శంగా ఉండాలి. మనమే ఇలా ఆలస్యంగా నడపడం కరెక్ట్ కాదని మనవి చేస్తున్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు. అనంతరం స్పీకర్ అనుమతితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ ప్రారంభించారు. రైతు భరోసా విధివిధానాలపై సూచనలు ఇవ్వాలని మంత్రి తుమ్మల సభ్యులను కోరారు. సంక్రాంతి పండుగ నాటికి రైతు భరోసాపై విధివిధానాలను ఖరారు చేసి, ఆ తర్వాత రైతు భరోసా చెల్లింపులు చేస్తామని మంత్రి ప్రకటించారు.

## అబద్ధాల సంఘం అధ్యక్షుడు ఎక్కడ.. రేవంత్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో రైతు భరోసాపై జరిగిన స్వల్పకాలిక చర్చపై ప్రభుత్వం తరపున సీఎం రేవంత్ రెడ్డి సమాధానం ఇస్తూ ప్రతిపక్ష నాయకుల వైఖరిని తప్పుపట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన పాపాలను చదవడం తనకు శిక్షగా మారిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తామని మరోసారి స్పష్టం చేశారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. అన్ని పార్టీలు, ప్రతిపక్ష సభ్యుల అభిప్రాయాలు తీసుకుని రైతు భరోసా పథకం విధివిధానాలు రూపొందించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. విధివిధానాలు రూపొందించి రైతు భరోసా మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన రైతుబంధు పథకంలో.. వ్యవసాయం చేసేవారికి వారికి పెట్టుబడి సహాయం అని స్పష్టంగా పేర్కొందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలకు పోవడం వల్ల అనర్హులకు ఆశించినంత లాభం చేకూరలేదన్నారు. సాగుచేయని భూములకు రూ. 22,606 కోట్లు రైతుబంధు ద్వారా అందిందన్నారు. లే అవుట్‌లకు, రాజీవ్ రహదారి భూములకు, శ్రీశైలం హైవే, క్రషర్లు, మైనింగ్ భూములకు రైతు బంధు సహాయం అందించారని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో తెలిపారు.

**దొంగ పాస్ పుస్తకాలతో రైతుబంధు :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొందరు దొంగ పాస్ పుస్తకాలు తయారు చేసి రైతుబంధు



సహాయం పొందారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ పెద్దల అనుచరులు, బంధువుల పేర్లతో రూ.వేల కోట్ల ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టారని ఆరోపించారు. 80వేల పుస్తకాలు చదివినవారు వచ్చి రైతు భరోసాపై సలహా ఇస్తారనుకున్నామంటూ కేసీఆర్‌పై సెటైర్లు వేశారు. మీరు కాదు మాకు ఆదర్శం.. మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటే మేము ఇక్కడ ఉండేవారం కాదంటూ కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. వ్యవసాయ దారులు మాకు ఆదర్శం. బీఆర్ఎస్ చిత్ర, విచిత్ర వ్యవహారాలను ప్రజలు గమనిస్తున్నారు. రైతు భరోసా ఎవరికి ఇవ్వాలో మీ సూచనలు చెప్పండి. అబద్ధాల సంఘం అధ్యక్షుడు సభకు రాలేదు. ఉపాధ్యక్షుడు సభకు వచ్చి రైతు ఆత్మహత్యల పై అబద్ధాలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బీజేపీకి కొత్త సారథి ఎవరు..? పేరు, ముహూర్తం ఖరారైందా..?



తెలంగాణ రాష్ట్ర బీజేపీకి కొత్త సారథి ఎవరు అనే అంశంపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఈ పదవి కోసం చాలా మంది సీనియర్లు, జూనియర్లు పోటీ పడుతూనే ఉన్నారు. దీంతో అధినాయకత్వం ఎవరి వైపు మొగ్గు చూపుతుందా అనేది తెలియకుండా ఉంది. మరోవైపు.. ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగానూ కొనసాగుతున్నారు. దీంతో ఆయన అటు న్యాయం చేయలేక.. ఇటు న్యాయం చేయలేక సతమతం అవుతున్నారన్న టాక్ ఉంది. ఈ క్రమంలో కొత్త అధ్యక్షుడి ఎంపికపై మరికొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత మూడు నాలుగేళ్లుగా రాష్ట్రంలో కమలం పార్టీ కొద్దికొద్దిగా బలపడింది. ప్రతి ఎన్నికల్లోనూ ఓట్ల శాతం పెంచుకుంటూ వస్తోంది. దీంతో అధినాయకత్వం కూడా తెలంగాణపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఈ రాష్ట్రంలో ఎలా అయినా అధికారంలోకి రావాలని చూస్తోంది. ఈ క్రమంలో నూతన అధ్యక్షుడి కోసం పెద్ద ఎత్తున కసరత్తు చేస్తోంది. సీఎం పీఠమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కమలం పార్టీని నడిపించే నాయకుడు ఎవరు అనేది ఇంకా తేలడం లేదు. బీజేపీ అధిష్టానం 2028 ఎన్నికలను టార్గెట్ చేసింది. ఆ ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ తెలంగాణలో అధికారంలోకి రావాలని ప్లాన్ చేసింది. దానిని సాధించే సత్తా ఉన్న సారథి కోసం వెతుకులాడుతోంది. అధికార పీఠం దిశగా దూసుకుపోయే సమర్థుడి కోసం వేట సాగిస్తోంది. ఇదే క్రమంలో అధ్యక్షుడి పీఠం ఆశిస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. బీజేపీ స్టేట్ చీఫ్ కోసం పోటాపోటీ నెలకొంది. అంతేకాదు.. కొంత మంది అయితే ఏకంగా హస్తినలో లాబీయింగ్ చేస్తున్నారన్న టాక్ ఉంది. ఇప్పటికే కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారం చేపట్టింది. దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ప్రస్తుతానికి దక్షిణాదిలో పార్టీ వేగంగా విస్తరిస్తూనే ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధానంగా తెలంగాణలో మరిన్ని ఎక్కువ అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రివర్గంలో ఉండడంతో కొత్త అధ్యక్షుడి నియామకంతోపాటు బూత్ స్థాయిలో సంస్థాగత మార్పులకు బీజేపీ సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధ్యక్షుడి రేసులో పలువురి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారిలో ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు, ఎన్.రాంచంద్రారావు పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరికో ఒకరికి పార్టీ పగ్గాలు దక్కబోతున్నాయన్న ప్రచారం ఉంది. ఈటల రాజేందర్ మల్కాజిగిరి ఎంపీగా గెలిచారు. అయితే.. ఆయనకే పార్టీ పగ్గాలు దక్కబోతున్నాయని మొన్నటివరకు బలంగా ప్రచారం సాగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్, హుజురాబాద్‌లలో పోటీచేసి ఓడిపోయారు. దాంతో అధిష్టానం ఆయనకు ఎంపీగా అవకాశం కల్పించింది. ఎంపీగా గెలిచిన ఆయన కేంద్ర మంత్రి పదవిని ఆశించారు. కానీ.. అది దక్కకుండా పోయింది. దీంతో ఈటలకు రాష్ట్ర పార్టీ బాధ్యతలు అప్పగించబోతున్నారన్న ప్రచారం జోరుగా సాగింది. ఆయన అనుచరులు సైతం అదే ప్రచారం చేస్తున్నారు. ఇక.. కేంద్ర కేబినెట్‌లో చోటు ఆశించిన పాలమూరు ఎంపీ డీకే అరుణకు రాష్ట్ర బాధ్యతలు ఇస్తారన్న ప్రచారం ఉంది. మహిళకు పార్టీ బాధ్యతలు ఇస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలు అధిష్టానం చేసినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న డీకే అరుణ.. ప్రస్తుతం జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. పైగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఇలాకాలో ఎంపీగా గెలిచి తన సత్తా చాటారు. దీంతో ఆమె పేరును సైతం పార్టీ పరిశీలిస్తున్నది. ఇక.. మెదక్ ఎంపీగా గెలిచిన రఘునందన్ రావు సైతం పార్టీ పగ్గాలు దక్కించుకోవాలని చూస్తున్నారు. ఇందిరాగాంధీ గతంలో ప్రాతినిథ్యం వహించిన స్థానం నుంచి ఆయన గెలుపొందడం.. మాజీ సీఎం కేసీఆర్ ఇలాకాలో విజయం సాధించడం ఆయనకు కలిసి వచ్చే అంశాలు. అలాగే.. ప్రత్యర్థి పార్టీల విమర్శలను తిప్పికొట్టడంలోనూ ఆయనకు ఆయనే సాటి. దాంతో రఘునందన్ పేరు కూడా అధిష్టానం దృష్టిలో ఉన్నట్లు టాక్. నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీచేసి వరుసగా రెండోసారి గెలుపొందారు ధర్మపురి అర్వింద్. ఆయన కూడా కేంద్ర మంత్రి వర్గంలో స్థానం ఆశించి భంగపడ్డారు. బీజేపీ ఫైర్ బ్రాండ్‌గా ఆయన పేరుగాంచారు. ఇప్పుడు ఆయన రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారట. బీజేపీ చీఫ్ సీటు బీసీలకే దక్కే అవకాశం ఉండడంతో అర్వింద్ వర్గం బోలెడు ఆశలు పెట్టుకుందని సమాచారం. మరోవైపు.. మాజీ అధ్యక్షుడు, ప్రస్తుతం కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ పేరు సైతం ప్రధానంగా వినిపించింది. కానీ.. దీనిపై నిన్ననే సంజయ్ క్లారిటీ ఇచ్చారు. తాను అధ్యక్ష పదవి రేసులో లేనని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేరు కూడా వినిపిస్తోంది. వీళ్లలో అధిష్టానం ఎవరివైపు మొగ్గుచూపుతుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు.. సంక్రాంతి వరకు కొత్త అధ్యక్షుడిని నియమిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

# అలర్ట్ అలర్ట్ ఆ బ్యాంకు నాలుగు రోజుల మూత



దేశవ్యాప్తంగా గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియ తుదిదశకు చేరింది. ఒక రాష్ట్రంలో ఒకే బ్యాంకు ఉండాలనే ఉద్దేశంతో 43 గ్రామీణ బ్యాంకులను కుదించి 28 బ్యాంకులుగా ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం ఎప్పటి నుంచో కసరత్తు చేస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ వచ్చే జనవరి 1నుంచి కొత్త బ్యాంకుల కార్యకలాపాలు మొదలుపెట్టాలని సూచించింది. ఇప్పటికే మూడు దశల్లో విలీన ప్రక్రియ జరగ్గా, ఇప్పుడు నాలుగు, చివరి ప్రక్రియకు పచ్చజెండా ఊపింది. దీంతో గ్రామీణ బ్యాంకులు ఈ నెల 28 నుంచి 31 వరకు మూతపడనున్నాయి. అంటే జనవరి 25న క్రిస్మస్ సెలవు కాగా, ఆ తర్వాత రెండు రోజులు మాత్రమే గ్రామీణ బ్యాంకులు తెరవనున్నారు. చివరి నాలుగు రోజులు బ్యాంకును మూసివేయనున్నారు. ఈ నాలుగు రోజులు ఆన్ లైన్ లావాదేవీలతోపాటు యూపీఐ చెల్లింపులు, ఏటీఎంల్లో నగదు విత్ డ్రా చేసుకోవడం కూడా కుదరదని బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి. కస్టమర్లు నగదు లావాదేవీల కోసం ముందే జాగ్రత్త పడాలని 27లోగా తమ లావాదేవీలను ముగించుకోవాలని సూచించాయి. దేశవ్యాప్తంగా 43 గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి. వీటిని రాష్ట్రానికి ఒకటి చొప్పున తగ్గించి మొత్తం 28 గ్రామీణ బ్యాంకులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తెలుగు రాష్ట్రాల్లో నాలుగు గ్రామీణ బ్యాంకులు ఉండగా, రెండు రాష్ట్రాల్లోనూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పనిచేస్తోంది. ఈ బ్యాంకు ప్రధాన కార్యాలయం వరంగల్లో ఉంది. కేంద్రం సూచనల ప్రకారం ఈ బ్యాంకు రెండుగా విభజిస్తున్నారు. ఏపీలో ఉన్న ఈ బ్యాంకు శాఖలన్నీ ఇకపై అదేపేరుతో కొనసాగనుండగా, తెలంగాణ రాష్ట్రంలోని బ్యాంకు శాఖలో తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకులో విలీనమవుతాయి. అదేవిధంగా ఏపీలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖలు ఏపీజీవీబీలో విలీనం కానున్నాయి. దీంతో డిసెంబర్ 28 నుంచి 31 వరకు ఈ బ్యాంకులో ఆర్థిక లావాదేవీలు నిలిచిపోనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులకు రుణాలివ్వడానికి గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేశారు 1976లో ఏర్పాటైన ఈ బ్యాంకింగ్ వ్యవస్థ యాజమాన్య పద్ధతులు, నిర్వహణ మిగిలిన ప్రభుత్వ రంగ, వాణిజ్య బ్యాంకులకు భిన్నంగా ఉంటుంది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వానికి 50 శాతం వాటా ఉంటుంది. మిగిలిన 50 శాతంలో స్పాన్సర్ బ్యాంకుకు 35 శాతం, రాష్ట్ర ప్రభుత్వానికి 35 శాతం వాటా ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడున్న 5 బ్యాంకులు రెండింట్లో విలీనం కానుందన వినియోగదారులు ముందుగా తమ ఆర్థిక కార్యకలపాలను ప్లాన్ చేసుకోవాలని బ్యాంకు యాజమాన్యం కోరుతోంది.




వాషింగ్టన్: అధికార మార్పిడికి సిద్ధమవుతున్న అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి ఆర్థిక ప్రతిష్టంభన తలెత్తింది. క్రిస్మస్ సమయంలో షట్‌డౌన్ ముప్పును తప్పించేందుకు ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ద్వైపాక్షిక ప్లాన్‌ను కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హఠాత్తుగా తిరస్కరించారు. దీనిపై తప్పనిసరిగా చర్చ జరిగేలా చూడాలని స్పీకర్ మైక్ జాన్సన్, రిపబ్లికన్ చట్టసభ్యులకు సూచించారు. ఫెడరల్ ప్రభుత్వం వద్ద నిధులు తరిగిపోతున్నవేళ ఈ అనూహ్య పరిణామంతో కార్యకలాపాలు స్తంభించిపోయే పరిస్థితి నెలకొంది. అయితే, ట్రంప్ ఈ నిర్ణయం వెనక ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది. బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిధుల ప్లాన్‌లో ఖర్చులు భారీగా పెరిగాయంటూ మస్క్ సామాజిక మాధ్యమాల వేదికగా పోస్ట్ చేశారు. 1500 పేజీల ఈ బిల్లు మంగళవారం రాత్రి బయటకు రాగానే టెస్లా అధినేత దీనిపై స్పందించారు. 'దీన్ని ఆమోదించకూడదు' అని రాసుకొచ్చారు. ఈ బిల్లుపై ఓటు వేసే చట్టసభ్యులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరోక్షంగా హెచ్చరిక చేశారు. ఈ పోస్ట్ పెట్టిన కొద్ది గంటలకే ట్రంప్ దీనిపై రిపబ్లికన్ నేతలకు అల్టిమేటం ఇవ్వడం చర్చనీయాశంగా మారింది. వాస్తవానికి ప్రభుత్వ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాలంటే ఈ ద్రవ్య వినిమయ బిల్లుకు శుక్రవారం లోగా ఆమోదం లభించాలి. ఈ నేపథ్యంలో బుధవారం దీనిపై ట్రంప్, తన కాబోయే ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో కలిసి ఓ ప్రకటన విడుదల చేశారు. 'రిపబ్లికన్లు చాలా తెలివైనవారు' అని పేర్కొన్నారు. ఈ బిల్లును ఆమోదించకూడదని, దీనిపై చర్చ చేపట్టాల్సిందేనని స్పీకర్ మైక్ జాన్సన్, ఇతర రిపబ్లికన్ చట్టసభ్యులకు గట్టిగా సూచించారు. దీంతో పాటు కొన్ని డిమాండ్లు కూడా తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పుడీ బిల్లుపై ప్రతిష్టంభన నెలకొంది. తాజాగా తీసుకొచ్చిన ఆర్థిక ప్రణాళికలో హరికేన్ బాధిత రాష్ట్రాలు, ఇతర ప్రకృతి విపత్తుల బాధితుల కోసం 100.4 బిలియన్ డాలర్లు విపత్తు సహాయ నిధి కింద కేటాయించారు. తాజా పరిణామాలపై డెమోక్రటిక్ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. "ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించిపోవాలని రిపబ్లికన్లు కోరుకుంటున్నారు. అలా జరిగితే యావత్ అమెరికన్లు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. తన విజయంలో కీలక పాత్ర పోషించిన ఎలాన్ మస్క్‌కు ట్రంప్ తన కొత్త పాలకవర్గంలో కీలక పదవి అప్పగించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా తీసుకురాబోతున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ(%ఱూ+జు%)కి సంయుక్త సారథిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఇంకా ఈ బాధ్యతలు చేపట్టకముందే ట్రంప్ నిర్ణయాలను మస్క్ నియంత్రిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

# పార్శిల్‌లో మృతదేహం.. పశ్చిమగోదావరి జిల్లాలో విస్తుగొలిపే ఘటన

ఉండి: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో విస్తుగొలిపే ఘటన చోటుచేసుకుంది. పార్శిల్‌లో గుర్తుతెలియని మృతదేహం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. జిల్లా ఎస్పీ నయీం అస్మి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. సాగి తులసి అనే మహిళకు యండగండి గ్రామంలో ప్రభుత్వం నుంచి స్థలం మంజూరు కాగా ఇల్లు నిర్మిస్తోంది.. ప్రస్తుతం ఆ ఇల్లు ప్లాస్టింగ్ స్టేజ్‌లో ఉంది. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం కోసం క్షత్రియ సేవా సమితికి ఆమె దరఖాస్తు చేసుకుంది. మొదటి విడతలో సేవా సమితి టైల్స్ అందజేసింది. మరోసారి ఆర్థిక సాయం కోసం మహిళ దరఖాస్తు చేసుకోగా.. పార్శిల్‌లో విద్యుత్ సామగ్రికి బదులు మృతదేహం వచ్చింది. పార్శిల్‌లో ఒక ఉత్తరం కూడా ఉన్నట్లు గుర్తించారు. అందులో రూ.1.30 కోట్లు చెల్లించాలని, లేకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. దీంతో ఆ మహిళ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పార్శిల్ పెట్టెలో సుమారు 45 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం సగ భాగం ఉన్నట్లు గుర్తించారు.

# క్రిప్టోనూ వదలని కిమ్ హ్యాకర్లు..రూ.11 వేలకోట్ల దోపిడీ

ఉత్తర కొరియా.. ఈ మాట ఎక్కడైనా సంచలనమే.. తాజాగా ఈ దేశ సైనికులు రష్యా తరఫున ఉక్రెయిన్ లో యుద్ధం చేస్తున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా,వారిని గుర్తుపట్టకుండా రష్యా ముఖాలను కాల్చేస్తోంది. ఇక ఉత్తర కొరియా అధినేత కిమ్ గురించి చెప్పేదేముంది..? ఆయన ఓ నియంత. తరచూ క్షిపణులు, ఆయుధాల పరీక్షలు, సైనిక విన్యాసాలకు దిగుతుంటారు. తాజాగా ఉత్తర కొరియా గురించి ఓ కీలక విషయం బయటకు వచ్చింది.

**నెలకు 1,000 కోట్లు..** రూ.వెయ్యి కోట్లు.. ఇదీ ఏడాదిలో ఉ



త్తర కొరియాకు చెందిన హ్యాకర్లు దోచేసిన క్రిప్టో కరెన్సీ. డాలర్లలో చెప్పాలంటే ఇది మొత్తం 2.2 బిలియన్ డాలర్లు. రూ.18 వేల కోట్లకు పైగానే. ఇందులో సగానికి పైగా ఉత్తర కొరియా వారే మాయం చేశారని చైనాలసిస్ అనే సంస్థ చెబుతోంది. దోచేసి.. ప్యాంగ్ యాంగ్ కు ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్ యాంగ్. క్రిప్టోలో దోచేసిన సొమ్మును ఇక్కడకు చేరుస్తున్నారట. ఈ మొత్తం 1.3 బిలియన్ డాలర్లు (రూ.11 వేల కోట్ల పైగా) అని చైనాలసిస్ తెలిపింది. రిమోట్ ఐటీ ఉద్యోగుల ముసుగులో క్రిప్టో, ఇతర టెక్నాలజీ సంస్థల్లోకి చొరబడి దోచుకుంటున్నట్లు పేర్కొంది.

**ఈ ఏడాదే అధికం..** గత ఏడాదితో పోలిస్తే క్రిప్టోల చోరీ 21 శాతం పెరిగిందట. అయితే, అత్యంత ఎక్కువగా చోరీ మాత్రం 2021–22 మధ్యనట. అప్పటితో పోలిస్తే ఇప్పుడు తక్కువేనట. క్రిప్టో ప్లాట్‌ఫామ్ లపై వినియోగదారులు వాడే ప్రైవేటు 'కీ'లోని లోపాలతోనే దోపిడీ జరుగుతోందని తేలింది. కేంద్రీకృత ఎక్స్ఛేంజీలు భారీ నిధులను నిర్వహిస్తుండడంతో ప్రైవేట్ 'కీ'లు ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. జపాన్ ఎక్స్ఛేంజీ బీఎంఎం బిట్ కాయిన్ లో జరిగిన 300 మిలియన్ డాలర్ల విలువైన హ్యాకింగ్ అత్యంత తీవ్రమైనది. భారత్ లోని క్రిప్టో ఎక్స్ఛేంజీలో 253 మిలియన్ డాలర్ల విలువైన సొమ్ము దారి మళ్లింది. అమెరికాలోని 14 మంది ఉత్తరకొరియా వాసులు అమెరికా కంపెనీల నుంచి నిధులను ప్యాంగ్ యాంగ్‌లో ఆయుధ కొనుగోళ్లకు మళ్లించారు.ట్రంప్ రాకతో అమెరికాలో క్రిప్టో అనుకూల చట్టాలు వస్తాయని అంటున్నారు. భవిష్యత్తులో బిట్ కాయిన్ 1,20,000 డాలర్లకు కూడా చేరుతుందని భావిస్తున్నారు.

# తాజ్ మహల్ వెనక్కు, అయోధ్య ముందుకు... ఇవిగో లెక్కలు!

ఈ ఏడాది జనవరి 22న అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో అయోధ్య రామమందిరాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఓ ఆసక్తికర విషయం తెరపైకి వచ్చింది. రామమందిర నిర్మాణంతో ఈ ఏడాది ప్రారంభం నుంచి అయోధ్య అత్యంత హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో అయోధ్య రామమందిరం సరికొత్త రికార్డ్ సొంతం చేసుకుంది. ఇందులో భాగంగా దేశంలోని మోస్ట్ పాపులర్ పర్యాటక కేంద్రంగా అయోధ్య నిలిచినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. అవును... ఒకప్పుడు ఆగ్రాలోని తాజ్ మహల్ దేశంలోని పర్యాటక రంగంలో అగ్రగామిగా ఉండగా.. తాజాగా ఆ స్థానాన్ని అయోధ్య రామాలయం ఆక్రమించిందని యూపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది తొలి 9 నెలల్లోనూ రికార్డ్ స్థాయిలో పర్యాటకులు



అయోధ్యను సందర్శించారని గణాంకాలు విడుదల చేసింది. ఈ సందర్భంగా స్పందించిన యూపీ టూరిజం మినిస్టర్ జైవీర్ సింగ్... అయోధ్య రామ మందిరాన్ని చూసేందుకు దేశీయంగానే కాకుండా, విదేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున సందర్శకులు తరలి వచ్చారని అన్నారు. ఈ క్రమంలోనే... ఆలయం ప్రారంభమైన ఏడాది లోపే తాజ్ మహల్ రికార్డును అధిగమించింది. ఇక గణాంకాల విషయానికొస్తే... 2024 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య అయోధ్యను సందర్శించిన దేశీయ పర్యాటకుల సంఖ్య 13.55 కోట్లు కాగా.. విదేశీ పర్యాటకుల సంఖ్య 3,153 అని ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ వెల్లడించింది. ఇదే సమయంలో... తాజ్ మహల్ ను దేశీయ, విదేశీ పర్యాటకులు కలిసి 12.51 కోట్ల మంది సందర్శించారు. ఇదే సమయంలో... ఉత్తరప్రదేశ్ లోని పర్యాటక కేంద్రాలను జనవరి – సెప్టెంబర్ మధ్య 47.61 కోట్ల మంది టూరిస్టులు సందర్శించారని తెలిపిన రాష్ట్ర టూరిజం శాఖ.. గత ఏడాది 12 నెలల్లోనూ 48 కోట్లు కాగా.. ఈ ఏడాది 9 నెలల్లోనే అందుకు చేరువగా వెళ్లినట్లు వెల్లడించింది.

చురకలు

## సంపాదకీయం

# బీజేపీని వణికించిన శీతాకాలం!

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. నవంబర్ 25 నుంచి ప్రారంభమైన ఈ సమావేశాలో బీజేపీ అనుకున్న విధంగా బిల్లులను అయితే పాస్ చేయించుకోలేక పోయింది అని అంటున్నారు. జమిలి ఎన్నికల బిల్లుని ఇదే పార్లమెంట్ లో చర్చకు పెట్టి ఆమోదించుకోవాలని అనుకున్నా విపక్షాల వ్యతిరేకత మధ్యన చివరిలోనే దానిని ప్రవేశపెట్టి జాయింట్ యాక్షన్ కమిటీ ముందుకు పంపించారు. అదే విధంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు చట్టం అవుతుందని శీతాకాల సమావేశాలే దానికి ముహూర్తం అని ప్రచారం సాగినా జేపీసీకి మరో మూడు నెలలు గడువు ఇచ్చి దీని మీద అధ్యయనాన్ని కొనసాగించడానికి వీలు కల్పించారు. ఇక పార్లమెంట్ లో రాజ్యాంగం ఆమోదించి 75 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా చర్చ మాత్రం సాగింది. అయితే ఇక్కడ కూడా అధికార బీజేపీ విపక్ష ఇండియా కూటముల మధ్య విమర్శల జోరే కనిపించింది. రాజ్యాంగాన్ని ఎవరు గౌరవించారు, ఎవరు అవమానించారు అన్న దాని మీద ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఇక చూస్తే కనుక శీతాకాల సమావేశాలు ప్రారంభం అవుతూనే అదానీ మీద చర్యలకు డిమాండ్ చేస్తూ సభను స్థంభింప చేసేందుకు విపక్షాలు చూస్తూ వచ్చాయి. దాంతో సభ ప్రతీ రోజూ దాదాపుగా వాయిదా పడుతూనే వస్తోంది. పని గంటలు కూడా గతంతో పోలిస్తే ఈసారి తగ్గాయని అంటున్నారు. ఈసారి పార్లమెంట్ లో రాహుల్ గాంధీ పెద్దగా ఫోకస్ కాలేదు. ప్రియాంకా గాంధీ మొదటిసారి ఎంపీగా నెగ్గి సభకు రావడంతో ఆమె తన ఉనికి బలంగా చాటుకున్నారు. ముఖ్యంగా రాజ్యాంగం మీద చర్చలో ప్రియాంకా గాంధీ మంచి స్పీచ్ ఇచ్చారని ప్రశంసలు వచ్చాయి. అదే విధంగా మోడీ ప్రభుత్వం మీద ఆమె ధీటైన విమర్శలు చేశారు అని కూడా అంటున్నారు. ప్రధాని మోడీ ఈ సారి సమావేశాలలో రాజ్యాంగం మీద చర్చలోనే కీలకమైన ప్రసంగం చేశారు. అయితే గత సమావేశాలతో పోల్చితే ఈసారి మోడీ మార్క్ అయితే అంతగా కనిపించలేదు అనే అంటున్నారు. ఈసారి మొత్తం సమావేశాలలో హైలెట్ ఏంటి అంటే బీజేపీలో ఎన్డీయేలో కీలకమైన బలమైన నేతగా ఉన్న అమిత్ షాను ఇరుకున పెట్టడం. ఆయన అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు అంటూ విపక్షాలు సభ లోపలా బయటా కూడా ఆందోళనలు చేశాయి. బహుశా ఈ ఆందోళనలు శీతాకాలం సమావేశాలు పూర్తి అయినా మరింత కాలం కొనసాగే అవకాశాలు అయితే ఉండొచ్చు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఒకటి అయితే వేరేగా చిత్రీకరించింది మరోటి అని బీజేపీ నేతలు అంటున్నారు. ఏది ఏమైనా మోడీ తరువాత అంతటి లీడర్ అయిన అమిత్ షా పదేళ్ళ పార్లమెంటరీ అనుభవం లో తొలిసారి విపక్షాలకు ఇలా దొరికి ఇబ్బంది పడ్డారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఎన్డీయే ప్రభుత్వాన్ని అదాని ఇష్యూతో మొదలెట్టి అంబేద్కర్ ఇష్యూ దాకా లాగి విపక్షం అయితే వణికించింది అని విశ్లేషిస్తున్నారు. ఈసారి సమావేశాలలో అయితే బీజేపీ అనుకున్నది సాధించలేకపోయిందా అన్న చర్చ సాగుతోంది. విపక్షం మాత్రం తాము అదానీకి మోడీ సర్కార్ కి అండగా ఉందని ఎస్టాబ్లిష్ చేయ గలిగామని అలాగే అంబేద్కర్ విషయంలో బీజేపీ మనువాద ధోరణిని ఎండగట్టామని సంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఎవరు ఏమి అనుకున్నా ఈసారి శీతాకాల సమావేశాలు మాత్రం ప్రజా సమస్యల మీద పెద్దగా చర్చించలేదని అంటున్నారు. మేధావులు, రాజకీయ నిపుణులు పెదవి విరుస్తున్నారు. సభలలో రచ్చ రభస ఎక్కువ అవుతోందని, ఆఖరికి పార్లమెంట్ బయట బాహాబాహీ వంటి దృశ్యాలు కూడా గతంలో చూడనివి చోటు చేసుకుంటున్నాయని ప్రజాస్వామ్య ప్రియులు అయితే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అసమాన గణిత శాస్త్రజ్ఞుడు రామానుజుడు - డిసెంబర్ 22.. శ్రీనివాస రామానుజన్ జయంతి



ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ గణితశాస్త్ర సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అత్యుత్తమ అ'గణిత' మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం. అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (డిసెంబర్ 22, 1887ఏప్రిల్ 26, 1920) భారత దేశానికి చెందిన గణిత శాస్త్రవేత్త. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. ఇతడికి పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. పదమూడేళ్లకే ఎస్ఎల్ లోనీ త్రికోణమితిపై రాసిన పుస్తకాన్ని ఔపోసన పట్టడమే కాదు తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించాడు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టకపోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరాడు. అక్కడ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు. 1729 సంఖ్యను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు. తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేశారు. రామానుజన్ అనారోగ్యంతో హాస్పిటల్లో వున్నపుడు, హార్డీ ఆయనను పలుకరించటానికి వెళ్లి మాటల మధ్యలో తాను వచ్చిన కారు నంబరు 1729, దాని ప్రత్యేకత ఏమైనా ఉన్నదా ? అని అడిగారు. అందుకు రామానుజన్ తడుముకోకుండా ఆ సంఖ్య ఎంతో చక్కని సంఖ్య అని, ఎందుకంటే రెండు విధాలుగా రెండు ఘనముల మొత్తముగా వ్రాయబడే సంఖ్యా సమితిలో అతి చిన్నసంఖ్య అని తెల్పారు. (1729 = 1గీ3 ం 12గీ3 = 9గీ3 ం 10గీ3 ). ఈ సంఘటన గణితంపై ఆయనుకున్న అవ్యాజమైన అనురాగానికి, అంకిత భావానికి నిదర్శనం. మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్దులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వాడు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం.. 15ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్కూచ్‌సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవాడు. 3,500 గణిత ఫలితాలను సమీకరించిన రికార్డును సొంతం చేసుకున్న మేధావి. 1903లో మద్రాసు విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్ వచ్చింది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చి పడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశాడు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరాడు. చిత్తు కాగితాలను కూడా బహుజాగ్రత్తగా వాడుకుంటూ గణితమే లోకంగా బతికేవాడు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూసి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వవిద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా.వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్యర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెంల్డ్ హార్డి (1877-1947)కి పంపారు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించాడు. జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ప్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి. 33 ఏళ్ళకే ఆయన 1926, ఏప్రిల్ 26న మరణించాడు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కాడు. రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2014ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్దులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజసిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వాడు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విదేశీ ప్రొఫెసర్ హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# డిసెంబర్ 22...జాతీయ గణిత దినోత్సవం



20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన, భారతీయ గణిత చరిత్రకు మెరుగులు దిద్దిన శ్రీనివాస రామానుజన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతియేటా డిసెంబర్ 22ను జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపు కొంటున్నారు. గణిత శాస్త్రములో ఆర్యభట్ట, భాస్కరాచార్యులు తరువాత భారత దేశానికి గొప్ప పేరు తెచ్చిన మేధావి భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ (1887 డిసెంబర్ 22 - 1920 ఏప్రిల్ 26). తన విలక్షణ అసమాన మేధాసంపత్తితో అనన్య సామాన్యమైన కృషిచేసి భారతీయ కీర్తి పతాకాన్ని దశదిశలా ఎగరవేసిన మహా గణితజ్ఞుడు శ్రీనివాస రామానుజన్. ఆయన జీవించింది 32 అయినా 3900పైగా సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అపరగణిత మేధావి. ఆయన సిద్ధాంతాలపై నేటికీ ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతుండడం విశేషం. గణితం వేద కాలము నుండి భారతీయ సంప్రదాయంలో భాగమేనని మన వేద గణితం ద్వారా మనకు తెలుస్తున్నది. గణితం ప్రాచీన భారత దేశంతో పాటు ప్రాచీన ఈజిప్టు, మెసపు టేమియా, ప్రాచీన చైనా, ప్రాచీన గ్రీకు నాగరికతలలో ఎక్కువగా అభివృద్ధి చెందింది. ప్రపంచ వ్యాప్తంగా గణితము అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఎంతో ఉంది. సంఖ్యామానానికి పట్టుకొమ్మ అయిన సున్నా భారతీయుల ఆవిష్కరణే. ప్రాచీన భారతీయులు గణితంలో ఎన్నో విషయాలు కనుగొన్నారు. సంఖ్యలను కనుగొనడంలో చాల కృషి చేశారు. దశాంశ పద్ధతిని గుర్తించిన మొదటివారు భారతీయులే. ఆర్యభట్ట కాలాన్ని భారతీయ గణిత శాస్త్రానికి స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఇది భాస్కరా చార్యుని వరకు అప్రతిహతంగా సాగింది. భాస్కరాచార్యుని తర్వాత కాలంలో బహు విదేశీ దండ యాత్రల వల్ల గణితం కళ తప్పింది. అనువాదాలు, వ్యాఖ్యానాలు తప్ప పెద్దగా స్వతంత్ర గణిత సారస్వతం ఏదీ ఆవిష్కరణ కాలేదు. ఆ స్థితిలో మళ్లీ భారతీయ గణిత చరిత్రకు మెరుగులు దిద్దిన మేధావి శ్రీనివాస రామానుజన్. గణితంపై అనేక గ్రీకు అరబిక్ గ్రంథాలు 12వ శతాబ్దం నుండి లాటిన్‌లోకి అనువదించ బడ్డాయి. ఇది మధ్యయుగంలో ఐరోపాలో గణిత శాస్త్రం మరింత అభివృద్ధికి దారితీసింది. పురాతన కాలంమధ్య యుగాల వరకు, గణితశాస్త్ర ఆవిష్కరణ కాలాలు తరచుగా శతాబ్దాల స్తబ్దతతో అనుసరించ బడ్డాయి. 15వ శతాబ్దంలో పునరుజ్జీవనోద్యమం ఇటలీలో ప్రారంభమై , కొత్త గణిత శాస్త్ర పరిణామాలు, కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల పరంపర పెరుగుతున్న వేగంతోఈ రోజు వరకు కొనసాగుతోంది. ఆధునిక కాలపు తొలినాళ్ళలో పశ్చిమ ఐరోపాలో గణిత శాస్త్రం అభివృద్ధి వేగం పుంజుకుంది. 17వ శతాబ్దం లో న్యూటన్, లీబ్నిజ్ ల కలన గణితం అభివృద్ధి చెందిది. గణితంలో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. లియోన్‌హార్డ్ ఆయిలర్ 18వ శతాబ్దంలో అత్యంత ప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు, అనేక సిద్ధాంతాలు, ఆవిష్కరణలకు తోడ్పడ్డాడు. 19వ శతాబ్దంపు తొలి గణిత శాస్త్రజ్ఞులలో ఒకడైన కార్ల్ ఫ్రెడ్రిక్ గాస్... బీజగణితం, విశ్లేషణ, అవకలన జ్యామితి, మాతృక సిద్ధాంతం, సంఖ్యా సిద్ధాంతం, గణాంకాలు వంటి రంగాలలో అనేక రచనలు చేశాడు. శ్రీనివాస రామానుజన్, కల్యం పూడి రాధాకృష్ణ రావు, సుజాత రాందొరై, పి.సి. మహల నోబిస్, మడకా హరిప్రసాద్ లాంటి ప్రముఖ భారతీయ గణిత శాస్త్రజ్ఞులు విశేష కృషి చేశారు. 2012 ఫిబ్రవరి 26 న మద్రాస్ విశ్వవిద్యాలయంలో జరిగిన రామానుజన్ 125వ జయంతి ప్రారంభ వేడుకల్లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. అలాగే 2012 ను జాతీయ గణిత సంవత్సరంగా జరుపుకుంటామని ప్రకటించారు. అలా 2012 నుంచి ప్రతీ సంవత్సరం డిసెంబర్ 22 ను జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. యువతలో శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించడం, గణిత శాస్త్రంలో పరిశోధనలను ప్రోత్సహించడం, ఆర్థిక, విజ్ఞాన శాస్త్రం, ఇతర విభాగాలలో దాని అనువర్తనాన్ని అన్వేషించడంతో పాటు గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ ను స్మరించుకుని, గౌరవించటం జాతీయ గణిత దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. భారత దేశంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలలో జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకుంటారు. రామానుజన్ 75వ జన్మదినోత్సం సందర్భంగా 1962లో కేంద్ర సర్కార్ పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. అత్యంత చిన్న వయసులోనే గణిత శాస్త్రంలో తనకున్న పట్టును చాటుకున్న రామానుజన్ మ్యాథ్య్ జీనియస్ గా పేరుగాంచిన ఆయన జీవిత ఆధారంగా ద మ్యాన్ హూ నో ఇన్ఫినిటీ పేరుతో సినిమా కూడా విడుదలైంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కాకలు తీరిన రాజకీయ నేత కాకా - డిసెంబర్ 22...గడ్డం వెంకట స్వామి వర్ధంతి



రాజకీయాల్లో కాకలు తీరిన నేతగా... 'కాకా'గా చెరగని ముద్ర వేసిన కేంద్ర మాజీ మంత్రి, సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి గడ్డం వెంకటస్వామి(92). భారత రాజ్యాంగ రూపకర్త బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కలసి పనిచేసిన వారిలో కాకా ఒకరు. కార్మిక నేతగా ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. భారత దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి అతి సమీపానికి వెళ్ళి, కొందరి స్వార్థం, కుట్రల మూలంగా, ఆ పదవి పొందలేక పోయానని కాకా పదే పదే చెపుతుండే వారు. హైదరాబాద్ లో ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేయించి గుడిసెల వెంకట స్వామిగా గుర్తింపు పొందారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు మొదటిసారి ప్రతిపాదన చేసిన వ్యక్తి వెంకటస్వామి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, పిసీసి అధ్యక్షుడిగా, ఎఐసిసి బాధ్యునిగా, ఎంపీగా , కేంద్ర మంత్రిగా, ఆయన అందించిన బహుముఖ సేవలు నిత్య జ్ఞాపకాలుగా మిగిలాయి. గడ్డం వెంకటస్వామి 5 అక్టోబర్ 1929న హైదరాబాద్ లో జన్మించారు. చిన్న వయసులోనే నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. మొదట ఆర్యసమాజ్‌లో, ఆ తర్వాత రామానందతీర్థ శిష్యుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. సాయుధ పోరాట సమయంలో జైలుకెళ్లిన కాకా.. హైదరాబాద్ వీలీనం అనంతరం రాజకీయాలు వదిలేసి కుటుంబ పోషణ కోసం కూలీ పని చేశారు. అప్పుడే కార్మిక నాయకుడిగా ఎదిగారు. హైదరాబాద్‌లో నిలువనీడ లేకుండా ఉన్న పేదల కోసం ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసి వారి కోసం పోరాడారు. ఆర్థికంగా బలపడ్డాక మళ్లీ రాజకీయాల్లోకి వచ్చిన కాకా అనేక పదవులు అలంకరించారు. 1957- 62 మరియు 1978-84 ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ఉన్నారు. 1967లో 4 వ లోకసభకు ఎన్నికైయ్యారు.1969-71 వరకు ప్రజా పద్దుల కమిటీ సభ్యుడు. అవిభక్త కరీంనగర్ జిల్లా పెదపల్లి లోకసభ నియోజకవర్గంనుండి పార్లమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. 1971లో 5వ లోకసభకు (2వ పర్యాయం), 1977లో 6వ లోకసభకు (3వ పర్యాయం), 1989లో 9వ లోక్ సభ (4వ పర్యాయం), 1991లో 10వ లోకసభకు (5వ పర్యాయం), 1996లో 11వ లోకసభకు (6వ పర్యాయం), 2002-2004 అధ్యక్షుడి గా, ఎ.ఐ.సి.సి. ( ఎస్ సి %ఙ% ఎస్ టి ), 2004లో 14వ లోకసభకు (7వ పర్యాయం), ఎన్నికైయ్యారు. 1978 - 1982 లేబర్ మరియు సివిల్ సప్లైస్, ఆంధ్ర ప్రదేశ్ క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 1973 - నవంబర్ 1973 వరకు లేబర్ మరియు పునరావాస కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. నవంబర్ 1973-మార్చి 1977 వరకు సప్లై అండ్ రీహాబిలిటేషన్ కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. 21 జూన్ 1991 నుండి 17 జనవరి 1993 గ్రామీణాభివృద్ధి కేంద్ర మంత్రిగా, 18 జనవరి1993 నుండి ఫిబ్రవరి 1995 టెక్స్టైల్స్ కేంద్ర సహాయమంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్)గా, 10 ఫిబ్రవరి నుండి 1995-15 సెప్టెంబర్ 1995 వరకు టెక్స్టైల్స్ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 15 సెప్టెంబర్. 1995 నుండి 10 మే 1996 వరకు కార్మిక శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 20 ఫిబ్రవరి 1996-16 మే 1996 కార్మిక మరియు వస్త్రాల శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. అలాగే డిప్యూటి లీడర్ కాంగ్రెస్ పార్లమెంట్ పార్టి, లోకసభ మెంబర్, కమిటి ఆన్ ఎనర్జి , మెంబర్, కమిటి ఆన్ ఇన్ స్టాలేషన్ ఆఫ్ పోట్రైస్ / స్టేటస్ ఆఫ్ నేషనల్ లీడర్స్, పార్లమెంటేరియన్ ఇన్ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ మెంబర్, కమిటి ఆన్ ఎతిక్స్ మెంబర్, కన్ సులేటివ్ కమిటి, మినిస్ట్రీ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ మెంబర్, స్టాండింగ్ కమిటి ఆన్ ఎనర్జజీ పని చేశారు. కాకా మొదటి కుమారుడు గడ్డం వినోద్, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, రెండవ కుమారుడు గడ్డం వివేకానందా, పెద్దపెల్లి నియోజక వర్గానికి ఎం.పి.గా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారునిగా పనిచేశారు. ఆయన 2014, డిసెంబరు 22వ తేదీ హైదరాబాదులో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఏడు నందులను పొందిన కాశీ విశ్వనాథ్ - డిసెంబర్ 22 చిలుకోటి కాశీ విశ్వనాథ్ వర్ధంతి



చిలుకోటి కాశీ విశ్వనాథ్ కథా రచయిత, నటుడు. 7 నంది అవార్డులు ఆయన సొంతం చేసుకున్న ప్రతిభా శాలి. వెయిట్ లిఫ్టింగ్ లో దిట్ట. ఒకే ఏడాది 11 చిత్రాలు చేసిన ఘనత ఆయనదే. ఆయన వ్రాసిన "ఓ వర్షం కురుసిన రాత్రి" కథకు స్పందించి, ప్రఖ్యాత రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి స్వయంగా ఆయన యింటికి వెటళ్ళి అభినందించడం విశేషం. వివిధ రంగాల్లో చూపుతున్న ప్రతిభకు నిదర్శనంగా ఆసియా ఖండం విశిష్ట వ్యక్తిగా ఏషియా బుక్‌లో స్థానం పొందడం గమనార్హం. చిరంజీవి, శోభన్‌బాబు, రాజేంద్ర ప్రసాద్, కృష్ణ, సావిత్రి, అంజలి, షావుకారు జానకి, శ్రీదేవి, జయప్రద లాంటి ఎందరో ప్రముఖ నటులతో కలిసి పని చేశారు. దాదాపు 70 చిత్రాలకు రచయితగా ఆయన ఉన్నారు. అగ్రశ్రేణి దర్శకులు రేలంగి నరసింహారావు, రాజాచంద్ర, విజయ బాపినీడు, దాసరి నారాయణరావు వంటి ప్రముఖ దర్శకుల వద్ద చిత్రాలకు రచయితగా పని చేసిన ఆయన మంచిపేరు తెచ్చు కున్నారు. విశ్వనాథ్ విశాఖపట్నంలో కోటి అప్పలస్వామి, బుచ్చమ్మ దంపతులకు 1946లో జన్మించారు. ఆయన పూర్తి పేరు చిలుకోటి కాళీ విశ్వేశ్వరరావు. ఆయన పేరును కాశీ విశ్వనాథ్ గా తన పాఠశాల రోజులలో తెలుగు ఉపాధ్యాయులు మార్చారు. ఆయన విశాఖపట్నం లోని ఎ.వి.ఎన్ కళాశాలలో చదివారు. ఆయన ఆంధ్రా విశ్వ విద్యాలయంలో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో క్రీడలలో, రంగస్థల ప్రదర్శనలలో కూడా పాల్గొన్నారు. అతను ఒక జాతీయ వెయిట్ లిఫ్టర్ మరియు మూడు సార్లు విశ్వవిద్యాలయ ఛాంపియన్షిప్స్ గెలిచారు. ఆయన రాష్ట్రస్థాయి పోటీలకు కూడా వెళ్ళారు. విద్యాభ్యాసం తరువాత ఆయన 1966 లో విశాఖపట్నం పోర్టు ట్రస్టులో అకౌంటెంట్ గా ఉద్యోగం చేశారు. ఆయన 1968 లో తన రచనా ప్రస్థానాన్ని , అలాగే సినిమా ప్రస్థానాన్ని "రామాయణంలో పిడకలవేట" సినిమాతో 1980లో ప్రారంభించారు. అయన సుమారు 131 సినిమాలకు స్క్రిప్ట్, సంభాషణలు వ్రాసారు. సుమారు 120 కథలు, 28 నవలలు, 43 నాటికలు, అనేక సినిమాలకు కథలు వ్రాసారు. ఆయన 37 సినిమాలలో నటించారు. ఆ కారణంగా సినీ పరిశ్రమలోని అందరు దర్శకులు, నిర్మాతలు నటీ నటులతో ఆయనకు మంచి పరిచయాలు ఉండేవి. ఆయన 52 సినిమాలలో నటించారు. "కళా సాగర్, మానవత్వానికి మరో కోణం, ట్రెండ్ మారింది" వంటి తన నాటకాలకు నంది అవార్డులు కూడా అందుకున్నారు. ఆయనకు మొత్తం ఏడు నంది అవార్డులు వచ్చాయి. వాటిలో మూడు నందులు సినిమా కథలకు, మూడు నందులు నాటకాలకు, ఒక నంది దర్శకత్వానికి వచ్చాయి. ల 1980 లో సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, ఎన్టీఆర్ స్మారక అవార్డు అందుకున్నారు. చిలుకోటి కాశీ విశ్వనాథ్ 2015 డిసెంబరు 22న గుండెపోటుతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



## జాడ లేని బిల్లులు..
## ఆందోళనలో మాజీ సర్పంచులు

సిరిసిల్ల : పల్లె పాలనలో ప్రధానమైన వారు సర్పంచులు. తమ పదవీ కాలంలో చేసిన అభివృద్ధి పనులే వాళ్లకు గీటురాయి. గత ప్రభుత్వ హయాంలో పల్లెల అభివృద్ధికి వివిధ పథకాలను అమలు చేశారు. వాటిలో చాలా పనులకు గుత్తేదారులు ముందుకు రాలేదు. కొన్ని చోట్ల అసంపూర్తి పనులకే పరిమితమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల సర్పంచులే పెట్టుబడి పెట్టి పనులు పూర్తి చేశారు. ఇప్పుడా సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడాది కావస్తుంది. మాజీ సర్పంచులుగా మారినప్పటికీ బిల్లులు మాత్రం రావడం లేదు. తమ బిల్లులు విడుదల చేయాలని ప్రస్తుత ప్రభుత్వంపై మూడు నెలలుగా ఒత్తిడి తెస్తున్నా పట్టించుకోవడం లేదు. రానున్న రోజుల్లో ఉద్యమం మరింత తీవ్రతరం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణకు ముందుగా నిధులు ఖర్చు చేసి తర్వాత బిల్లులు పెట్టాల్సి ఉంటుంది. వీటితోపాటు మన ఊరు– మన బడి, పల్లె ప్రగతి పనులతోపాటు కొన్ని గ్రామాల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు, రైతు వేదికలు, పంచాయతీ భవనాల నిర్మాణాలకు కూడా గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో సర్పంచులే చేశారు. పనులు పూర్తయ్యాక ఇంజినీరింగ్ అధికారుల పరిశీలన పూర్తయింది. ఎంబీ రికార్డులతో బిల్లులు ఖజానాకు పంపించారు. ఈ పనులన్నింటికీ చాలా వరకు అప్పులు తెచ్చిపెట్టారు. బిల్లులు విడుదల కాకపోవడంతో ఏడాదికిపైగా వాటికి వడ్డీల భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 253 పంచాయతీలకు గాను రూ.16.20 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. పంచాయతీల్లో చిన్న సమస్యల పరిష్కారానికి ఉపయోగించే సాధారణ నిధులు (జనరల్ ఫండ్) సైతం అందుబాటులో లేవు. అంతర్గత రహదారుల్లో మట్టితో చదును చేయించడం, కాల్వల్లో పూడిక తీయించడం, బ్లీచింగ్ వేయించడం, వీధి దీపాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులే సొంతంగా ఖర్చు చేశారు. వీటి బిల్లుల కోసం పంచాయతీ చెక్కులను ఎస్టీవోకు పంపితే నిధుల్లేక ఇప్పటికే పలుమార్లు బ్యాంకుల్లో బౌన్స్ అయ్యాయి. వివిధ పన్నుల రూపంలో ఏటా జిల్లాలో జనరల్ ఫండ్ కింద రూ.36 కోట్లు వసూలవుతున్నాయి. వీటిలోనూ పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మంచినీటి సరఫరాకు 15 శాతం చొప్పున, పంచాయతీలోని ఉద్యోగుల వేతనాలకు 30 శాతం, ఇతర అవసరాలకు 15 శాతం ఖర్చు చేయాలి. మిగతావి ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించాలి. కానీ పన్నుల వసూలే 60 శాతానికి మించడం లేదు. ఇక వీటితో పాత బకాయిలు చెల్లించడం కష్టమవుతుంది.

**రెండేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు**

మన ఊరు– మన బడిలో ఉపాధి హామీలో చేపట్టే పనులతో పాటు గ్రామంలో సామూహిక మరుగుదొడ్లు, జిల్లా పరిషత్తు నిధులతో తహసీల్దారు కార్యాలయంలో పలు అభివృద్ధి పనులకు రూ.15.40 లక్షలు ఖర్చు చేశాను. అన్నింటికి ఆయా విభాగాల ఇంజినీర్లు ఎంబీ రికార్డులు చేసి ఖజానాకు పంపి రెండేళ్లు కావస్తోంది. బిల్లులు విడుదల కాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.వంశీకృష్ణ, మాజీ సర్పంచి, మర్తన్నపేట, కోనరావుపేట మండలం

**వడ్డీలు కట్టలేకపోతున్నాం**

గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు రూ.28 లక్షలతో పైపులైను వేయించాం. మన ఊరు – మన బడి, గ్రంథాలయ నిర్మాణం తదితర పనులకు రూ.5.31 లక్షలు ఖర్చు చేశాం. అప్పులు తెచ్చి పనులు చేస్తే వాటికి వడ్డీలు పెరుగుతున్నాయి. కానీ వీటికి బిల్లులు మాత్రం రావడం లేదు.సుమతి, మాజీ సర్పంచి, ముస్తాబాద్

## అటవీ అనుమతులే ఆలస్యం!

సారంగాపూర్ : ధర్మపురి మండలాల రైతుల చివరి ఆయకట్టు వరకు నీరందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన రోళ్లవాగు ప్రాజెక్టు అధునికీకరణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. ఇప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు చేరక రైతులకు సాగునీటి కష్టాలు తప్పడంలేదు. పనులు చివరి దశకు చేరుకున్నప్పటికీ రెండేళ్లుగా అటవీ అధికారుల అభ్యంతరంతో తూములకు షట్టర్ల బిగింపు లేక నీటిని నిలువ చేయక చివరి గ్రామాలకు నీరందడం ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇటీవల కొంత అటవీ అనుమతి పనులు వేగవంతమయ్యాయి. ప్రాజెక్టు ఆధునికీకరణలో 810 ఎకరాలు ముంపునకు గురవుతుండగా 53 వేల చెట్లు ఉన్నట్లు గుర్తించారు. ఆయా అటవీ భూములకు బదులు ఇతర మండలాల్లో ఎంపిక చేసిన 335 హెక్టార్ల రెవెన్యూ భూములను అటవీశాఖకు అప్పగించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయికి నివేదిక వెళ్లగా అక్కడి నుంచి అధికారులు పరిశీలనకు రానున్నారు. ఆ తరువాత కేంద్రానికి అనుమతి కోసం పంపించనున్నారు. అయితే



రెండేళ్లుగా తూములకు షట్టర్లు బిగించకపోవడంతో నీటిని నిలువ చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. తాత్కాలికంగా షట్టర్ అడ్డుగా వేసినప్పటికీ నీరు వృథాగా పోతోంది. మిగులు పనులు చేపట్టకుండా అటవీ అధికారులు అడ్డు చెప్పడంతో పనులు నిలిచిపోయాయి. అటవీ అనుమతులు పూర్తయితే కానీ పనులు ప్రారంభించే వీలులేదు. ప్రస్తుతం యాసంగి పంటకు చివరి ఆయకట్టుకు నీరందించడం కష్టంగా మారనుంది. పూర్తి చేయాల్సిన పనులు

75 మీటర్ల కట్టకు రాళ్లు అద్దడం
కిలోమీటరు పొడవు గోడ నిర్మాణం
మూడు తూములకు షట్టర్ల బిగింపు
మత్తడి వద్ద మిగులు పనులు
2 కి.మీ. వరద నీరువెళ్లేందుకు డ్రెయిన్ నిర్మాణం

ప్రాజెక్టు స్వరూపం

2016 టెండర్ ప్రక్రియ.. 2017లో పనులు ప్రారంభం
ప్రాజెక్టు సామర్థ్యం 0.25 టీఎంసీ నుంచి 1 టీఎంసీకి పెంచారు
అంచనా విలువ రూ.60 కోట్లతో ప్రారంభమై ప్రస్తుతం రూ.153 కోట్లకు చేరుకుంది.
మొదటి కట్ట పొడవు 450 మీటర్లు
రెండో కట్ట పొడవు 300 మీటర్లు
మూడో కట్ట పొడవు 850 మీటర్లు
పూర్తి స్థాయి నీటి మట్టం ం233 మీటర్లు
పూర్తి స్థాయి నీటి నిలువ సామర్థ్యం 949 మిలియన్ ఘనపు అడుగులు
మత్తడి పొడవు 156 మీటర్లు, ఎత్తు 12.60 మీటర్లు
కట్ట ఉపరితల వెడల్పు 6 మీటర్లు
కట్ట పైస్థాయి 235 మీటర్లు

# ప్రగతికి బాటలు



పెద్దపల్లి : ఉమ్మడి జిల్లాలోని పలు మార్గాలను జాతీయ రహదారులుగా ఉన్నతీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. హైదరాబాద్–రామగుండం రాజీవ్ రహదారికి జాతీయ హోదా లభించకపోవడంతో నిరాశకు గురైన ఉమ్మడి జిల్లా వాసులకు తాజా వార్త కాసింత ఊరట కలిగిస్తోంది. ఇప్పటికే జగిత్యాల–కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి పనులు ప్రగతిలో ఉండగా నాగపూర్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం కోసం భూ సేకరణ పనులు ముమ్మరమయ్యాయి. పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల పట్టణాల మీదుగా మరిన్ని జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇవి కార్యరూపం దాలిస్తే జిల్లాకేంద్రాలన్నీ జాతీయ రహదారులకు కూడళ్లుగా మారనున్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో దూసుకెళ్తున్న ఉమ్మడి జిల్లా మున్ముందు తయారీ కేంద్రంగా అభివృద్ధి చెందనుంది.

**పారిశ్రామికాభివృద్ధికి ఊతం**

ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం, వాటితో ప్రధాన మార్గాల అనుసంధానంతో పారిశ్రామికాభివృద్ధికి ద్వారాలు తెరిచినట్లవుతుంది. సిరిసిల్లలో వస్త్ర, జగిత్యాలలో ఆహార శుద్ధి, పెద్దపల్లిలో సింగరేణి, ఎన్టీపీసీ అనుబంధ పరిశ్రమలకు ఊతం లభిస్తుంది. ఇప్పటికే వ్యాపార, వాణిజ్య రంగాల్లో వేగంగా పురోభివృద్ధి సాధిస్తున్న కరీంనగర్ నగరం కాస్మోపాలిటన్ నగరంగా మారేందుకు అవకాశాలు మెరుగవుతాయి. మరోవైపు హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాలుష్య కారక పరిశ్రమలపై ఆంక్షలను కఠినతరం చేయడంతో ఉమ్మడి జిల్లా పురోభివృద్ధికి బాటలు పడనున్నాయి.

**విడివిడిగా.. కలివిడిగా**

మంచిర్యాల నుంచి వరంగల్ వైపు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పెద్దపల్లి జిల్లాలో విలోచవరం, పోతారం, నాగారం, కన్నాల, పుట్టపాక, ఆదివారంపేట, నవాబ్‌పేట, బేగంపేట, మచ్చుపేట గ్రామాల మీదుగా వెళ్తుంది. పెద్దపల్లి నుంచి కాటారం వరకు ప్రతిపాదించిన జాతీయ రహదారి ఎన్‌హెచ్ 353తో అనుసంధానం కావడంతో పాటు ఆదివారంపేట సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు కలుస్తుంది.

పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ మీదుగా ప్రతిపాదించిన జాతీయ రహదారి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారితో అనుసంధానమవుతుంది. ఈ మార్గంతో పెద్దపల్లి నుంచి భూపాలపల్లి పట్టణాల మధ్య దూరం 60 కిలోమీటర్లకు తగ్గుతుంది.

రాయపట్నం రహదారి రెండు వైపులా కరీంనగర్, లక్సెట్టిపేటల వద్ద జాతీయ రహదారులతో అనుసంధానమవుతుంది.

కరీంనగర్–సిరిసిల్ల రోడ్డు కామారెడ్డి వద్ద, సిరిసిల్ల–వేములవాడ రోడ్డు కోరుట్ల వద్ద జాతీయ రహదారులతో కలుస్తాయి. ః ఉమ్మడి జిల్లాలో ప్రధాన మార్గమైన రాజీవ్ రహదారి(ఎస్‌హెచ్–1) ఉన్నతీకరణకు ప్రయత్నాలు జరగకపోవడం నిరాశకు గురి చేస్తోంది.

## అందరి చూపు.. ఆయిల్‌పాం వైపు



జగిత్యాల : గతంలో సముద్ర తీరప్రాంతంలో గాలిలో తేమశాతం అధికంగా ఉండటం ఆయిల్‌పాం సాగుకు కలిసి వచ్చింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలోనూ సాగునీటి లభ్యత పెరగటం, వాతావరణ మార్పులతో ఆయిల్‌పాంను సాగు చేయొచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు. కూలీల కొరత, వన్యప్రాణులతో ఆరుతడి పంటలు సాగు చేయలేని చోట, వరికి ప్రత్యామ్నాయ పంటగా, చీడపీడలతో తొలగిస్తున్న మామిడి స్థానంలో అనువైన పంటగా అన్నదాతలు ఆయిల్‌పాంను భావిస్తున్నారు. ఇదే తరుణంలో ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుకు రాయితీలను కల్పించటం, ఆయా జిల్లాల్లో కంపెనీల ద్వారా కొనుగోలు భరోసా ఉండటం, ఇటీవల ఆయిల్‌పాం గెలల ధర టన్నుకు రూ.12,400 నుంచి రూ.20,400కు చేరటంతో అందరిచూపూ ఈ పంటపైనే కేంద్రీకృతమైంది.

**ఉమ్మడి జిల్లాలో లక్ష్యం ఇదే..**

ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తూ ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్లలో 1.31 లక్షల ఎకరాల్లో రైతులతో సాగు చేయించాలని నిర్ణయించారు. ఆయిల్‌ఫెడ్ నుంచి అనుమతులు పొందిన కంపెనీలు ఆయా జిల్లాల్లో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలను పెంచుతూ రైతుల తోటల్లో నాటుతున్నారు. తొలి ఏడాది నాటిన తోటల్లో మొక్కలు గెలలు వేస్తున్నాయి. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే గానుగ (క్రషింగ్ ద్వారా నూనె తీసే) పరిశ్రమలుండగా జగిత్యాల జిల్లాలోని యశ్వంతరావుపేట వద్ద క్రషింగ్ యూనిట్ను ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మరో రెండు చోట్ల పరిశ్రమలకు చర్యలు తీసుకుంటున్నారు. ఆయిల్‌పాం సాగుకు డ్రిప్, మొక్కలు, నిర్వహణ ఖర్చు తదితరాలకు హెక్టారుకు రూ.50 వేల వరకు రాయితీని నాలుగేళ్లలో ఇస్తున్నారు.

**ఇలా చేస్తే మరింత మేలు**

ఉమ్మడి జిల్లా రైతులకు ఆయిల్‌పాం సాగులో అనుభవం తక్కువ ఉన్నందున భారత ఆయిల్‌పాం పరిశోధన సంస్థ, ఆంధ్రప్రదేశ్ పెదవేగి ఆయిల్‌పాం పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, ప్రైవేటు కంపెనీల శాస్త్రవేత్తలు, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు రైతుల తోటలను ఎప్పటికప్పుడు సందర్శించాలి. పురుగులు, తెగుళ్ల నిరోధం, మొక్కల ఎదుగుదలను, అంతర పంటల సాగును రైతులకు వివరించాలి. ప్రస్తుతం ఇతర దేశాల నుంచి దిగుమతి సుంకాన్ని పెంచటంతో దేశీయంగా గెలల ధరలు పెరగగా మున్ముందు గెలల అమ్మకం, ధరల తగ్గుదల, విక్రయ సమస్యలు తలెత్తకుండా చూడాలి. రాయితీ మొత్తాన్ని సకాలంలో విడుదల చేయాలి. – పంట బీమా వర్తింపజేయాలి. ఆయిల్‌పాం మొక్కలు నాటిన 5 ఏళ్ల నుంచి ఎకరాకు రూ.44 వేల వరకు పంట రుణాన్ని ఇవ్వనుండగా తొలి సంవత్సరం నుంచే రుణాన్ని మంజూరు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

## పిల్లల దత్తత...చట్టబద్ధత

గోదావరిఖని : నిబంధనలు పాటించకుండా చిన్నారులను అక్రమంగా దత్తత తీసుకోవడం.. విక్రయించడం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆర్మూర్‌లో ఇటీవల కన్నతల్లే ముగ్గురు కుమారులను అక్రమంగా విక్రయించినట్లు బయటపడింది. దీంతో ఆ తల్లిపై, పిల్లలను కొనుగోలు చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నారుల అక్రమ విక్రయం వల్ల పర్యవేక్షణ లోపించి.. వారిని అసాంఘిక కార్యకలాపాల్లోకి దించే ప్రమాదం ఉంది. పిల్లలు కలగనివారు చట్టప్రకారం, ప్రభుత్వ నిబంధనల మేరకు దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

**పెంచే స్థోమత లేకపోతే..**

పిల్లలను పెంచే స్థోమత లేనివారు, వద్దనుకునే దంపతులు వారిని శిశు సంక్షేమ కమిటీకి అప్పగించాలి. నిబంధనల ప్రకారంగా వారిని ఆయా జిల్లాలోని శిశు గృహలో చేర్చుకుంటారు. వారిని 45 రోజుల పాటు సంరక్షణలో ఉంచి.. మరోసారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అప్పటికీ వారు నిర్ణయం మార్చుకోకపోతే ప్రభుత్వమే పిల్లలను శిశు గృహలో చేర్చుకొని తిరిగి దత్తత ఇస్తుంది.

**ఉమ్మడి జిల్లా నుంచి 88 మంది**

ఉమ్మడి జిల్లా కేంద్రంలోని శిశు గృహలో 2011 నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, న్యూఢిల్లీ తదితర ప్రాంతాల్లోని వారికి 83 మందిని, ఇటలీ, అమెరికా, సింగాపూర్ దేశాలకు చెందిన వారికి అయిదుగురు పిల్లలను దత్తత ఇచ్చారు. వీరిలో అత్యధికంగా 71 మంది రాష్ట్రానికి చెందివారే.

**దరఖాస్తు విధానం**

కేంద్ర ప్రభుత్వ కారా(సెంట్రల్ అడాప్షన్ రిసోర్సు అథారిటీ) వెబ్‌సైట్‌లో పిల్లల కోసం దరఖాస్తు చేసుకోవాలి. సమగ్ర శిశు అభివృద్ధి శాఖ(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇస్తారు. దీని ఆధారంగా దరఖాస్తుదారులను సీనియారిటీ జాబితాలో చేరుస్తారు. సీనియారిటీ ప్రకారంగా బాబు/పాపను దత్తత ఇస్తున్నట్లుగా సమాచారం అందిన 48 గంటల్లోగా రూ.50 వేల డీడీ చెల్లించి వారు పిల్లలను తీసుకోవాలి. నెలలోగా జిల్లా కలెక్టర్ దత్తత ధ్రువీకరణ పత్రం అందిస్తారు. నిర్ణీత గడువులోగా బాబు/పాపను తీసుకోనట్లయితే సీనియారిటీ జాబితాలోంచి పేరు తొలగిస్తారు. తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే.



దత్తత పిల్లల పోషణ తదితర విషయాలపై వారికి 18 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షిస్తుంది. దరఖాస్తుదారులు పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తే వారిని తిరిగి తీసుకువెళతారు. పోస్టర్ కేర్‌లో భాగంగా వారికి 21 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు వసతి కల్పిస్తూ చదివిస్తారు.

**ఎవరు అర్హులు**

తోబుట్టువులను ఒకే కుటుంబానికి దత్తత ఇస్తారు. నివాసం ఉంటున్న జిల్లాలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

బాలల హక్కులు దుర్వినియోగ పరిచిన వారు, చట్టప్రకారంగా శిక్ష అనుభవించిన వారు అనర్హులు.

పిల్లలను దత్తత పొందేవారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి. ఆర్థిక స్థిరత్వం కలిగి ఉండాలి

సంతానం లేని దంపతులు, వితంతువులు, విడాకులు తీసుకున్న వారు ఒంటరిగా జీవిస్తున్న వారు– ఒంటరి మహిళలు అబ్బాయి, అమ్మాయిల్లో ఎవరినైనా దత్తత తీసుకోవచ్చు. ఒంటరి పురుషులు మాత్రం కేవలం అబ్బాయిని మాత్రమే తీసుకోవాలి.

జతచేయాల్సిన పత్రాలు భార్యాభర్తలు కలిసి ఉన్న ఫొటోలు–4, ఆధార్‌కార్డులు, ఒకరిది పాన్‌కార్డు.

విద్యాసంస్థ జారీ చేసిన జనన.. రూ.2 లక్షలకు పైన ఆదాయ పత్రాలు.

సబ్ రిజిస్ట్రార్ జారీ చేసిన దంపతుల వివాహ ధ్రువీకరణ పత్రం, దంపతుల ఆరోగ్య ధ్రువీకరణ పత్రం – దంపతులపై కేసులు లేనట్లుగా ఠాణా నుంచి ధ్రువీకరణఆస్తుల వివరాలు. ఒంటరి వారైతే విడాకుల డిక్రీ/మరణ ధ్రువపత్రం, బంధువుల జమానతు పత్రాలు.

## కేజీబీవీలు, యూఆర్‌ఎస్‌ల్లో కుంటుపడిన బోధన

సిరిసిల్ల : సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె ప్రభావం బోధనపై పడింది. జిల్లాలోని కేజీబీవీలు, యూఆర్‌ఎస్‌లో విద్యాబోధన నిలిచిపోయింది. మండల విద్యాశాఖ కార్యాలయాలు తెరవడం లేదు. భవిత కేంద్రాలు మూతపడ్డాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. విద్యాశాఖలో అనుబంధంగా గత 19 సంవత్సరాలుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది పని చేస్తున్నారు. డీపీవో సిబ్బంది అయిదుగురు, కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉద్యోగులు, సిబ్బంది 294, సీఆర్‌పీలు 50, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 13, ఐఈఆర్‌పీలు 13, మెసెంజర్స్ 13 మంది పని చేస్తున్నారు. వీరంతా సమ్మెబాట పట్టడంతో జిల్లాలోని 13 కేజీబీవీలతోపాటు ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల (యూఆర్‌ఎస్), భవిత కేంద్రాల్లో బోధన కుంటుపడింది. జిల్లాలోని కొన్ని కేజీబీవీల్లోనే ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తికాలేదు. పాఠాలు చెప్పేవారు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రతి కేజీబీవీలో ఇద్దరు టీచర్లు, ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉంటున్నారు. విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుండగా, సిబ్బంది మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో సిలబస్ పూర్తి చేసి రివిజన్, ప్రత్యేక తరగతులతో పాటు స్లిప్ టెస్టులు నిర్వహించే సమయంలో కేజీబీవీ ఉద్యోగులు సమ్మెబాట పట్టడం తీవ్ర ప్రభావం చూపనుంది.

**సీఆర్‌పీల పనులు ఎలా...**

జిల్లాలో 33 క్లస్టర్లు ఉండగా 50 మంది సీఆర్‌పీలు పని చేస్తున్నారు. వీరిని కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కేటాయించారు. ఒక్కో సీఆర్‌పీ వారి క్లస్టర్ పరిధిలోని ఒకటి లేదా రెండు పాఠశాలలను సందర్శించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాల సమాచారాన్ని పరిశీలిస్తుంటారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తారు. పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూడైస్‌లో నమోదు చేస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లోని ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినపుడు ఆ క్లస్టర్ పరిధిలోని సీఆర్‌పీ ఆ పాఠశాలను నడిపిస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం, పాఠశాల ఖర్చుల వివరాలు సేకరించి జిల్లా విద్యాధికారులకు అందజేయడం చేస్తుంటారు.

**ఇవీ డిమాండ్‌లు...**సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. అప్పటి వరకు పే స్కేలు ఇవ్వాలి.

ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి. ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు చెల్లించాలి. ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలి. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు 12 నెలల వేతనం ఇవ్వాలి. ఉద్యోగులందరికీ రీ ఎంగేజ్ విధానాన్ని తొలగించాలి.

**హామీలు నెరవేర్చాలి**

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిరవధిక సమ్మె చేస్తున్నాం. ప్రస్తుతం అందరూ సమ్మెలోకి వస్తే విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని, ప్రతి కేజీబీవీలో నలుగురు పని చేస్తున్నారు. ప్రభుత్వం మరో మూడు రోజుల్లో స్పందించి డిమాండ్లను నెరవేర్చకుంటే పూర్తి స్థాయి సమ్మెలోకి వెళ్తాం. కేజీబీవీలు, యూఆర్‌ఎస్‌లకు తాళం వేసి విద్యాశాఖ కార్యాలయంలో అప్పగిస్తాం. ఇప్పపూల దేవేందర్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

## నేత.. నీటిరాత..!

నల్గొండ: ఉమ్మడి జిల్లా రైతులకు సాగునీటి ప్రాజెక్టుల పనులు ఊరట కలిగిస్తున్నాయి. యాసంగి పంటకాలానికి సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టు కింద వారాబందీ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నారు. నాగార్జునసాగర్, పులిచింతల, మూసీ ప్రాజెక్టులతో ఏటా ఉమ్మడి జిల్లాలో 15 లక్షల ఎకరాల మేర వివిధ పంటలకు సాగునీటిని అందుతున్నాయి. వానాకాలంలో 12.20 లక్షల ఎకరాల్లో వరి, 1.50 లక్షల ఎకరాల్లో మిగిలిన పంటలు సాగవగా.. యాసంగిలోనూ గరిష్ఠంగా 14 లక్షల ఎకరాల వరకు సాగుచేయనున్నారు. **పురోగతిలో ప్రాజెక్టులు**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజుర్‌నగర్ నియోజకవర్గంలో సాగర్ ఎడమకాల్వపై ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తి చేయనున్నారు. రూ.817 కోట్లతో పులిచింతల నుంచి ముత్యాల బ్రాంచ్ కెనాల్(ఎంబీసీ)కు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించనుండగా.. ప్రస్తుతం భూసేకరణ పనులు జరుగుతున్నాయి. జాన్‌పాడులో రూ.118 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులు, మేళ్లచేరువు, చింతలపాలెంతో పాటు మిగిలిన 6 చోట్ల సుమారు రూ.500 కోట్లతో ఎత్తిపోతల పథకాల పనులు పురోగతిలో ఉన్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నల్గొండ నియోజకవర్గ కేంద్రంలో మొత్తం రూ.50 కోట్లతో నర్సింగ్‌భట్ల, కంచనపల్లి–బక్కతాయికుంట, కనగల్ మండలంలోని పొనుగోడు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేశారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్‌ఎల్‌బీసీ) పథకానికి ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,540 కోట్లు పెంచి ఆ నిధులు మంజూరు చేశారు. బేరింగ్ బిగింపు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండ్లిపాకల నిర్మాణాల పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మునుగోడులో చర్లగూడెం, లక్ష్మణాపురం రిజర్వాయర్లకు కృష్ణానీటిని, పిల్లాయిపల్లి కాలువలోకి గోదావరి నీటిని తరలించనున్నారు. మొత్తం 669 చెరువులతో పాటు వాగులపై చెక్‌డ్యాంలు, మట్టితో కూడిన మత్తళ్లు, శేషలేటి వాగు, వెల్మకన్నె ఫీడర్ ఛానల్‌లను అభివృద్ధి చేస్తే నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించే అవకాశం ఉంది. భువనగిరిలో బునాదిగాని కాలువ పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.269 కోట్లు మంజూరు చేయగా పనులు త్వరలో జరగనున్నాయి. కాళేశ్వరం ప్యాకేజీ–16లో భాగంగా నృసింహసాగర్ జలాశయం నుంచి ముత్తిరెడ్డి గూడెం, రాయగిరి చెరువులతో పాటు స్థానికంగా ఉన్న 10 చెరువుల్లోనూ నీళ్లు నింపనున్నారు. భవిష్యత్తులో కుడి కాలువ ద్వారా బీబీనగర్, భువనగిరి పెద్దచెరువులను నింపేలా కార్యాచరణ సిద్ధమవుతుంది. మూసీపై నిర్మాణంలో ఉన్న ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాల్వలకు రూ.565 కోట్ల నిధులను మంజూరు చేశారు. నాగార్జునసాగర్‌లో ఇప్పటికే డీ–8, డీ–9 కాల్వల సమస్య పరిష్కారం కావడంతో రంగుండ్ల, కుంకుడు చెట్టు గ్రామాల పరిధిలో ఉన్న 7 వేల ఎకరాల్లో, త్వరలో నెల్లికల్ ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయితే 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

మిర్యాలగూడలో గత మూడేళ్ల నుంచి సుమారు రూ.500 కోట్లతో దాదాపు 8 వేల ఆయకట్టుకు సరిపడా కృష్ణానదిపై వాడపల్లి–బొత్తలపాలెం, అడవిదేవులపల్లి మండలంలోని దున్నపోతుల గండి, మూసీ నదిపై కొంద్రపోల్–కేశవాపురం ఎత్తిపోతల పథకాల పనులు జరుగుతున్నాయి. దేవరకొండలో ఎస్సెల్బీసీ సొరంగం మార్గం పనులు ముందుకు సాగుతున్నాయి. రూ.30 కోట్లతో డిండి ఎత్తిపోతలతో పాటు పెండ్లిపాకల, నక్కలగండి పనులు తుది దశలో ఉన్నాయి.

చురకలు



# మెట్రో విస్తరణకు త'రుణం.. కేంద్రం అనుమతే కీలకం'

హైదరాబాద్ : మెట్రోరైలు రెండోదశకు నిధుల లభ్యత పెద్ద సమస్య కాదంటోంది హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ (హెచ్ఏఎంల్). ప్రాజెక్ట్‌కు కేంద్రం అనుమతి ఇస్తే అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థలు నిధుల మంజూరుకు సుముఖంగా ఉన్నాయని మెట్రో వర్గాలు అంటున్నాయి. 2 కంటే తక్కువ శాతానికే రుణం మంజూరు చేయడంతోపాటు పదేళ్ల మారటోరియం, 30 ఏళ్లపాటు చెల్లింపులకు అవకాశం ఉండటంతో ప్రాజెక్ట్ ఆరంభమైన మొదటిరోజు నుంచే లాభాల్లో నడిచే ఆస్కారం ఉంటుందని హెచ్ఏఎంల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు.

**పదేళ్లదాకా వెసులుబాటు**

జైకా వంటి సంస్థలు ప్రభుత్వ ప్రాజెక్ట్‌లకు ఇచ్చే రుణాలపై పదేళ్లపాటు మారటోరియం ఉంటుంది. అంటే రుణం పదేళ్ల వరకు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆ తర్వాత 30 ఏళ్లపాటు చెల్లిస్తే సరిపోతుంది. అప్పటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నోరెట్లు పెరుగుతుంది. కాబట్టి తిరిగి




చెల్లింపులు పెద్ద భారం కావు అనేది మెట్రో వర్గాల మాట.

**రుణాలు ఎవరిస్తారంటే..**

మెట్రోరైలు రెండోదశలో 76.4 కి.మీ. మార్గానికి రూ.24,269 కోట్ల అంచనాలతో సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు రూపొందించి ప్రభుత్వం కేంద్రానికి పంపింది. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో చేపట్టేలా ప్రతిపాదించారు. ప్రాజెక్ట్ వ్యయంలో ఈక్విటీలో 30 శాతం రాష్ట్రం, 18 శాతం కేంద్రం భరించేలా ప్రతిపాదించారు. మిగిలిన దాంట్లో 48 శాతం అంటే రూ.11,693 కోట్లు రుణాల ద్వారా సమకూర్చుకోవాలనేది ప్రణాళిక.ఇంతపెద్ద మొత్తం రుణం తక్కువ వడ్డీకి తీసుకోవాలంటే అంతర్జాతీయ బ్యాంకులు జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ వంటివైతేనే సాధ్యం. పలు అంతర్జాతీయ బ్యాంకులు నిధులు ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నట్లు హెచ్ఏఎంఎల్ అధికారులు తెలిపారు. కేంద్రం సావరిన్ గ్యారంటీ ఇవ్వాలి. ఏ బ్యాంకు నుంచి ఎంత రుణం తీసుకోవాలో కూడా కేంద్రమే నిర్ణయిస్తుంది. మిగిలిన 2 శాతం ప్రాజెక్టు వ్యయాన్ని పీపీపీ ద్వారా సేకరిస్తారు.

# పైన చుక్‌చుక్.. కింద రయ్‌రయ్



హైదరాబాద్: మొదటిసారి డబుల్ డెక్కర్ పైవంతెనల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. ఎల్బీనగర్ నుంచి ఆరాంఘర్ వరకు ఉన్న ఇన్నర్ రింగు రోడ్డుపై ఇవి నాలుగు రానున్నాయి. నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ చౌరస్తా, శంషాబాద్ మీదుగా విమానాశ్రయం వెళ్లే 36.8కి.మీ పొడవైన మెట్రో రైలు మార్గంతో వీటిని అనుసంధానిస్తారు. కొత్తగా నిర్మించే పైవంతెనల వద్ద మాత్రం రెండో అంతస్తులో మెట్రో ఉంటుంది. ఇందుకోసం పిల్లర్లను ఎత్తుగా నిర్మించి మెట్రో మార్గానికి వదులుతారు. ఈ విధమైన అనుసంధానంతో.. మెట్రో కారిడార్ నిర్మాణ వ్యయం కొంత మేర తగ్గుతుంది. రహదారిపై స్థలం కలిసి వస్తుంది. ట్రాఫిక్ సమస్యకు 100శాతం పరిష్కారం లభిస్తుందని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. ఈ నాలుగు నిర్మాణాల అంచనా వ్యయం రూ.955కోట్లు. అందుకు సంబంధించి మెట్రో రైలు సంస్థ, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డిజైన్లను రూపొందించే పనిలో ఉన్నాయి.

**స్థలం.. నిధులు సద్వినియోగం..**ప్రస్తుతమున్న రోడ్డు మార్గంపై పైవంతెనలను నిర్మిస్తే వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయి. పైవంతెన నిర్మించాక.. అదే రోడ్డుపై మెట్రో రైలు మార్గాన్ని నిర్మిస్తే.. తొలగిపోయిన ట్రాఫిక్ సమస్య మళ్లీ పుట్టుకొస్తుంది. ఉదాహరణకు.. బేగంపేట విమానాశ్రయం కూడలి. గతంలో కూడలిలో పైవంతెన నిర్మించారు. కొన్నేళ్లకు పైవంతెన పక్కన మెట్రో మార్గం కోసం పిల్లర్లను నిర్మించారు. దీంతో బేగంపేట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే రోడ్డు మార్గం కుంచించుకుపోయింది. భవిష్యత్తులో మెట్రో రైలు మార్గం అవసరమున్న రహదారులపై డబుల్ డెక్కర్ పైవంతెనలను నిర్మిస్తే ప్రజాధనం, స్థలం సద్వినియోగం అవుతాయని నిపుణులు గుర్తుచేస్తున్నారు.

**రెండు మార్గాల్లో ప్రతిపాదించినా..**

నగరం నుంచి ఆదిలాబాద్, కరీంనగర్ వైపు వెళ్లే రెండు జాతీయ రహదారులపై ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి మార్చిలో శంకుస్థాపన చేశారు. ప్యారడైజ్ కూడలి నుంచి సుచిత్ర కూడలి మీదుగా కండ్లకోయ వరకు, జేబీఎస్ నుంచి తాడ్‌బండ్, అల్వాల్, తూముకుంట వరకు ఆరు లైన్ల పైవంతెనలను నిర్మించాలన్నది ప్రణాళిక. ఆయా మార్గాల్లో ఓఆర్ఆర్ వెలుపలి వరకు భవిష్యత్తులో మెట్రో సేవలను పొడిగించాలన్న ఆలోచనతో.. ఎలివేటెడ్ కారిడార్లతో మెట్రో మార్గాన్ని అనుసంధానిస్తామని సర్కారు అప్పట్లో ప్రకటించింది. డబుల్ డెక్కర్ పైవంతెనల మార్గానికి సంబంధించి హెచ్ఎండీఏ, మెట్రో రైలు సంస్థలు డిజైన్లపై కసరత్తు చేస్తున్నాయి.

**ఎక్కడెక్కడంటే..**

1) టీకేఆర్ కాలేజీ కూడలి, గాయత్రినగర్, మందమల్లమ్మ కూడళ్లు.
2) ఒమర్ హోటల్ నుంచి సోయబ్ హోటల్ వరకు వయా మెట్రో ఫంక్షన్‌హాల్ మీదుగా
3) బండ్లగూడ-ఎర్రకుంట క్రాసు రోడ్డు కూడలి మీదుగా
4) మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్డు, కాటేదాన్ కూడళ్ల మీదుగా

**ప్రణాళిక లోపంతో..**ఎల్బీనగర్ కూడలి, బైరామల్‌గూడ కూడలి, ఒవైసీ జంక్షన్, చాంద్రాయ ణగుట్ట జంక్షన్, హైటెక్‌సిటీలోని కొత్తగూడ జంక్షన్, గచ్చిబౌలి చౌరస్తా, జేఎన్‌టీయూ కూడళ్లలో పైవంతెనలు నిర్మించారు. ఎల్బీనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట వరకు ఎక్స్‌ప్రెస్‌వే పనులు పురోగతిలో ఉన్నాయి. ఆయా మార్గాలన్నింటిలో మెట్రో సేవలను విస్తరిస్తామని గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రకటించాయి. కానీ.. డీపీఆర్‌ను రూపొందించలేదు. రోడ్డు అభివృద్ధి పనుల్లో మెట్రో ప్రాజెక్టుకు స్థలం వదలాలన్న జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ సూచనలను పట్టించుకోకపోవడం.. ప్రణాళికా లోపాలకు అద్దం పడుతోంది.

# అర్థంతర పనులు.. రెట్టింపు కష్టాలు

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. 'మన ఊరు-మన బడి' పథకం కింద జిల్లాలోని 191 పాఠశాలల్లో సుమారు రూ.250 కోట్లతో పనులు ప్రారంభించినా నిధుల కొరతతో నిలిచిపోయాయి. ఇటీవల అమ్మ ఆదర్శ బడి కింద చేపట్టిన పనులదీ ఇదే పరిస్థితి. **12 రకాలు..** భారాస ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి పథకం కింద తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, అదనపు గదులు, వంట గది, ప్రహరీ, భవనాలకు రంగులు వేయడం, విద్యుత్తు, ఫర్నిచర్, పచ్చదనం పెంపు, భోజన గది, డిజిటల్ ల్యాబ్.. ఇలా 12 రకాల పనులు ప్రారంభించారు. రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సందిగ్ధం నెలకొంది. నిధులు రాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. ఈ ఏడాది అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా 545 చోట్ల మౌలిక వసతుల కల్పనకు రూ.29.63 కోట్లతో చేపట్టిన పనులు కూడా వెక్కిరిస్తున్నాయి. అసంపూర్తి పనులతో బోధనకు ఇబ్బంది ఏర్పడుతోంది. పలు పాఠశాలల్లో ఆరుబయట తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు.

సుల్తానాబాద్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి రూ.29 లక్షలు మంజూరయ్యాయి. గుత్తేదారు రూ.14.50 లక్షలు వెచ్చించి పలు పనులు చేసి, బిల్లులు రాకపోవడంతో ఆపేశారు. విద్యార్థులు తరగతి గదుల్లో, వరండాలో, చెట్ల కింద భోజనం చేయాల్సి వస్తోంది.దుర్గంధంతో విద్యార్థులకు అసౌకర్యంధర్మారం ఆదర్శ పాఠశాలకు రూ.13.61 లక్షలు మంజూరు కాగా మరుగుదొడ్లు, మూత్రశాలల మరమ్మతు, కిటికీలు, వెంటిలేటర్లకు దోమల జాలీలు, కుళాయిలు ఏర్పాటు చేయించారు. వసతిగృహం ముందు సెప్టిక్ ట్యాంకు నిర్మాణం చేపట్టగా ప్లాస్టరింగ్ చేసి పైపులైనుతో అనుసంధానించాల్సి ఉంది. పక్కనున్న తరగతి గదుల్లోకి భరించలేదని దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు తెలిపారు.

మరమ్మతు మమఇద్లాపూర్ ప్రాథమిక పాఠశాలకు రూ.4.40 లక్షలు మంజూరు కాగా పాత మరుగుదొడ్లకే మరమ్మతులు చేసి, ఎంబీ రికార్డు చేసినట్లు తెలుస్తోంది. తలుపులు సరిగ్గా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. నాసిరకంగా, తూతూ మంత్రంగా పనులు చేసి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి.

**రికార్డు చేసినా పైసా రాలే!** వడ్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.52 లక్షలు మంజూరు చేసింది. గుత్తేదారు బిల్లులు రాకపోవడంతో ఏడాది కిందట పనులు అర్ధంతరంగా వదిలేశారు. రూ.15 లక్షలకు ఎంబీ రికార్డు చేసినా పైసా రాలేదని గుత్తేదారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తి పనులతో భోజన సమయంలో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు.కలెక్టర్ ఆదేశించినా అంతే!బేగంపేట ఉన్నత పాఠశాల భోజనశాలలో విద్యుత్తు సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం పనులు చేపట్టగా అసంపూర్తిగా ఉన్నాయి. తరగతి గదులు, పాఠశాల ప్రహరీ నిర్మాణం, మైదానం సరిచేయడం వంటి పనులు జరగాల్సి ఉంది. గతంలో కలెక్టర్ శ్రీహర్ష పాఠశాలను సందర్శించి పనుల పూర్తిపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రూ.16 లక్షలు మంజూరు చేసినా గుత్తేదారు సమస్యతో పనులు జరగడం లేదు.

పిల్లర్లతో వదిలేశారు!గోపాల్‌పూర్(పెద్ద ఓదాల) ఎంపీపీఎస్ పాఠశాలలలో భవనాన్ని పూర్తిగా తొలగించారు. తిరిగి పిల్లర్ల వరకు నిర్మించి అర్ధంతరంగా వదిలేశారు. అడవిసోమన్‌పల్లి యూపీఎస్‌లో వంటగది, భవనం ప్లాస్టరింగ్, సింక్ పనులు ఇంకా పూర్తి కాలేదు. అర్ధంతర పనులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

నోరు తెరిచిన సంపులుమండలంలోని 29 పాఠశాలల్లో పనులు చేపట్టగా కొన్ని చోట్ల పూర్తయినా చాలా చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. జిల్లెల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సంపు వద్ద పై కప్పు అసంపూర్తిగా వదిలేశారు. లక్కారం పంచాయతీ కాశిపల్లి బడిలో సంపుపై కప్పు వేయకపోవడంతో ఉపాధ్యాయుడు తాత్కాలికంగా చెక్కలు ఏర్పాటు చేశారు.వర్షాకాలంలో ఇబ్బందులు కుక్కలగూడూరు ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణం చేపట్టగా బిల్లులు రాక పనులు ఆగిపోయాయి. గోడల వరకు పనులు చేసి, పైకప్పు వేయకపోవడంతో వర్షాకాలంలో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద బోరు మోటారు నుంచి ట్యాంకు వరకు పైపులైను అనుసంధాన పనులు, వాష్‌బేసిన్‌కు నల్లాల కనెక్షన్‌తో పాటు టైల్స్ పనులు చేయాల్సి ఉంది.

# అందని ద్రాక్షగా రాయితీ పరికరాలు




కరీంనగర్ : దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంలా తయారైంది రైతుల పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా 7898 ఎకరాల్లో పండ్లు, కూరగాయలు, పూలు సాగు చేస్తున్న అన్నదాతలకు.. ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ద్వారా అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి వారికి అవసరమైన రాయితీ విత్తనాలు, పరికరాలు అందించాల్సి ఉంటుంది. అదేమి లేకపోవడంతో ఉద్యానశాఖ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. రాయితీ పరికరాలైన డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు ప్రభుత్వం ఈ ఏడాది జిల్లాకు 361 హెక్టార్లకు లక్ష్యం విధించింది. అయితే ఇప్పటివరకు 198.47 హెక్టార్లకు మాత్రమే మంజూరు చేశారు.

**మంజూరు ఇలా..**

పరికరాలకు అవసరమైన రైతులు తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఉద్యానశాఖ సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో రైతు పొలాన్ని పరిశీలించి ఎన్ని పైపులు పడుతాయనేవాటిపై ఆరా తీస్తారు. రాయితీ పోను మిగతా డబ్బు ఎంతో చెప్పి సంబంధిత డ్రిప్ పైపులు సరఫరా చేసే సంస్థకు డీడీ తీయించి పంపించాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో జిల్లా వ్యాప్తంగా జరగటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కానరాని అవగాహన సదస్సులు**

ఉద్యానశాఖ అధికారులు కూరగాయలు, పండ్లు, పూలు పండించే రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి.. శాస్త్రవేత్తల ద్వారా వారికి అవసరమైన సలహాలు, సూచనలు, రాయితీ విత్తనాలు, ఎరువులు, పరికరాలు, పంటకు తెగుళ్లు సోకితే ఏ పురుగుమందు వేయాలనేది అవగాహన కల్పించాలి. అయితే సదస్సులు నిర్వహించినట్లు కాగితాలకే పరిమితమవుతోందని రైతులు వాపోతున్నారు.

**దరఖాస్తు విధానం**

రాయితీ పరికరాల కోసం %www.tgmip.com% వెబ్‌సైట్‌లో పట్టాదారు పాస్‌బుక్, రైతు ఫొటో, ఆధార్, తాజా 1బి పహణీతో దరఖాస్తు చేయాలి. ఒకసారి రాయితీ పొందిన రైతులు ఏడేళ్ల వరకు తిరిగి పొందటానికి అనర్హులు. ఉన్నత వర్గానికి చెందిన రైతులకు 80 శాతం, బీసీలకు 90శాతం రాయితీతో అందజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ కల్పిస్తారు.

**డీడీలు పెండింగ్‌లో లేవు** గతంలో డీడీలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతం మా కార్యాలయం వద్ద పెండింగ్‌లో ఏమి లేవు. రైతులకు వంద శాతం న్యాయం చేస్తాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.శ్రీనివాసరావు, డీడీ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ

**నేనే కొనుగోలు చేసుకున్నా..**

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఎనిమిది నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. కార్యాలయానికి వెళ్లినప్పుడల్లా ఏదో కారణం చెప్పి పంపించేవారు. విసిగిపోయి రూ.1.60 లక్షలతో డ్రిప్ కొనుగోలు చేసి కూరగాయల తోటకు ఏర్పాటు చేసుకున్నా.మంద తిరుపతి, గోపాల్‌పూర్, కరీంనగర్ గ్రామీణం

# కూల్చేటివి.. కూల్చనివి

హైదరాబాద్ : చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కుల సంరక్షణ కోసం ఈ ఏడాది జులై 19న రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ తేదీనే అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల భవిష్యత్తును నిర్ణయిస్తోంది. జులై నెలకు ముందు కట్టిన వినియోగంలోని ఇళ్లను కూల్చబోమని, తర్వాత కట్టిన నిర్మాణాలను కూల్చుతామని కమిషనర్ ఎ.వి.రంగనాథ్ ఇప్పటికే ప్రకటించారు. దీనిపై హైడ్రా తీసుకున్న విధానపర నిర్ణయాలను వివరిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు.

**వీటిని కూల్చుతాం..**రద్దయిన అనుమతులు చూపుతూ జులై తర్వాత నిర్మాణ పనులు కొనసాగిన ఇళ్లను కూల్చుతాం.ప్రభుత్వ భూములను ఆక్రమించి పేదలకు విక్రయిస్తున్న ఆక్రమణదారులపై కఠిన చర్యలుంటాయి.ఎలాంటి నిర్మాణమైనా, ఏ దశలో ఉన్నా.. కోర్టు నుంచి కూల్చివేత ఆదేశాలు వచ్చినప్పుడు ఆగేది లేదు.

హైడ్రా ఏర్పాటయ్యాక చెరువుల్లో చేపట్టిన నిర్మాణాలను కూల్చడంతో పాటు అనుమతి ఇచ్చిన అధికారిపై కేసు నమోదు చేస్తాం.

ఎలా గుర్తిస్తామంటే.. క్షేత్రస్థాయి పరిశీలన, గూగుల్ ఎర్త్ పటాలతో నిర్మాణం జులై నాటికి పూర్తయిందా, లేదో ప్రాథమికంగా గుర్తిస్తాం. లైడార్ సర్వే, రిమోట్ సెన్సింగ్ సర్వేలతో భూముల పటాలను పరిశీలిస్తూ సెన్సార్ల సాయంతో ఆక్రమణలను గుర్తించేందుకు జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రంతో ఒప్పందం చేసుకుంటున్నాం. పునరుజ్జీవానికి ప్రతిపాదనలు: ఇప్పటికే కూల్చివేతలు పూర్తయిన 12 చెరువులకు పునరుజ్జీవం కల్పించే ప్రతిపాదనలను పంపాం. 200 ఎకరాల భూమిని ఆక్రమణల విడిపించాం. 5వేల ఫిర్యాదులు విచారణలో ఉన్నాయి.

# ఉదయమే గిర్రుమంటోంది



హైదరాబాద్: విద్యుత్తు డిమాండ్ సాధారణంగా లైటింగ్ లోడ్ అధికంగా ఉండే సాయంత్రం వేళల్లో నమోదవుతుంది. చలికాలంలో నగరంలో ఇందుకు భిన్నంగా ఉదయం పూట గరిష్ఠంగా ఉంటోంది. ఆ సమయంలో పిల్లలు పాఠశాలలకు, పెద్దలు కార్యాలయాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుంటారు. ఉదయాన్నే మోటార్లు, హీటర్ల వాడకం అధికంగా ఉండటమే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. **15 నిమిషాలకోసారి నమోదు..**విద్యుత్తు పంపిణీ సంస్థ ప్రతి 15 నిమిషాలకు కరెంట్ డిమాండ్ రీడింగ్స్‌ను నమోదు చేస్తుంది.జీహె చ్‌ఎంసీలో ఈ నెల 16న నమోదైన గణాంకాల ప్రకారం.. ఉదయం 7.30 నుంచి 7.45 గంటల మధ్య గరిష్ఠంగా 2,929 మెగావాట్లు, సాయంత్రం 6 నుంచి 6.15 గంటల నడమ 2,900, తెల్లవారుజా మున 2.30 నుంచి 2.45 గంటల మధ్య 1,593 మెగావాట్లకు దిగువన డిమాండ్ ఉంటోంది.

# పాలన మారి.. వార్డులో అధికారి



నల్గొండ : తీసుకున్న నిర్ణయంతో ప్రజల వద్దకే పురపాలన రానుంది. వార్డుకో కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి నుంచి పట్టణ ప్రజలకు అవసరమైన సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్‌కి ఓ అధికారిని నియమించి అన్ని రకాల సేవలు అక్కడి నుంచే అందించడం విజయవంతంగా కొనసాగుతోంది.వీఆర్ఏల సర్దుబాటులో భాగంగా నల్గొండ జిల్లాలోని 8 పురపాలికల్లో సుమారు 62 మందిని వార్డు అధికారులుగా నియమించింది. తాజాగా కొత్త పురపాలికల్లో సైతం వార్డు అధికారుల పోస్టులు మంజూరు చేసి, గ్రూప్-4 ద్వారా నియమితులైన 77 మందిని నల్గొండ జిల్లాకు కేటాయించడంతో వారిని జిల్లా కలెక్టర్ 8 పురపాలికలకు కేటాయించారు. 60 రోజుల్లోపు వారంతా తమకు కేటాయించిన పురపాలికల్లో నియామక ఉత్తర్వుల ప్రతులను అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.వార్డు అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించనున్నారు. పారిశుద్ధ్య సేవలు, సిబ్బందిపై పర్యవేక్షణ, మంచినీటి సరఫరా, ఆస్తి పన్నులు వసూళ్లు, అక్రమ నిర్మాణాల గుర్తింపు, వాటిపై చర్యలు, వార్డు పరిధిలో ఆసరా పింఛన్ల పంపిణీ, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాలు స్థానికంగా అందించనున్నారు. వార్డు కార్యాలయంలో ప్రజలు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందించే బాధ్యతలు నిర్వహించనున్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

గోదావరిఖని : రామగుండం నగరపాలక ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల సుమారు రూ. కోటి వ్యయంతో కొనుగోలు చేసిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లను వినియోగంలోకి తేవడంతో పాటు నగరపాలక కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను తిరిగి అదే విభాగంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. నగరపాలక నిర్వహణపై సమీక్షించిన జిల్లా పాలనాధికారి ఈ మేరకు నగరపాలక పారిశుద్ధ్య విభాగం అధికారులకు మార్గదర్శనం చేశారు. సుమారు 40 మంది పారిశుద్ధ్య కార్మికులు నగరపాలక కార్యాలయంలో వివిధ విభాగాల్లో ఉన్నారు. వారిని తిరిగి యథావిధిగా పారిశుద్ధ్య విభాగంలోకి తీసుకొని పనులు చేయించాలని, నూతన వాహనాలను సైతం వాడుకలోకి తేవాలన్నారు. తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సంస్కరిస్తే ప్రయోజనకరం**

రామగుండం నగరపాలక సంస్థలోని పారిశుద్ధ్య విభాగంలో మొత్తం 447 మంది ఒప్పంద కార్మికులు ఉండగా అందులో డ్రైవర్లు, డ్రెయిన్ క్లీనర్లు, స్వీపర్లు, చెత్త ఎత్తే కార్మికులు ఉన్నారు. వీరిలో కేవలం 192 మంది పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణలో వినియోగించే ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలపై విధుల్లో ఉన్నారు. రామగుండం నగరపాలికలో ప్రస్తుతం 14 ట్రాక్టర్లు, 50 ఆటో ట్రాలీలు చెత్త సేకరణలో వినియోగిస్తుండగా ట్యాంకర్లు, బ్లేడ్ ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు, బొలెరో వాహనాలున్నాయి. వీటిపై మొత్తం 100 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. చెత్త సేకరణ విభాగంలో కొందరు డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారు ఉన్నారు. అలాంటి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చినట్లయితే కార్మికుల సంఖ్య పెరగకుండానే నూతనంగా కొనుగోలు చేసిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లను వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉంది. నగరపాలక కార్యాలయంలో పనిచేస్తున్న 40 మంది పారిశుద్ధ్య కార్మికులను తిరిగి అదే విభాగంలోకి తీసుకోవడంలో కార్మికుల కొరత సైతం తీరే అవకాశం ఉంది. పాత ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు సైతం తరచూ మొరాయిస్తుండటంతో ఆయా డివిజన్లలో చెత్త సేకరణ నామమాత్రంగా జరుగుతోంది. నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలను వినియోగంలోకి తేవడంతో పాటు పాత వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తే చెత్త సేకరణ నిత్యం జరిగే అవకాశముంది.

# కమీషన్లు ఇస్తేనే .. ముందుకు

హైదరాబాద్: పలువురు అవినీతి ఇంజినీర్లు మరీ బరితెగిస్తున్నారు. సాధారణ గుత్తేదారులను డిమాండ్ చేసినట్లుగానే.. వారసత్వ కట్టడాలను పునరుద్ధరించే సంస్థలనూ వేధిస్తున్నారు. సాఫీగా సాగుతోన్న పనులకు అడ్డుపడుతున్నారు. ఈ వేధింపులు, సర్దార్‌మహల్‌ను పునరుద్ధరిస్తోన్న సంస్థను తాకాయి. అధికారులు కమీషన్లు అడగడంతో.. "మేము తాపీ మేస్త్రీ పనులు చేయట్లేదు. ఏళ్లనాటి వారసత్వ కట్టడానికి పూర్వవైభవాన్ని తీసుకొస్తున్నాం"అంటూ పనులు చేపట్టిన కన్సల్టెన్సీ నిపుణులు పలువురు ఇంజినీరింగ్ అధికారులకు తెగేసి చెప్పారు. అవసరమైతే కాంట్రాక్టు నుంచి తప్పుకుంటామని స్పష్టం చేశారు. పలువురు అవినీతి ఇంజినీరింగ్ అధికారుల తీరుతో వారసత్వ కట్టడాల పునరుద్ధరణ నత్తనడకన సాగుతోందనే విమర్శలొస్తున్నాయి.

**అటకెక్కిన పనులు..**

నగరవ్యాప్తంగా 142 వారసత్వ కట్టడాలున్నాయి. ఆయా కట్టడాలను



తిరిగి నిర్మించే పనులు మూడేళ్ల కిందట మొదలయ్యాయి. పురోగతి లేదు. నిధుల సమస్య, ఇంజినీర్ల చేతివాటం, స్థానిక సమస్యలు కారణమవుతున్నాయి. సర్దార్‌మహల్ పునరుద్ధరణ పనులు రూ.30 కోట్లతో మొదలవ్వగా, ఇప్పటివరకు 20 శాతం పనులే పూర్తయ్యాయి. పనులకు పలువురు ఇంజినీర్లు అవాంతరాలను సృష్టిస్తున్నారనే విమర్శలున్నాయి.సర్దార్ మహల్‌కన్నా ముందు ముర్గీచౌక్ పునర్నిర్మాణం మొదలైంది. ప్రారంభంలో పనులు చకచకా సాగినా..పునాదులు పూర్తయ్యాక ఆగాయి. 6 నెలలుగా ఇటుక కదల్లేదు. పురోగతి 20 శాతమే.లాడ్‌బజార్ అభివృద్ధి పనులు ఏడేళ్లుగా నానుతున్నాయి. త్వరలో రూ.36 కోట్లతో టెండర్లు పిలుస్తామని కుసాడ్ ఇంజినీర్లు చెబుతున్నారు.మూడేళ్ల కిందట రూ.16 కోట్లతో మీరాలం మండి పునరుద్ధరణ పనులు మొదలవగా, ఇప్పటికీ పనులు పట్టాలెక్కలేదు.

# పాస్‌పోర్టు అంటారు.. మోసాలు చేస్తారు

హైదరాబాద్: పాస్‌పోర్టుల దరఖాస్తు, మంజూరు ప్రక్రియలో నకిలీ ఏజెంట్ల జోక్యానికి అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా.. మోసపోతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. పోలీసుల నిఘా పెంచినా నాలుగైదు నెలల్లో 40 కేసులు నమోదయ్యాయి. దరఖాస్తు, మంజూరు ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుందని, ఏజెంట్లమంటూ వచ్చేవారి మాటలు నమ్మి మోసపోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీఎస్‌కే), 14 పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీవో పీఎస్‌కేలు) సేవలందిస్తున్నాయి. రోజూ 3,800 సాధారణ, తత్కాల్ పాస్‌పోర్ట్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్ల (పీసీసీ) అపాయింట్‌మెంట్లు మంజూరు అవుతున్నాయి. గ్రేటర్‌లో 2,226 పాస్‌పోర్టు, 110 పీసీసీ అపాయింట్‌మెంట్లు మంజూరవుతుండటంతో నకిలీ ఏజెంట్లు తిష్ఠవేస్తున్నారు. ధ్రువపత్రాల సమర్పణకు వచ్చేవారిని అటకాయిస్తూ త్వరితగతిన



చేయిస్తామంటూ రూ.5,000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేస్తున్నారు. ఉదంతాలివీ.. ఉప్పల్‌కు చెందిన శ్రీనివాస్.. తన కుమారుడి పాస్‌పోర్టుకు ఏజెంట్‌ను ఆశ్రయించారు. అతడి సూచనతో తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించాడు. స్క్రూటినీలో అధికారులు ఆరా తీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఏజెంట్‌కు రూ.10 వేలు ఇచ్చి మోసపోయాడు.అమీర్‌పేట్, బేగంపేట్, టోలిచౌకి పీఎస్‌కేల వద్ద కొందరు ఏజెంట్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. 3 రోజుల్లో పాస్‌పోర్టు వచ్చేలా చూస్తామంటూ బేరం కుదుర్చుకుంటున్నారు. డబ్బు తీసుకొని మొహం చాటేస్తున్నారు.కార్యాలయానికి వచ్చేవారిని అటకాయిస్తూ డబ్బులు దండుకుంటున్న ఘటనలు పెరగడంతో అధికారులు వాహనాలు నిలపకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనం నిలిపిన వెంటనే టోయింగ్ వాహనం వచ్చి వాహనాలను తీసుకెళ్తుండటంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. అవగాహన బోర్డులు ఏర్పాటుచేసి, పోలీసుల నిఘా పెంచారు.

# విద్యుత్తు ద్విచక్రవాహనాలదే హవా

హైదరాబాద్: విద్యుత్తు వాహనాల్లో మోటారు సైకిళ్లదే హవా. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు వాహనాల సంఖ్య 1.61 లక్షలు ఉండగా, గ్రేటర్ పరిధిలో 1.57 లక్షలు ఉన్నాయి. ఇందులో 1.43 లక్షల ద్విచక్ర వాహనాలే ఉన్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కేవలం 3,756 వాహనాలే ఉన్నట్లు రవాణా శాఖ గణాంకాలు చెబుతున్నాయి. విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు సైతం ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. గ్రేటర్ పరిధిలో 600 వరకు ఛార్జింగ్ కేంద్రాలు ఉన్నాయి.

కొనుగోళ్లకు ప్రోత్సాహకాలు..విద్యుత్తు కొనుగోలు దారులను ప్రోత్సహించేందుకు పన్ను రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2021లో ఉత్తర్వులు జారీ చేసింది. ద్విచక్ర వాహనాలు రెండు లక్షలు రిజిస్టర్ అయ్యేంత వరకు రోడ్ ట్యాక్స్‌తో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటి వరకు కేవలం 1.43 లక్షల ద్విచక్ర వాహనాలు మాత్రమే రిజిస్టర్ అయ్యాయి. మరో 56 వేల వాహనాల వరకు రాయితీ లభించనుంది. విద్యుత్తు వాహనాలు మార్కెట్‌లోకి వచ్చిన తొలినాళ్లలో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకోవటంతో.. కొనుగోళ్లు కొంత మందగమనంలో సాగాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం కొనుగోళ్ల సంఖ్య పెరుగుతోందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. వ్యక్తిగత, వాణిజ్య అవసరాలకు వినియోగించే కార్లు పది వేల వరకు రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల పూర్తి రాయితీ ప్రకటించింది. వ్యక్తిగత అవసరాలకు వినియోగించే 5 వేల కార్ల రిజిస్ట్రేషన్లు ఉత్తర్వులు జారీ చేసిన రెండేళ్లలో పూర్తయ్యాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే వాహనాల రిజిస్ట్రేషన్లు రెండు వేలకు మించకపోవటంతో సంఖ్యను మూడు వేలకు పరిమితం చేశారు.

# పత్తి శుద్ధి.. ఆదాయ లబ్ధి



తాండూరు : జిల్లాలో పత్తిని కొనుగోలు చేస్తున్న మిల్లర్లు ఆర్థిక లబ్ధి పొందుతున్నారు. అదే సమయంలో ఫీజుల రూపంలో సీసీఐకి ఆదాయం వస్తోంది. గ్రామాల నుంచి రైతులు వాహనాల్లో విక్రయానికి తీసుకు వస్తున్న పత్తిని తేమ శాతాన్ని బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. ఆమేరకు కొనుగోలు చేసిన పత్తిని మిల్లుల్లో యంత్రాల ద్వారా శుద్ధి చేస్తున్నారు.

**క్వింటాలు గింజలు రూ.5,500కు విక్రయం**

పంజాబ్, హరియాణ రాష్ట్రాలకు మిల్లు నుంచి బయటకు వచ్చిన పత్తి గింజలను బస్తాల్లో నింపి లారీల ద్వారా పంజాబ్, హరియాణ రాష్ట్రాలకు టన్నుల కొద్దీ ఎగుమతి చేస్తున్నారు. ఒక్కో క్వింటాలు పత్తి గింజలను రూ.5,000 నుంచి రూ.5,500 చొప్పున విక్రయిస్తున్నారు. గింజలను కొనుగోలు చేసిన మిల్లర్లు యంత్రాల ద్వారా గింజల నుంచి నూనెను, పిండిని బయటకు తీస్తున్నారు. క్వింటాలు గింజల నుంచి 90 కిలోల పిండి, 10 కిలోల వరకు నూనెను ఉత్పత్తి చేస్తున్నారు. పిండిని అక్కడి పాడి పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. ఆవులు, బర్రెలు పత్తి గింజల పిండిని తినడం ద్వారా పాల దిగుబడి ఎక్కువగా వస్తుంది.

**గుజరాత్, మహారాష్ట్రలకు సరఫరా**

మిల్లుల్లో పత్తిని నాణ్యంగా మార్చిన అనంతరం బేళ్లుగా తయారు చేస్తున్నారు. ఒక్కో పత్తి బేళు 168 కిలోల నుంచి 170 కిలోల వరకు ఉంటుంది. ఆర్డరు మేరకు గుజరాత్, మహారాష్ట్రలోని స్పిన్నింగ్ మిల్లులకు ఎగుమతి చేస్తున్నారు. బేల్స్ రూపంలో వచ్చిన పత్తిని పరిశ్రమల యజమానులు దారాలుగా మారుస్తున్నారు. వీటినే వస్త్రాల తయారీకి వినియోగిస్తున్నారు. గుజరాత్, మహారాష్ట్రలకు ఆర్డర్లు లేని సమయంలో జిల్లాలోని పత్తి మిల్లుల యజమానులు ఆంధ్రప్రదేశ్‌లోని స్పిన్నింగ్ మిల్లులతో పాటు హైదరాబాద్‌లోని మిల్లులకు ఎగుమతి చేస్తున్నారు. ఒక్కో బేల్ విక్రయం ద్వారా రూ.17,000 నుంచి రూ.22,000 ఆర్జిస్తున్నారు.

**ఫీజు రూపేణా సీసీఐకి**

మిల్లుల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తుంది. దీన్ని మిల్లర్లు నిర్ణీత లక్ష్యం మేరకు బేళుగా తయారు చేసి సీసీఐకి అప్పగిస్తారు. సీసీఐ నిర్ణయించిన మేరకు మిల్లులకు ఛార్జీలను చెల్లిస్తుంది. ఒక్కో మిల్లులో ఎన్ని బేల్స్ తయారు చేసి ఇవ్వాలనే విషయంలో ఇప్పటికే సీసీఐ మిల్లర్లకు లక్ష్యాన్ని విధించింది.

**ఇవీ లెక్కలు**

మొత్తం పత్తి మిల్లులు: 14
పత్తి సాధారణ సాగు: 2,31,338 ఎకరాలు
సాగైంది: 2,56,698 ఎకరాలు
ఉత్పత్తి అయ్యే పత్తి: 3,08,038 మెట్రిక్ టన్నులు
కేంద్రాల్లో సీసీఐ కొనుగోలు చేసే
పత్తి మెట్రిక్ టన్నుల్లో: 2,89,910
మిల్లర్లు కొనుగోలు చేసే పత్తి: 51,340 మెట్రిక్ టన్నులు

# సంచికి చిరుగు!



కరీంనగర్ : కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక కొనుగోలు కేంద్రంలో హమాలీ మోస్తున్న ఈ సంచికి చిల్లులు పడటంతో ధాన్యం వృథాకాకుండా గడ్డి పరకలతో ఇలా ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడికి మొదటి దఫాగా వచ్చిన వాటిలో పాతవి అందించగా.. ఇటీవల రెండో దఫాగా కొత్తవి పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ఇదే విధంగా పాత సంచులను అందించడంతో వాటిని తీసుకునేందుకు చాలా కేంద్రాల్లో అన్నదాతలు ముందుకు రాలేదు.

ఉమ్మడి జిల్లాలో ఇటీవలే ధాన్యం కొనుగోళ్లు ముమ్మరమయ్యాయి. కానీ ఎప్పటి మాదిరిగానే సమస్యలు ఎదురవుతున్నాయి. నిన్న మొన్నటి వరకు కల్లాల్లో కాంటాలు పెట్టడం లేదనే బాధ ఉండగా.. ఇన్నాళ్ల నిరీక్షణ తరువాత అందించే గన్నీ సంచులు నాసిరకంగా ఉండటం మరింత ఇబ్బందిని పెంచుతోంది. సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియ కార్యాచరణ పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణలో అధికారులు రూపొందించారు. పలు సమీక్షల్లో జిల్లా కలెక్టర్లకు అవసరమైన సంచులను ముందుగా సిద్ధం చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈసారి అవసరమైన సంచుల కోసం టెండర్లు నిర్వహించడంలో ఆలస్యం కావడం.. పైగా టెండర్లు కూడా పాత సంచుల కోసమే వేయడంతో జిల్లాకు అవే సరఫరా అయ్యాయని తెలుస్తోంది. గత సీజన్‌లో ఉపయోగించినవి పోనూ.. కొన్ని కొత్తవి జిల్లాలకు వచ్చాయి. ఇలా పాత, కొత్త కలయికతో కేంద్రాలకు గన్నీ సంచులను చేరవేశారు.

**రైతుకు కష్టమిలా..!**

కేంద్రాల్లో గత కొన్ని సీజన్ల నుంచి తరుగు కోసం 2-4 కిలోలను తీసుకుంటున్నారు. ఈసారి కూడా అది తప్పేట్లు లేదు. దీంతో అటు చిరుగులతో ధాన్యం కిందపడటంతోపాటు కాంటాలో తరుగు కోత వల్ల రెండు రకాల నష్టం ఎదురవుతుంది. రెక్కలు ముక్కలు చేసుకుని తీసుకొచ్చిన ధాన్యాన్ని చిరిగిన సంచుల్లో నింపడం కూడా ప్రహసనంగా మారుతోంది. చిల్లుల నుంచి కిందపడకుండా గడ్డి పరికలను అడ్డుపెడుతున్నారు. ప్రతి రైతుకు ఇచ్చే సంచుల్లో కొన్ని పాతవి కచ్చితంగా ఉంటున్నాయి. వాటిని తీసుకోకుంటే కొనుగోలు కేంద్రంలో ఇంకొన్నాళ్లు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంటుందని రైతులు వాటిని తీసుకుంటున్నారు. తరుగు కానీ.. చిరుగులతో నష్టం జరగనీ.. ఏదైతేనేమి పండించిన పంట కాంటా మీదికి పోతే చాలని అన్నదాతలు భావిస్తున్నారు. వీరి వ్యథను గమనించి అధికారులు అందుబాటులో ఉన్న పాత సంచుల చిరుగులకైనా కుట్లతో మరమ్మతు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఉన్నవాటినే సర్దుతూ..**

జగిత్యాల జిల్లాలో ఈ సీజన్‌లో ధాన్యం తరలింపునకు 1.15 కోట్ల బస్తాలు అవసరం. ఇందులో భాగంగానే 40 లక్షలు కొత్తవి సిద్ధం చేసి ఉంచారు. మిగతా సుమారుగా 75 లక్షల సంచులను పాతవే అందజేస్తున్నారు.

కరీంనగర్ జిల్లాలో కోటి అవసరమని అంచనా వేశారు. ఇందులో 46 లక్షలు పాతవి కాగా.. 54 లక్షలు కొత్తవి తేవాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు పాతవి, కొత్తవి కలిపి 45 లక్షల బస్తాలే ఉన్నాయి. ఇంకో 55 లక్షలు రావాల్సిన అవసరముంది.

పెద్దపల్లి జిల్లాలో కోటికిపైగా అవసరం. ప్రస్తుతం 23 లక్షలే ఉన్నాయి. ఇందులో పాతవి 14.60 లక్షలు, కొత్తవి 8.42 లక్షలు వాడుతున్నారు. మిగతా 77.88 లక్షల్లో కొత్తవి 46 లక్షలు, పాతవి 32 లక్షలు తీసుకొచ్చి రైతులకు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ గతంలో వినియోగించినవాటిని 45 శాతం వాడుతున్నారు. ఇక్కడ దాదాపుగా 80 లక్షలకుపైగా సంచులు అవసరమవగా.. ఇప్పటి వరకు సగానికిపైగానే అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ కూడా కొన్ని కేంద్రాలకు చిరిగినవే అందాయి.

**ధాన్యం వృథా అవుతోంది..**

మా దగ్గర అందరికి పాత సంచులనే ఇచ్చారు. అందులో కొన్ని కుట్టినవి ఉండగా.. చాలా వరకు చిల్లులు పడి చిరిగినవే ఉన్నాయి. మంచివి ఇస్తే బాగుంటుంది. ఇందులో నింపి కాంటా వద్దకు వెళ్లేలోపు కొన్ని కిలోలు వృథాగా కిందపడిపోతాయి. పైగా కాంటా వద్ద కూడా తరుగు తీస్తే మాకు నష్టం జరుగుతుంది.తోట సతీశ్, రైతు, అబ్బాపూర్, జూలపల్లి

# రూ.8 కోట్లు వ్యయం.. నిరుపయోగం

సిరిసిల్ల : టీజీఐఐసీ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో నిర్మించిన శీతల గిడ్డంగి, వేర్‌హౌస్ (ప్రాసెసింగ్ యూనిట్) నిర్లక్ష్యానికి గురవుతోంది. రైతులు, ఫల ఆధారిత పరిశ్రమలు నిర్వహించేవారు తోటకెళ్లి పండ్లు, కాయలు తెస్తే ఇక్కడ నిల్వ చేసుకోవచ్చు. రూ.8 కోట్ల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో దీనిని నిర్మించారు. పక్కనే 2,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వేర్‌హౌస్ (ప్రాసెసింగ్ యూనిట్) ఉంది. అయిదు ఎకరాల విస్తీర్ణంలోని ఈ యూనిట్‌ను 2023 ఏప్రిల్‌లో ఎల్లోస్ అండ్ గ్రీన్స్ అగ్రి ఫ్రెష్ కంపెనీకి కేటాయించారు. వారు ఇటీవల తమ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. మామిడి, అరటి, జామ, బొప్పాయి వంటి పండ్లతో పాటు టమాటా వంటి ఉద్యాన పంటలను నిల్వ చేసుకునేందుకు పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. 2023లోనే నిర్మాణం పూర్తయి ప్రారంభించినా ఇప్పటికీ నిరుపయోగంగానే ఉంది. జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో మామిడి, పసుపు, మిర్చి వంటి ఉద్యాన పంటల విక్రయాలు జరుగుతాయి. రైతులు పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తెచ్చిన వెంటనే మార్కెట్‌లోని ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇది అందుబాటులోకి వస్తే రైతులు తాము పండించే ఉద్యాన పంటల ఉత్పత్తులను నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. ఇక్కడ పంట నిల్వలు ఉన్నాయంటే వాటి కొనుగోలుకు అక్కడికే వ్యాపారులు వస్తుంటారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన గిడ్డంగిని అన్నదాతలకు అందుబాటులోకి తెస్తేనే ఫలప్రదం అవుతుంది. ఈ విషయమై టీజీఐఐసీ ప్రాంతీయ మేనేజర్ పద్మజను వివరణ కోరగా దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

# ఐటీ కారిడార్.. ఫ్యూచర్ సిటీలపై నజర్

హైదరాబాద్: రాజధాని పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు కార్యాచరణ రూపొందించారు. శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లోని ఐటీ కారిడార్, మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని ఫ్యూచర్‌సిటీల ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఏడాది జనవరి నుంచే ఆయా భూముల్లో ఆక్రమణలను తొలగిస్తున్నారు. సర్కారు స్థలాలు.. చెరువులను అక్రమార్కుల నుంచి రక్షించేందుకు డిజిటల్ సర్వేలు నిర్వహించనున్నారు.

**రికార్డుల్లో మాయాజాలం...**

ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు అక్రమార్కులు రికార్డుల



ను మార్చేసినట్టు అధికారులు గుర్తించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న భూముల్లో 60 శాతం నిజాం నవాబు హయాంలో దానమిచ్చినవే. వారసులు లేకపోవడంతో వాటిలో 90 శాతం ప్రభుత్వపరమయ్యాయి. అక్రమార్కులు తప్పుడు రికార్డులు సృష్టించడం, కొందరు నిజాం వారసుల నుంచి దానం పొందామని.. పత్రాలు సృష్టించి కోర్టులు ఆశ్రయిస్తున్నారు.శేరిలింగంపల్లి మండలంలోని మూడు గ్రామాల్లో 190 ఎకరాల ప్రభుత్వ భూములపై వివాదాలు కొనసాగుతున్నాయి. కొన్ని న్యాయస్థానాల్లో విచారణ స్థాయిలో ఉండగా, మరికొన్ని ట్రైబ్యునల్‌లో ఉన్నాయి.గండిపేట మండలంలోని నాలుగు గ్రామాల్లో 200 ఎకరాల భూములపై ప్రైవేటు వ్యక్తులు వివాదాలు సృష్టిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం రికార్డులు మార్చి ధరణిలోనూ పేర్లు వచ్చేలా చేసుకున్నారు.మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని 4 గ్రామాల్లో రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకునేందు కు ప్రైవేటు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు ప్రభుత్వ రికార్డులు మార్చేశారు.

# అమ్మకు కడుపుకోత

సిరిసిల్ల: తొలి కాన్పులో సహజ ప్రసవాలను ప్రోత్సహించడంలో వైద్య ఆరోగ్యశాఖ విఫలమవుతోంది. జిల్లాలో 80 శాతం గ్రామీణ ప్రాంతమే ఉంటుంది. 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అయిదు 24ఐ7 ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు జిల్లా జనరల్ ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రితోపాటు ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలోని ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రతి నెలా గర్భిణుల వివరాలు నమోదు చేయాలి. వీరికి అవసరమైన వైద్య పరీక్షలకు జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులకు తీసుకెళ్లాలి. చాలా ఆరోగ్య కేంద్రాల్లో రికార్డుల్లో నమోదుకే పరిమితమవుతోంది. కొన్ని కేంద్రాల్లో వైద్య పరీక్షల వరకు పర్వాలేదు. ప్రసవ సమయానికి వచ్చేసరికి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లడం లేదు.

అక్టోబరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 443 మంది గర్భిణులు నమోదవగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 305 మంది మాత్రమే కాన్పులకు వచ్చారు. 138 మంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 74 శాతం, ప్రైవేటులో 90 శాతం శస్త్రచికిత్సలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా జనరల్ ఆసుపత్రికి వచ్చే వారిలోనూ 70 శాతం శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి.

2022లో జిల్లా వ్యాప్తంగా జరిగిన తొలి కాన్పులో 67 శాతం సాధారణ ప్రసవాలతో రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్న శస్త్రచికిత్సలతో తల్లీబిడ్డలకు ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. తొలి కాన్పు సాధారణమైతే తల్లీబిడ్డలకు మేలు. అలాగే రెండో కాన్పుపై



దుష్ప్రభావం ఉండదు.

**స్త్రీ వైద్య నిపుణుల కొరత**

జిల్లా జనరల్ ఆసుపత్రిలో 8 మంది స్త్రీ వైద్యనిపుణులు అవసరం. వైద్యుల కోసం రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు నోటిఫికేషన్ వేయగా నలుగురు మాత్రమే ఎంపికయ్యారు. అటు వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలోనూ ముగ్గురు స్త్రీ వైద్య నిపుణులు అవసరం కాగా, ఒక్కరు కూడా రాలేదు. దీంతో జిల్లా ఆసుపత్రిలోని ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లను వేములవాడకు పంపారు. జిల్లా ఆసుపత్రి డీఎంఈ పరిధిలో ఉండగా.. ప్రాంతీయ ఆసుపత్రి వైద్యవిధాన పరిషత్తులో ఉంది. దీంతో వీరి పని సమయాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఇటీవల సిరిసిల్లలో అంబేడ్కర్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయగా అక్టోబరులో పది మంది గర్భిణుల వివరాలు నమోదై ఉన్నాయి. కలెక్టర్ వారికి ఫోన్ చేయగా ఎనిమిది మంది ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలకు వెళ్లినట్లు తేలింది. ప్రసవాలపై ఆసుపత్రి సిబ్బంది రికార్డులకే పరిమితమవుతున్నారని గుర్తించిన కలెక్టర్ వైద్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సాధారణ ప్రసవాలు పెంచాలని, ఆశా కార్యకర్తలు గర్భిణుల పేర్లు నమోదు చేయడంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వారు ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.

**సాధారణ కాన్పులు జరిగేలా చూస్తున్నాం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూస్తున్నాం. అత్యవసరమైతేనే సిజేరియన్లకు రిఫర్ చేస్తున్నాం. ప్రైవేటులో అనవసరంగా సిజేరియన్లు జరుగుతున్నాయని ఇటీవల తనిఖీలు నిర్వహించినప్పుడు తెలుస్తుంది. అలాంటి వాటికి నోటీసులు జారీ చేశాం. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నాలుగు స్కానింగ్ కేంద్రాలకు నోటీసులు ఇచ్చాం.వసంతరావు, డీఎంహెచ్‌వో

# చదువులమ్మ 'దత్త'పుత్రుడు..!

గాజువాక : ఆర్థిక పరిస్థితులు సహకరించక చాలామంది చదువుకు దూరమైపోతుంటారు. ఇలాంటి వారికి కాస్త చేయూతనందిస్తే వారు ప్రయోజకులై మరికొంతమందికి తోడ్పాటునందిస్తారు. ప్రవాస భారతీయుడు షేక్ చాంద్‌పాషా ఇప్పుడు చేస్తున్నది అదే.. రాష్ట్రంలోని ఎన్నో పాఠశాలలను దత్తత తీసుకుని పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. తాను చిన్నప్పుడు చూసిన పరిస్థితులే తనను సేవామార్గం నడిపించాయని ఆయన చెప్తారు. మన నగరంలోని పెదగంట్యాడ నడుపూరు హైస్కూల్‌తో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు పాఠశాలలను దత్తత తీసుకుని తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పల్నాడు జిల్లా మాచర్ల మండలం విజయపురిసౌత్‌కు చెందిన ప్రవాస భారతీయుడు షేక్ చాంద్ పాషా ఉన్నత చదువులు పూర్తి చేసుకుని అమెరికాలో ఉన్నతోద్యోగంలో స్థిరపడ్డారు. చిన్నప్పుడు తన తల్లిదండ్రులు ప్రైవేటు పనులు చేసుకుంటూ కష్టపడి చదివించిన తీరు.. ఆర్థిక స్థోమత లేక చాలామంది విద్యార్థులు చదువుకు దూరమైన వైనం ఆయనను సేవా మార్గం వైపు నడిపించాయి. అమెరికాలో ప్రవాస భారతీయులను కలుపుకొని బిగ్‌హెల్ప్ సంస్థ పేరుతో పాఠశాలలను దత్తత తీసుకుని విద్యార్థులు చదువుకు దూరంకాకూడదని సాయమందిస్తున్నారు. ఇప్పటికి రూ.50లక్షల వరకూ ఈ సంస్థ సేవలకు వెచ్చించినట్లు తెలుస్తోంది.

**కార్యక్రమాలు ఇలా...**ఒక్కో పాఠశాల నుంచి 20 మంది తల్లిదండ్రుల్లేని పేద విద్యార్థులను దత్తత తీసుకుని ప్రతినెలా విద్యా సామగ్రి, ఉపకార వేతనాలు అందిస్తూ ప్రోత్సహిస్తుంటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 49 పాఠశాలల్లో ఈ ప్రాజెక్టు ద్వారా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఏటా జూన్, జులైలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిసెంబర్, జనవరి నెలల్లో పండగ వస్త్రాలు, పరీక్ష ఫీజులు చెల్లించడం,



పది విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ అందించడంతో పాటు, ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే వారికి అవసరమైన విద్యాసామగ్రిని సంస్థ ద్వారా సమకూరుస్తారు. పెదగంట్యాడ నడుపూరు హైస్కూలో గత మూడేళ్లుగా ప్రతి నెలా 'బిగ్ హెల్ప్..' సేవలను కొనసాగిస్తోంది. హెచ్.ఎం. రాచకొండ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఒక్కో విద్యార్థికి రూ.18 వేల విలువైన విద్యా సామగ్రి అందిస్తున్నారు. యూత్ ఇంటర్న్‌షిప్ పథకం కింద అమెరికాలోని విద్యార్థులను రాష్ట్రానికి తీసుకొచ్చి పాఠశాలల సందర్శన చేయిస్తూ పేద విద్యార్థులను ప్రోత్సహించేలా చేస్తారు.

**ఉమ్మడి జిల్లాలో..**

నగరంలోని పెదగంట్యాడ నడుపూరు హైస్కూలుతో పాటు ధర్మపురి, ఎస్.నర్సాపురం, లక్ష్మీపురం, వేంపాడు, ఉద్దానపురం, గొడిచెర్ల, గవరవరం, నౌపాడ, తలగాం, పాతటెక్కలి హైస్కూళ్లలో విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు.

**చిన్నప్పుడు చూసిన పరిస్థితులే..**

నేను సాగర్ క్యాంప్-2 పాఠశాలలో చదివే రోజుల్లో అనేకమంది పేద విద్యార్థులు ప్రోత్సహించేవారులేక చదువులకు దూరమయ్యారు. నన్ను చదివించడానికి నా తండ్రి వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తూ అష్టకష్టాలు పడ్డారు. ఆ సమయంలో అనేక మంది మిత్రులు బడి మానేయడం కలవరపర్చింది. అదే సేవ వైపు నడిపించింది. నేను చేస్తున్న మంచి పనికి అమెరికాలోని ఎంతోమంది స్నేహితులు స్పందించి సహకరిస్తున్నారు. ఇది సమష్టి విజయంగా భావిస్తాను. షేక్‌చాంద్ పాషా, బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ సంస్థ వ్యవస్థాపకుడు

# గోకులం షెడ్లకు వైకాపా సర్పంచుల అడ్డు..!

పాలసముద్రం: వైకాపా పాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటికి పూర్వవైభవం తెచ్చింది. అయితే పాలసముద్రం మండలంలో వీటి నిర్మాణానికి కొందరు వైకాపా సర్పంచులు అడ్డుపడుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. మండలంలోని 13 పంచాయతీలకు ప్రభుత్వం 50 షెడ్లు మంజూరు చేసింది. వీటిని నిర్మించుకోవాలంటే గ్రామ సర్పంచుల తీర్మానం అవసరమని అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు తిప్పలు పడుతున్నారు. 13 పంచాయతీల్లో సగానికి పైగా వైకాపా సర్పంచులే ఉండటంతో వారు లబ్ధిదారులకు తీర్మానం ప్రతులు ఇవ్వడం లేదు. 'మేం సర్పంచులం.. మేమే పంచాయతీకి ప్రధానం. మేం ఎవరికీ చెబితే వారికే షెడ్లు ఇవ్వాలి.. మా సానుభూతిపరులకే తీర్మాన ప్రతులు



ఇస్తాం' అంటున్నారని లబ్ధిదారులు వాపోవడం మండలంలో చర్చనీయాంశమైంది. వీటితో తెదేపా సానుభూతిపరులు వైకాపా సర్పంచులతో గొడవ పడలేక నిర్మాణం చేపట్టలేక పోతున్నారు. ఈ సమస్యను తెదేపా నాయకులు.. ఎమ్మెల్యే థామస్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో లబ్ధిదారులు అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు మాత్రం వైకాపా సర్పంచుల మాటలకు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. తీర్మానాలు ఇప్పిస్తాం.. ఇప్పటికే కొందరు సర్పంచులతో మాట్లాడి లబ్ధిదారులకు తీర్మాన ప్రతులు అందజేశాం. మరికొందరు సర్పంచులతో మాట్లాడి వాటిని అందజేస్తాం. కృష్ణమహేష్‌రెడ్డి, ఎంపీడీవో, పాలసముద్రం

# ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు సమాయత్తం




అనంతపురం : ఎట్టకేలకు జిల్లా జలవనరుల శాఖలో కీలకమైన ప్రాజెక్టు కమిటీల(పీసీ) ఎంపికకు ప్రత్యేక నోటిఫికేషన్ వెలువడింది. కలెక్టర్ వినోద్‌కుమార్ పేరు మీద గెజిట్ జారీ అయింది. ఈ విషయాన్ని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ధ్రువీకరించారు. ఈ నెల 21న రెండు పీసీల ఎంపిక కోసం ఎన్నికలు జరగనున్నాయి. అనంత నగర హెచ్చెల్సీ కాలనీలోని హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయనున్నారు.

**ఆ రెండు కమిటీలు కీలకం**

జిల్లాలో తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ(టీబీ హెచ్చెల్సీ), బైరవాని తిప్ప ప్రాజెక్టు(బీటీపీ) కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ రెండు కమిటీలూ చాలా కీలకంగా మారాయి. ఇప్పటికే 14న క్షేత్ర స్థాయిలో 1254 మంది ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు(టీసీ), 149 సాగునీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ) ఎంపిక పూర్తి అయిన సంగతి తెలిసిందే. ఇదే నెల 17న ఆరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు(డీసీ) ఏకగ్రీవం అయ్యాయి. ఆఖరుగా ప్రతిష్టాత్మకమైన పీసీలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ రెండు కమిటీల ఎంపిక పూర్తి అయితే మొత్తం సాగునీటి సంఘాల ఎన్నికలు ముగియనున్నాయి.

**పీసీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్**

ప్రతి ప్రాజెక్టు కమిటీకి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఉంటారు. టీబీ హెచ్చెల్సీ ప్రాజెక్టు పరిధిలో ఇప్పటికే ఎంపికైన 12 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ) అధ్యక్షులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. వీరిలో అనంత జిల్లాలోని హెచ్ఎల్ఎంసీ, ఎమ్పీఆర్ దక్షిణ, ఎమ్పీఆర్ ఉత్తరం, తాడిపత్రి ఉప కాలువ(టీబీసీ), గుంతకల్లు ఉప కాలువ (జీబీసీ), కర్నూలు జిల్లాలోని ఆలూరు ఉప కాలువ(ఏబీసీ), కడప జిల్లాలోని పులివెందుల ఉప కాలువ(పీబీసీ) పరిధిలో కసనూరు, సింహాద్రిపురం, వేంపల్లి, మైలవరం కుడి కాలువ(ఎంఆర్సీ)పరిధిలో పెద్దముడియం, రాజుపాళెం, పొట్లదుర్తి డీసీ అధ్యక్షులు ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. మరొక పీసీ కమిటీ అయిన బీటీపీ ప్రాజెక్టు కమిటీ పరిధిలో డీసీలు లేవు. ఇక్కడ మాత్రం మొన్న ఎంపికైన ఆరు మంది డబ్ల్యూయూఏ అధ్యక్షులు బీటీపీ పీసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకుంటారు. 21న ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రక్రియ మొదలు కానుంది. తొలుత ఛైర్మన్, ఆ తర్వాత వైస్ ఛైర్మన్ల ఎంపిక జరగనుంది.

**రెండు జిల్లాల మధ్య పోటీ**

బీటీపీ పీసీ కమిటీకి పెద్దగా పోటీ ఉండకపోవచ్చు. కానీ.. టీబీ హెచ్చెల్సీ ప్రాజెక్టు కమిటీకి తీవ్ర పోటీ నెలకునే అవకాశం ఉంది. పీసీ కమిటీ ఎంపిక కోసం 12 మంది డీసీల అధ్యక్షులే ఉన్నా పోటీ అనివార్యంగా కనిపిస్తోంది. ఎందుకంటే.. ఈ కమిటీ పరిధిలో మూడు జిల్లాలు ప్రాతినిత్యం వహిస్తున్నాయి. అనంతలో ఐదు, కడపలో ఆరు, కర్నూలులో ఒకటి చొప్పున డీసీలు ఉన్నాయి. 2018లో ఎన్నికలు జరిగిన సమయంలో కడప జిల్లా వ్యక్తినే టీబీ హెచ్చెల్సీ ఛైర్మన్‌గా ఉన్నారు. ఇపుడు కూడా తమ జిల్లా వాసినే ఉండాలన్న దానిపై సమాలోచనలు సాగిస్తున్నారు. 12 మందిలో ఆరుగురు ఆ జిల్లా వ్యక్తులే ఓటర్లగా ఉన్నారు. మిగతా ఆరులో.. ఐదుగురు అనంత, ఒకరు కర్నూలు జిల్లా వ్యక్తి ఉన్నారు. గతంలో కడప జిల్లా వ్యక్తి ఉన్నారు... ఈ దఫా అనంత వ్యక్తి ఉండాలన్న దానిపై కూడా చర్చలు సాగిస్తున్నారు. ఏకగ్రీవం అవుతుందా.. ఎన్నిక అనివార్యమవుతుందా.. అన్నది 21వ తేదీన తేలనుంది.

# మండుతున్న వంట నూనెల ధర



కదిరి : పిండి వంటలు, వేపుడు కూరలు చేయాలన్నా.. ఏ వంట చేయాలన్నా నూనె తప్పనిసరిగా వినియోగిస్తారు. ఇది లేకుండా ఆహార పదార్థాల తయారీ ఊహించలేం. ప్రస్తుతం వంట నూనె ధరలు తారాజువ్వలా దూసుకెళ్తున్నాయి. అవి ఎంతకూ దిగిరాకపోవడంతో సామన్యులు, మధ్య తరగతులపైనేకాదు హొటళ్లపై కూడా వీటి ప్రభావం తీవ్రంగా పడుతోంది. ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్, పొద్దుతిరుగుడు నూనె ధరలు బాగా పెరిగాయని, వంటింటి బడ్జెట్‌పై ప్రభావం చూపుతోందని ఆందోళన చెందుతున్నారు.

**రాయితీపై ఇచ్చే నూనె దొరకడం లేదు**

సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు బయట మార్కెట్లో కంటే కొంచెం తక్కువ ధరకు నిత్యావసరాలు అందించేందుకు ప్రభుత్వం పట్టణ, మండల కేంద్రాల్లో కొన్ని సూపర్‌మార్కెట్లు, దుకాణాలను అందుబాటులోకి తెచ్చింది. అయితే ఈ సూపర్‌మార్కెట్లలో తక్కువ ధరలు దొరుకుతాయనే విషయం కూడా చాలామందికి తెలియదు. శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 32 సూపర్‌మార్కెట్లు ఉన్నాయి. వీటికి ప్రభుత్వం నుంచే నిత్యావసరాలు దిగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం సూపర్ మార్కెట్లో పామాయిల్ రూ.112, పొద్దుతిరుగుడు నూనె రూ.135 ధరలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే ఇందులో పూర్తిస్థాయిలో నూనె ఉత్పత్తులు అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు వెళ్లినా స్టాక్‌లేదని చెప్పడంతో వెనుతిరుగుతున్నారు. బయట మార్కెట్లోనే అధిక ధరలకు కొనుగోలు చేస్తుండటంతో ధరల భారం పడుతోంది. మండల కేంద్రాల్లో ఇవి ఎక్కడా ఆచరణలో లేవు. అధిక డిమాండ్ ఉన్న కిరాణా దుకాణాల్లో రూ.10 పెంచి విక్రయిస్తున్నారు.

**వంటలు చేయలేకున్నాం: యంగమ్మ, గుట్టకిందపల్లి, ముదిగుబ్బ**

మాది వ్యవసాయ కుటుంబం. తోటలో పనులు చేసేందుకు కూలీలు వచ్చిన ప్రతిసారీ వంట చేయాలంటే పెరిగిన నూనె ధరలతో ఖర్చు అధికమవుతోంది. ఇంట్లో నిత్యావసరాల వినియోగానికి ఇది వరకు రూ.1,500 ఖర్చవుతుండగా, నూనె ధరలు పెంచడంతో రూ.2 వేలకుపైగా ఖర్చు వస్తోంది. ధరలు తగ్గిస్తే మేలు.

**కూలీ మొత్తం సరుకులకే పోతోంది: చంద్రకళ, యర్రగుంట్లపల్లి, కదిరి**

దినసరి కూలీ పనికెళితే నెలకు రూ.5 వేలు వస్తోంది. ఇదివరకు నెలకు రూ.2 వేలు నిత్యావసరాల ఖర్చు వస్తుండగా నూనె ధరలు పెరగడంతో మరో 500 వరకు అదనంగా భారం పడుతోంది. దీనికితోడు ప్రతినెలా రూ.3 వేలు అద్దె కట్టుకోవాలి. ప్రభుత్వం నూనె ధరలు తగ్గిస్తేనే వంటలు చేసుకోగలం.

**తక్కువ ధరకే విక్రయిస్తున్నాం** వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రభుత్వం కేటాయించిన సూపర్‌మార్కెట్లు, దుకాణాల్లో తక్కువ ధరలకే నిత్యావసరాలు అందిస్తున్నాం. పామాయిల్ రూ.112, పొద్దుతిరుగుడు నూనె రూ.135కే వినియోగదారులకు విక్రయిస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

# ప్రత్యేక టెండర్లు.. నియామకాలేమిటో?!

విశాఖ: మహా విశాఖ నగర పాలక సంస్థ 'స్థాయీ' సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. 71 అంశాలపై ఉదయం 11 గంటల నుంచి సభ్యులు చర్చించనున్నారు. అజెండాలో ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన అంశాలు, వాణిజ్య సముదాయాల్లో దుకాణాలు వేలం వేయడానికి, గుత్తేదారులకు అప్పగించడానికి ప్రతిపాదించారు. పోర్టు పైవంతెన, పరిసరాల్లో ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికుల్ని నియమించినట్లు, వారికి అవసరమైన కూలి సొమ్ములు ఇవ్వాలని ప్రతిపాదించారు. జీవీఎంసీలో 5వేలకు పైగా కార్మికులు ఉన్నా, అదనపు కార్మికుల్ని తీసుకున్నట్టు బిల్లులు పెడుతున్నారు. వారంతా విధులకు వస్తున్నారా..? లేదా..? అనే అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి జోన్‌లో చెట్ల వ్యర్థాలు, కాలువలు, గెడ్డల్లో తీసిన వ్యర్థాలను తరలించడానికి వినియోగించిన లారీలకు అయిన ఖర్చుల చెల్లింపునకు అనుమతి కోరారు. వ్యర్థాలను ఏడాది పొడవునా డంపింగ్ యార్డుకు తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా టెండర్లు పిలిచారు. ఆయా వాహనాలు చెత్తను తరలిస్తుండగా, మళ్లీ అదనపు వాహనాలు ఎందుకు పెట్టారన్న అంశంపై విచారణ జరపాల్సి ఉంది.

జోన్-1 భీమిలి పరిధి 4వ వార్డు తిమ్మాపురంలో రూ.49 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణానికి, 88వ వార్డులో రూ.98 లక్షలతో



అభివృద్ధి పనులు చేపట్టేందుకు, 94వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థన మేరకు రూ.2.74 కోట్ల విలువైన పనులు చేసేందుకు, 97వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థనతో రూ.2.26 కోట్ల పనులకు సంబంధించి అనుమతి కోరారు.

**21న బడ్జెట్ సమావేశం:** మహా విశాఖ నగర పాలక సంస్థ 2025-2026 బడ్జెట్‌లో అంశాలను స్థాయీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లడానికి శనివారం బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. 2024-2025లో సవరించిన బడ్జెట్‌తో పాటు, వచ్చే ఏడాది బడ్జెట్‌లో అంశాలను స్థాయీ సభ్యులు పరిశీలించనున్నారు. అనంతరం ఆయా అంశాలను కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు.

# భవన విలువలు పెరుగనున్నాయ్..!

తిరుపతి: కొత్త ఏడాది నుంచి భవన విలువలు పెరగనున్నాయి. ఈ మేరకు రిజిస్ట్రేషన్లశాఖ ఐజీ శేషగిరిబాబు సబ్‌రిజిస్ట్రార్లకు ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు భూముల విలువల పెంపునకు సంబంధించి అధికారులు కసరత్తు పూర్తి చేశారు. జిల్లా సంయుక్త కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోనున్నారు. తర్వాత అభ్యంతరాలు స్వీకరించి అమలు చేయనున్నారు. భూముల విలువ పెంచే సమయంలో అధికారులు అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల్లో 10 నుంచి 25 శాతం మేరకు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొన్ని ప్రాంతాల్లో జాతీయ, ప్రధాన రహదారులకు ఒకవైపు ఎక్కువ ధర ఉండగా.. మరో పక్క తక్కువ ధర ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇటువంటి చోట్ల ధరల హేతుబద్ధీకరణ చేశారు. అక్కడ మార్కెట్ విలువను పరిశీలించి ప్రజలపై భారం పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

**ఆర్‌సీసీ నిర్మాణాలు..**

ఆర్‌సీసీ భవన నిర్మాణాల విలువలు పెరుగనున్నాయి. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని అపార్ట్‌మెంట్లలో మొదటి రెండు అంతస్తుల్లోని ఫ్లాట్లకు ఒక్కో చదరపు అడుగుకు రూ.90 పెరగనుంది. ఇప్పటి వరకు చ.అ. రిజిస్ట్రేషన్ విలువ రూ.1400 ఉండగా దీన్ని రూ.1490కి పెంచుతున్నారు. పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోని నగర పంచాయతీల్లోని వాటికి రూ.70 చొప్పున పెంచుతున్నారు. మూడో అంతస్తు నుంచి గతంలో అదనంగా ఒక్కో చ.అ.కు వసూలు చేసే ధరలను మాత్రం అలాగే కొనసాగించనున్నారు. వాణిజ్య భవనాలకు సంబంధించి కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీ పరిధిలో చ.అ.కు గతంతో పోలిస్తే రిజిస్ట్రేషన్ విలువ రూ.100 పెంచుతున్నారు.

# ఆధునికీకరణ బూటకం.. నిధుల మేతకు పన్నాగం

నంద్యాల : కుందూనదిలో నిధుల మేతకు ఓ గుత్తేదారు సంస్థ పన్నాగం పన్నింది.. ఈ నది వెంట తెదేపా ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పథకం కింద పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా కుందూ ఆధునికీకరణ అంటూ ఆర్భాటం చేసింది. అక్కడక్కడ పనులు చేసినా ఆ ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదు. ఇదే అదనుగా భావించిన గుత్తేదారులు, అధికారులు నిధుల మేతకు తెరతీశారు. నీరు-చెట్టు కింద చేసిన పనులనే 'ఆధునికీకరణ' కింద కొత్తగా చేసినట్లు రూ.120 కోట్ల బిల్లులు ప్రతిపాదించారు. అనుమానం వచ్చిన కూటమి ప్రభుత్వం ఆధునికీకరణ పనులపై విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించింది. వారి తనిఖీలో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**రూ.120 కోట్లు కొట్టేసేందుకు ప్రణాళిక**

కుందూ ఆధునికీకరణ పనుల్లో భాగంగా నంద్యాల, వెలుగోడు, పాములపాడు, పాణ్యం, కోవెలకుంట్ల మండలాల్లో పనులు చేసినట్లు గుత్తేదారు సంస్థ బిల్లులు పెట్టింది. రూ.120 కోట్ల పనులు చేసినట్లు 'కూటమి' ప్రభుత్వానికి నివేదించింది. పనులు పరిశీలించాల్సిందిగా ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అధికార బృందం ఇటీవల నంద్యాల పట్టణంలోని ప్రథమనంది ఆలయం వెనుక పూడికతీత పనులు పరిశీలించింది. మద్దూరు, బనకచర్ల, కోవెలకుంట్ల సమీపంలోనూ తనిఖీలు చేశారు. కేసీ కాల్వ కార్యాలయంలో దస్త్రాలు పరిశీలించారు. ఆయా పనుల్లో చాలా వరకు గతంలో తెదేపా హయాంలో నీరు-చెట్టు కింద చేసినవే. వాటినే కొత్తగా (ఆధునికీకరణ కింద) చేసినట్లు బిల్లులు సమర్పించినట్లు.. ఆధునికీకరణ పనులూ రూ.20 కోట్లు దాటలేదని గుర్తించారు.

**అర్ధంతరంగా ఆగిన పనులు**

బనకచర్ల వద్ద నిప్పులవాగు నుంచి వైఎస్సార్ జిల్లా ఆదినిమ్మాయపల్లె పికప్ ఆనకట్ట వరకు ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ముందుగా 5 నుంచి 7 మీటర్ల లోతున తవ్వి పూడిక తీయాలి. విస్తరణ కోసం ఐదువేల ఎకరాల వరకు రైతుల వద్ద భూమి సేకరించాల్సి ఉంది. అప్పటి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించలేదు.. దీంతో ప్రభుత్వ భూములున్న కొన్ని ప్రాంతాల్లోనే పనులు చేశారు. కోవెలకుంట్లలో కుందూనది వంతెన వద్ద, గుళ్లదుర్తి, పాణ్యం మండలం మద్దూరు, అనుపూరు, నంద్యాల పట్టణ శివార్లలోని ప్రథమనంది ఆలయం వెనుకభాగంలో, పాములపాడు మండలంలోని బనకచర్ల సమీపంలోనే పనులు జరిగాయి. మిగతాచోట్ల వాటి ఊసే లేదు. చేసిన పనులకూ ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అర్ధంతరంగా ఆపేశారు.

**189 కి.మీ విస్తరణ నాటకం**

కుందూ నదికి ఏటా వరద పోటెత్తి పొలాలను ముంచుతోంది.. పూడికతీసి విస్తరించాలని ఏళ్లుగా రైతులు విన్నవిస్తున్నారు. ఈ నేపథ్యంలో సుమారు 189 కి.మీల మేర విస్తరించాలని గత వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది.. ఇందుకు రూ.1,725 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్భాటం చేసింది. గాలేరు- నగరి కాల్వ నుంచి నెల్లూరు



జిల్లాలోని సోమశిల జలాశయం వరకు కుందూనది వెంట నిత్యం 3 టీఎంసీలు తరలించేందుకు ఆధునికీకరణ పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన బడా నేత సంస్థ టెండర్ దక్కించుకుంది. తొమ్మిది రీచ్‌లుగా విభజించి 2021లో దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు వద్ద భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

**మన్ను తిన్న వైకాపా నేతలు**

భూపరిహారంపై స్పష్టత రాకపోవడంతో ప్రభుత్వ భూములున్న చోటనే గుత్తేదారు పనులు చేపడుతున్నారు. తవ్వకాల్లో వచ్చిన నల్ల మట్టి సారవంతమైనది కావడంతో తీసుకెళ్లడానికి రైతులు ఆసక్తి కనబరిచారు. దీన్ని అప్పటి అధికార పార్టీ నాయకులు సొమ్ము చేసుకొన్నారు. ఒక డంపర్ రూ.5-7 వేలు, ట్రాక్టరు రూ.1500లకు రైతులకు విక్రయించారు. విస్తరణ పనుల్లో కొన్ని చోట్ల ఎర్రమట్టి వచ్చింది. దీనిని ఇటుకల తయారీకి వాడటంతో యజమానుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉంది. నంద్యాల పట్టణ సమీపంలోని అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఇటుక బట్టీల యజమానులకు అమ్మేశారు. ఒక ట్రిప్పునకు రూ.11వేల వరకు తీసుకున్నారు.

# ఈసారి ఎంత... మళ్లీ చింత

విశాఖపట్నం : వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ విలువలు మారనున్నాయి. దీంతో విశాఖ జిల్లాలో ఆస్తుల విలువ మరింత పెరగనుంది. ఈ పెంపుపై క్రయవిక్రయదారులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం రిజిస్ట్రేషన్ల మీద ఉండొచ్చుంటున్నారు.వైకాపా హయాంలో నగరంలోని ఆస్తుల విలువను భారీగా పెంచేశారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ విలువలను పెంచేందుకు నిర్ణయించడంతో రియల్ ఎస్టేట్ వర్గాలు, వ్యాపారులు మథనపడుతున్నారు. 20న సవరించిన వివరాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ప్రదర్శించి 24 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు.కొన్ని చోట్ల.. భారీగా: వైకాపా ప్రభుత్వంలో జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ మార్కెట్ విలువ పెంచేశారు. గ్రామీణ మండలాలైన పద్మనాభం, ఆనందపురం, భీమిలితో పాటు నగర పరిధి మధురవాడ, కొమ్మాది, ఎండాడ, హనుమంతువాక, ఆరిలోవ, పెందుర్తి, గాజువాక, సీతమ్మధార, వన్‌టౌన్, మద్దిలపాలెం, బీచ్ రోడ్డు, అల్లిపురం, ద్వారకానగర్, పెదగంట్యాడ, గోపాలపట్నం... ఇలా ఏ ప్రాంతాన్నీ వదల్లేదు. కొత్త ప్రాంతాలను గుర్తించి మరీ భారీగా సవరించారు.శివారు కాలనీల్లో కొత్తగా వచ్చే లేఅవుట్లకు బాదేశారు. ఆర్టీసీ కాంప్లెక్సు, ద్వారకానగర్ ప్రాంతాల్లో గజం రూ.లక్షపైన ప్రస్తుతం ఉంది. బీచ్ రోడ్డులో రూ.80 వేలు, సీతమ్మధారలో రూ.65 వేల నుంచి రూ.80 వేల మధ్య ఉంది. మధురవాడలోని చాలా ప్రాంతాల్లో రూ.30 వేల వరకు పెంచారు. దీనివల్ల గత కొంతకాలంగా విశాఖలో రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. రాష్ట్రంలోని అన్ని చోట్ల పరిస్థితి ఒకలా




ఉంది. విశాఖలో మాత్రం లావాదేవీలు దారుణంగా పడిపోయాయి.గత ఆరు నెలల్లో రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా ప్రభుత్వం రూ.750 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.400 కోట్లయినా రాలేదు. రేటు అన్ని కార్యాలయాల్లోనూ తిరోగమనంలో ఉంది.

**ఇలా ఉండొచ్చు..**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల అభివృద్ధి, ఇతర అంశాల ప్రాతిపదికన ప్రస్తుతం ఉన్న విలువలపై పది శాతం వరకు పెంచనున్నారు. మధురవాడ, నగరంలోని అనేక ప్రాంతాల్లో చదరపు గజం విలువతో పాటు అపార్టుమెంట్లలోని ఫ్లాట్ల చదరపు అడుగుల విలువలు పెరగనున్నాయి.

ప్రధానంగా మధురవాడ, పెందుర్తి, ఆనందపురం, భీమిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని ఆస్తులపై పది నుంచి 15 శాతం వరకు పెరగొచ్చుంటున్నారు.

పీఎంపాలెం, బక్కన్నపాలెం, న్యాయ కళాశాల రోడ్డు, రుషికొండ, ఎండాడ ప్రాంతాల్లో కొత్తగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల్లో చదరపు అడుగుల విలువ పెంచనున్నారు.

పెందుర్తి, సుజాతనగర్, చినముషిడివాడ, భీమిలి, కాపులుప్పాడ, తగరపువలస, ఆనందపురం, పద్మనాభంలోని వ్యవసాయ భూములు, కొత్తగావచ్చే లేఅవుట్ల ధరలు పెరగనున్నాయి.

ద్వారకానగర్, విశాఖ ఆర్వో, గోపాలపట్నం, గాజువాక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో పది శాతం వరకు పెంపుండొచ్చు.

# అన్నదాతల్లో అలజడి

పాయకరావుపేట : బంగాళాఖాతంలో అల్పపీడనం హెచ్చరిక రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. జల్లులు పడ్డాయి. ఇప్పటికే మండలంలోని గుంటపల్లి, పెదరామభద్రపురం, శ్రీరాంపురం, కేశవరం, రాజగోపాలపురం, కుమారపురం, పాల్తేరు తదితర గ్రామాల్లో వరి కోతలు చేపట్టారు. పొలాల్లో ఎండబెట్టిన వరిపన లు తడిసిపోతాయనే ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే కోతలు కోసి ఉంచిన వరిపనలను కుప్పలుగా వేస్తున్నారు. కొందరైతే ఈ కుప్పలపై రక్షణగా టార్పాలిన్ కవర్లు కప్పుతున్నారు. ఏఓ ఉమాప్రసాద్, సిబ్బంది రైతుల వద్దకు వెళ్లి కోతలు వాయిదా వేసుకోవాలని, కోసిన వారు కుప్పలు పెట్టుకోవాలని సూచించారు. ఎస్.రాయవరంలో కొన్నిచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఆదరబాదరగా రైతులు పలు గ్రామాల్లో వరి కుప్పలు వేస్తున్నారు.

అకాల వర్షాలు వరి రైతులను ముంచాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంటతోపాటు కోసి ఆరబట్టిన ధాన్యం పనలు తడిసిపోయాయి. కొండకర్ల ఆవ దిగువన 15 గ్రామాల్లో ఆరువేల ఎకరాల్లో వరిపంట వర్షాలకు దెబ్బతింది. అల్పపీడన ప్రభావంతో వరకు వర్షం కురిసింది. తడిసిన వరి పనలను సైతం వేరుచేసుకోవడానికి రైతులకు వర్షాలు అవకాశం లేకుండా చేశాయి. నోటివద్దకు వచ్చిన పంట నీటిపాలు అయ్యిందని వరి రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తడిసిపోయిన వరి పనల్లో ధాన్యం మొలకెత్తడం



తోపాటు రంగుమారిపోతాయని రైతులు వాపోతున్నారు. వాతావరణశాఖ అధికారులు హెచ్చరికలతో పూడిమడక మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు. వలలు, ఇంజిన్లను సముద్రానికి దూరంగా తరలించారు. మునగపాకలోని పలు గ్రామాల్లో రైతులు వందల ఎకరాల్లో కోసిన పనలు మడుల్లోనే ఉంచారు. కొద్దిపాటి వర్షానికే తడిచి ముద్దయ్యాయి.

**వరి కోతలను వాయిదా వేయాలి**రైతులంతా వరికోతలను వాయిదా వేయాలని, కోసిన పంటను కుప్పలు వేసి టార్పాలిన్‌తో కప్పుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. కశింకోట మండలం వెదురుపర్తిలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కోసిన పనలు తడిస్తే ఉప్పునీటిని పిచికారీ చేయాలన్నారు. ఏఓ స్వప్న, సచివాలయ ఏవో లక్ష్మీసింధుజ, ముక్కా పాండురంగ, వెలుగుల ఈశ్వరుడు, మదిని నాయుడు, కోన అప్పారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తాడిపత్రి గ్రానైట్‌కు గడ్డుకాలం



అనంతపురం : గ్రానైట్ పరిశ్రమల యజమానులు గడ్డుకాలం ఎదుర్కొంటున్నారు. నిర్వహణ భారంగా మారడంతో ఒక్కొక్కరుగా పరిశ్రమలను మూసేస్తున్నారు. చేసేదిలేక యంత్రాలను తుక్కుకు విక్రయిస్తున్నారు. ఆరేళ్ల కిందట తాడిపత్రి కేంద్రంగా 300 వరకు గ్రానైట్ పరిశ్రమలు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 120కు పడిపోయింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే 160కి పైగా పరిశ్రమలు మూతపడ్డాయి. కొన్ని పరిశ్రమలు వారానికి రెండు, మూడు రోజులు మాత్రమే పనిచేస్తున్నాయి. ఫలితంగా సుమారు 8 వేల మంది ఉపాధి కోల్పోతున్నారు. విద్యుత్తు బిల్లుల భారం.. రవాణా ఖర్చులు పెరిగిపోవడంతో మార్కెట్లో పోటీని స్థానిక వ్యాపారులు తట్టుకోలేకపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో రెండేళ్లలో మిగిలిన పరిశ్రమలు కూడా మూతపడతాయనే ఆందోళన వ్యాపారుల నుంచి వ్యక్తమవుతోంది.

**రాయల్టీ భారం తగ్గించినా..**

గత వైకాపా ప్రభుత్వంలో గ్రానైట్‌పై క్యూబిక్ మీటరుకు రూ.2,200 వరకు రాయల్టీ వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ చొరవతో రూ.1,500కు తగ్గించారు. ఈ మేరకు వ్యాపారులకు కొంతమేర ఉపశమనం కలిగినా విద్యుత్తు బిల్లులు, రవాణా ఖర్చుల భారం ఏమాత్రం తగ్గలేదు. దీనికితోడు ముడిరాయి స్థానికంగా లభించడం లేదు. కర్నూలు జిల్లా ఆదోని నుంచి రాయి తీసుకురావాలంటే రూ.40 వేల నుంచి రూ.50 వేలు, ఒంగోలు నుంచైతే రూ.60 నుంచి రూ.70 వేల వరకు ఖర్చవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. దీనికితోడు కరెంటు యూనిట్‌కు రూ.9 వరకు వసూలు చేస్తున్నారు. ఉత్పత్తి జరిగినా జరగకపోయినా నెలకు మినిమం బిల్లు కింద రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఫలితంగా ఉత్పత్తి భారం విపరీతంగా పెరిగిపోయి వ్యాపారులకు లాభాలు పూర్తిగా తగ్గిపోయాయి.

**పోటీ తట్టుకోలేక..**

ఇక్కడితో పోలిస్తే కర్ణాటకలో రాయల్టీ, రవాణా, విద్యుత్తు ఛార్జీలు తక్కువగా ఉన్నాయి. కర్ణాటకలో టన్నేజీ ప్రకారం రాయల్టీ విధిస్తున్నారు. అక్కడ ఒక్క టన్నుకు నాణ్యతను బట్టి రూ.200 నుంచి రూ.600 వసూలు చేస్తున్నారు. రాజస్థాన్‌లోనూ టన్నుకు గరిష్ఠంగా రూ.450 వసూలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. తాడిపత్రిలో మాత్రం టన్నుకు (మూడు క్యూబిక్ మీటర్లు) రూ.4,500 చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. మిగతా రాష్ట్రాల్లో ఉత్పత్తి ఖర్చు తక్కువగా ఉండటంతో అక్కడ ప్రాసెసింగ్ చేసిన బండలను దిగుమతి చేసుకుని ఇక్కడి వ్యాపారుల కంటే తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఫలితంగా ఇక్కడి వ్యాపారులు మార్కెట్‌లో పోటీని తట్టుకోలేకపోతున్నారు.

**ప్రభుత్వానికి తగ్గిన ఆదాయం**

తాడిపత్రిలో వందల సంఖ్యలో గ్రానైట్ పరిశ్రమలు మూతపడటంతో అందులో పనిచేసే కార్మికులతోపాటు రవాణా చేసేవారికి ఉపాధి దూరమైంది. ఒక్కో పరిశ్రమపై సగటున 45 కుటుంబాలు ఆధారపడేవి. ఇప్పుడు వారందరికీ పనిలేకుండాపోయింది. దీంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి పెద్దమొత్తంలో గండి పడింది. 2019కు ముందు ఈ పరిశ్రమల నుంచి రూ.12 కోట్ల వరకు కరెంటు బిల్లుల రూపంలో ఆదాయం వచ్చేది. నెలకు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు టర్నోవర్ జరిగేది. దీనివల్ల పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ఇప్పుడు 200 వరకు పరిశ్రమలు మూతపడటంతో పాటు ఉన్న వాటిల్లోనూ ఉత్పత్తి తగ్గిపోయింది. ఫలితంగా విద్యుత్తు బిల్లులు నెలకు రూ.2 కోట్లు దాటడం లేదు. వ్యాపారం సైతం రూ.10 కోట్లకు మించి జరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

**కరెంటు బిల్లులు తగ్గించాలి**

జగదీశ్వర్‌రెడ్డి, గ్రానైట్ పరిశ్రమల యజమాని

రాయల్టీ విషయంలో కొంత ఉపశమనం లభించినా.. విద్యుత్తు బిల్లుల భారం ఏమాత్రం తగ్గలేదు. వ్యాపారం తగ్గిపోవడంతో నెలలో కొన్నిరోజులు మాత్రమే పరిశ్రమలు నడిపేవారున్నారు. అయితే వాడినా, వాడకపోయినా నెలకు రూ.25 వేల వరకు కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం పెద్దమనసు చేసుకుని ఈ భారాన్ని తగ్గించాలి. పెద్ద పరిశ్రమలకు రాయితీలు ఇస్తున్నట్లే గ్రానైట్ పరిశ్రమలకు కూడా ఇవ్వాలని కోరుతున్నాం.

# ఊసేలేని బాల ఆధార్



అనంతపురం :అంగన్‌వాడీ కేంద్రాల్లో 'బాల ఆధార్' నమోదు పడకేసింది. మంగళవారం నుంచి రెండు విడతల్లో ప్రత్యేక శిబిరాల నిర్వహణ ఊసేలేదు. ఇప్పటి దాకా అసలు ఆధార్ లేని 0–6 ఏళ్ల మధ్య పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కొత్తగా నమోదు చేసే ప్రక్రియ నిర్వహిస్తున్నారన్న ఉందన్న విషయమే సమాచారమే ఎవరికీ తెలీదు. దీనిపై కనీస ప్రచారం చేయలేదు. మరోవైపు.. గ్రామవార్డు సచివాలయాల్లో అరకొరగా ఉన్న ఆధార్ కిట్లు సైతం పని చేయడం లేదు. ఐదేళ్ల కిందట సరఫరా చేసిన ఆ కిట్లన్నీ మూలన పడేశారు. ఇన్ని సమస్యల మధ్య బాల ఆధార్ నమోదు, నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళవారం నుంచి నెలాఖరులోగా రెండు విడతల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త ఆధార్ నమోదు చేపట్టాలి. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ వ్యవహారం ఎక్కడా కానరాలేదు. అనంత నగరంలో ఓ కేంద్రంలో తూతూమంత్రంగా మొదలు పెట్టారంతే. ఐసీడీఎస్, మున్సిపల్, పంచాయతీ, గ్రామవార్డు సచివాలయ శాఖల మధ్య సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి. వీరిమధ్య అసలు సమన్వయమే లేనట్లు స్పష్టమైంది.

**1,14,600 మంది పిల్లలకు ఆధారే లేదు!**

ఈనెల 17 నుంచి 20వ తేదీ దాకా, మళ్లీ ఇదే నెల 26 నుంచి 28వ తేదీ దాకా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కొత్తగా బాల ఆధార్ నమోదు చేపట్టాలి. ఈ ప్రక్రియను గ్రామ, వార్డు సచివాలయాలకు అప్పగించారు. 5,126 అంగన్‌వాడీ కేంద్రాల్లో 0–6 ఏళ్ల మధ్య వయసు కలిగిన పిల్లలు 2,51,183 మంది ఉంటే.. 1,14,600 మందికి అసలు ఆధారే లేదు. అంటే.. సగానికి పైగా లేకపోవడం ప్రస్తావనార్హం. అనంత జిల్లాలో 72,872 మంది (47.68%), శ్రీసత్యసాయి జిల్లాలో 41,728 మంది (42.43%) చిన్నారులకు బాల ఆధార్ నమోదు చేయాల్సి ఉంది. మంగళవారం నుంచి మొదలు కావాలి. ఒకటిరెండు చోట్ల తప్ప.. ఎక్కడా కానరాలేదు. అంతేకాదు.. బాల ఆధార్ ఉందన్న విషయం అంగన్‌వాడీ సిబ్బందికే తెలీకపోవడం విశేషం.

**పనిచేయని కిట్లు**

ఉమ్మడి అనంత జిల్లాలో మొత్తం 1,207 గ్రామ, వార్డు సచివాయాలు ఉన్నాయి. అనంత జిల్లాలో 663 సచివాలయాల్లో కేవలం 130 ఆధార్ కిట్లు మాత్రమే ఇచ్చారు. ఇందులోనూ కేవలం 63 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగతా 67 కిట్లు పనిచేయడం లేదు. ఒక్క అనంత నగరంలో 12 కిట్లలో కేవలం రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. ఇక శ్రీసత్యసాయి జిల్లాలో 544 గ్రామవార్డు సచివాయాలల్లో కేవలం 110 కిట్లు మాత్రమే సరఫరా చేశారు. ఇందులోనూ కేవలం 59 దాకా పనిచేస్తున్నట్లు సమాచారం. మరోవైపు.. సచివాలయాల ఉద్యోగుల్లో కొందరికి జియోటాగింగ్, ఎన్‌పీసీఏ, ఎంఎస్‌ఎంఈ వంటి సర్వేలు సాగుతున్నాయి. ఈ క్రమంలో బాల ఆధార్ అప్పగించడంతో పనిభారం ఉందన్న ధోరణిలో ఉన్నారు. పని ఒత్తిడి, పనిచేయని పరికరాలతో బాల ఆధార్ నమోదుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**మరమ్మతులు చేయించేందుకు చర్యలు**

బాల ఆధార్ నమోదు ప్రక్రియ మొదలు పెట్టాం. చాలా కిట్లు రిపేరీలో ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. ఈనెల 31, జనవరి 1న హార్డ్‌వేర్ శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఆ రెండు రోజుల్లో అన్ని పరికరాలను రిపేరీ చేయిస్తాం. త్వరలోనే ప్రభుత్వం నుంచి 44 ఆధార్ కిట్లు రానున్నాయి. ఏ సమస్య రాకుండా బాల ఆధార్‌ను చేపడతాం.

నారపరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి, ఆధార్ విభాగం

# వచ్చిన విమానాలు వెనక్కి!!

విశాఖపట్నం: విశాఖ విమానాశ్రయంలో నేవీ యంత్రాంగం చేపట్టిన అభివృద్ధి పనులతో కొత్త కష్టాలు తెరపైకి వచ్చాయి. మంచు కురిసినా, వర్షం పడినా విమానాలు దిగడం గగనమే అన్నట్లు పరిస్థితులు మారిపోతున్నాయి. ఇక్కడ రన్‌వేకు ఇరువైపులా కాంతివంతమైన దీపాలతో ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్) ఉంది. మూడు నెలలుగా సాగుతున్న పనుల్లో భాగంగా ఐఎల్ఎస్‌కు, రన్‌వేకి నడుమ 300 మీటర్ల మేర మట్టి తవ్వి గుంతలు తీశారు. ఫలితంగా ఐఎల్ఎస్ వ్యవస్థను ఆపేశారు. సాధారణంగా విమానం దిగాలంటే 2,500 మీటర్ల ఎత్తు నుంచి దృశ్య స్పష్టత(విజిబుల్టీ) అవసరం. ఐఎల్ఎస్ వినియోగంలో ఉన్నప్పుడు 800 మీటర్ల ఎత్తునుంచైనా విమానాలు దిగేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఐఎల్ఎస్ సౌకర్యం లేకపోవడంతో...పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉన్నప్పుడు విమానాలు దిగకుండా వెనుదిరుగుతున్నాయి. అలా ఈ నెల 17వ తేదీ రాత్రి హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో సర్వీసుతోపాటు, మరో రెండు విమానాలు వెనక్కి వెళ్లిపోయాయి. నావికాదళ పనులు మరో నాలుగు నెలలు జరిగే అవకాశం ఉందని ఎయిర్‌పోర్టు అధికారులు చెబుతున్నారు. అయితే వచ్చే ఏడాది జూన్, జులై వరకు ఐఎల్ఎస్ నిలిపేసే అవకాశం ఉందని సమాచారం. జనవరి నెలంతా పొగ మంచు ఎక్కువగానే ఉంటుంది. దీంతో విమానాలు రాత్రిళ్లు దిగేందుకు ఆటంకాలు తప్పేలా లేవు. **కీలక సమయంలో ఇలా:** విశాఖను ఆర్థిక రాజధానిగా, ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసే కసరత్తు ఊపందుకుంది. ఎన్టీపీసీ, ఆర్సెలార్ మిత్తల్, గూగుల్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ప్రముఖ



కంపెనీలు వరుస కడుతున్నాయి. భారీగా పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో మంచు పడిందని, వర్షం కురిసిందని, నేవీ పనులు జరుగుతున్నాయని ఐఎల్ఎస్ ఆపేసి సర్వీసులను వెనక్కి పంపేయడం తగదనే విమర్శలు వస్తున్నాయి.

'ఇప్పటి వరకు సర్వీసులు వెనక్కి వెళ్లిన పరిస్థితి రాలేదు. కొన్ని రోజులుగా వర్షాలు పడటం, వెలుతురు బాగా తగ్గడం వల్ల విమానాలు దిగేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జనవరిలో పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. అప్పటి వరకు ఈ సమస్య తరచూ తలెత్తొచ్చు' అని విశాఖ విమానాశ్రయ డైరెక్టర్ రాజారెడ్డి పేర్కొన్నారు. 'ఐఎల్ఎస్ వ్యవస్థను నెలల కొద్దీ ఆపేయడం దారుణం. వెంటనే అందుబాటులోకి తేవాలి. విశాఖను పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వాలు ఉన్నాయి. ఈ సమయంలో ఇలాంటి పరిణామాలు పెట్టుబడులకు ప్రతికూలంగా మారుతాయి' అని ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఒ. నరేష్ కుమార్ పేర్కొన్నారు.

# దారి మళ్లిన నిధులు.. నిలిచిపోయిన పనులు..!

గాజువాక : కింగ్‌జార్జి ఆసుపత్రి(కేజీహెచ్) ఆవరణలో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిర్ణీత గడువులోపు భవనం అందుబాటులోకి వచ్చే విషయమై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ సీసీబీ నిర్మాణానికి గతేడాది రూ.23 కోట్లు విడుదల చేసింది. ఆ నిధులతో చేపట్టే పనులకు గతేడాది డిసెంబరులో భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమైనప్పటికీ సకాలంలో నిధుల లభ్యత లేకపోవడంతో మందకొడిగా సాగుతున్నాయి.

**అయిదు అంతస్తుల్లో..**

ఆసుపత్రి ఆవరణలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌కు వెళ్లే మార్గంలో వెయ్యి చదరపు గజాల స్థలాన్ని సీసీబీకు కేటాయించారు. 35 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అయిదు అంతస్తుల్లో భవనం నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసి, పనుల బాధ్యతను గుత్తేదారుడికి అప్పగించారు. వైకాపా పాలనలో కేంద్రం నుంచి నిధులు విడుదలైనా, అవి అందుబాటులో లేకపోవడంతో పనుల్లో జాప్యం ఏర్పడింది. ప్రస్తుతం పూర్తయిన పనులకు చెల్లింపులు జరక్కపోవడంతో, గుత్తేదారు సంస్థకు రూ.3.50 కోట్ల వరకు బకాయిలు ఇవ్వాల్సి ఉంది.కేంద్రం విడుదల చేసిన మొత్తం నిధుల్లో భవన నిర్మాణానికి రూ.17 కోట్లు, మిగిలిన రూ.6 కోట్లు వైద్య పరికరాల కొనుగోలుకు కేటాయించారు.

**సేవలు ప్రారంభిస్తే ప్రయోజనం**

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రాణాపాయ స్థితిలో ఉండే రోగులు అనేక మంది కేజీహెచ్‌కు వస్తుంటారు. అలాంటి వారికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు సీసీబీ ఉపకరిస్తుంది. ఇప్పటికైనా అధికారులు



స్పందించి.. భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, వైద్యసేవలు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

**11 నెలలు పూర్తయినా..**

పనులు ప్రారంభమైన నాటి నుంచి ఏడాది లోపు భవనాన్ని అందుబాటులోకి తేవాలని తొలుత నిర్ణయించారు. ఇప్పటికే 11 నెలలు పూర్తయినా ... భవన నిర్మాణ పనులే పూర్తి కాలేదు. పనులు పూర్తయితేనే గాని... పడకలు, ఇతర వైద్య పరికరాలు ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు భవనం పూర్తవ్వాలంటే కనీసం మరో ఏడాది సమయం పడుతుందని పలువురు చెబుతున్నారు.

పైగా కేంద్రం మంజూరు చేసిన నిధులు ఎటు మళ్లించారో తెలియని పరిస్థితి. దీనికి సంబంధించిన సమాచారం వైద్యకళాశాల, ఇంజినీరింగ్ అధికారుల వద్ద లేదు. భవన నిర్మాణ పనులు ప్రారంభించాలన్న నాటి ప్రభుత్వ సూచనలతోనే గుత్తేదారుడిని నియమించి పనులు చేపట్టామని అధికారులు చెబుతున్నారు.

**కేజీహెచ్‌లో అసంపూర్తిగా సీసీబీ భవన సముదాయం**

50 పడకలతో...: మొత్తం 50 పడకల సీసీబీలో అత్యాధునిక మంచాలు, ఐసీయూ బ్లాక్, కేంద్రీకృత ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ, మోనిటర్లు, డిఫిబ్రిలేటర్లు, వెంటిలేటర్లు... తదితర పరికరాల్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.అత్యవసర, ప్రాణాపాయ స్థితిలో ఉండే రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు నిర్ణయించారు. ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయాలతో సీసీబీను తీర్చిదిద్దాలన్న ఆలోచనతో ఇంతటి కీలక ప్రాజెక్టును కేంద్రం మంజూరు చేసింది.

# వెలుగుల మాటున దోపిడీ

చిత్తూరు : వైకాపా హయాంలో పేదలందరికీ ఇళ్లు అంటూ తీసుకొచ్చిన జగనన్న కాలనీలు ఆ పార్టీ నాయకుల దోపిడీకి నిలయాలుగా మారాయి. భూసేకరణలో రూ.కోట్లలో దోచేశారు.. జగనన్న కాలనీలకు విద్యుదీకరణ పనులు, విద్యుత్తు కనెక్షన్ల పేరుతో కోట్లాది రూపాయల దందా సాగించినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అవసరం లేకున్నా పెద్దఎత్తున పరికరాలు కొనుగోలు చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారు. అస్మదీయ గుత్తేదారుడికి లబ్ధి చేకూర్చేలా ఆ పార్టీలో పెద్దాయనగా పిలిచే మాజీ మంత్రి తెర వెనక చక్రం తిప్పినట్లు సమాచారం.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 576 కాలనీల్లో.. 2.12లక్షల గృహాలకు లబ్ధిదారులను గుర్తించి నిర్మాణాలు చేపట్టారు. వీటిలో 9,387 గృహాలే పూర్తయ్యాయి. వీటిలోనూ చాలా తక్కువ విద్యుత్తు సర్వీసులు ఇచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అసౌకర్యాల నడుమ కాలనీల ఏర్పాటుతో కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణంలో పురోగతే లేదు.

**రూ.100-120 కోట్లకు పైగా ఖర్చు..**

ఉమ్మడి జిల్లాలోని జగనన్న కాలనీల్లో విద్యుత్తు సౌకర్యం కోసం రూ.100–120 కోట్లు ఖర్చు కాగా.. అవసరానికి మించి నియంత్రిక లు, విద్యుత్తు స్తంభాలు అమర్చారు. పట్టణాల్లో ఐదు లైన్లు, గ్రామీణ కాలనీల్లో మూడు లైన్లు బిగించారు. గ్రామీణ పరిధిలోని కాలనీల్లో రూ.35 లక్షలు, పట్టణ పరిధిలోని కాలనీల్లో రూ.50 నుంచి రూ.70ల క్షల వరకు ఖర్చయినట్లు లెక్కలు రాసుకున్నారు.

జిల్లాలో పలు కాలనీల్లో ఇళ్లు పూర్తికాకున్నా కనెక్షన్లు ఇచ్చేసి పరికరాలు అమర్చారు. నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాన్ని బట్టి మీటర్లు, ఇతర పరికరాలు సరఫరా చేయాలి. పలు కాలనీల్లో విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి.

**'పెద్ద' నాయకుడి బంధువుకు లబ్ధి**

ఉమ్మడి జిల్లా పరిధిలోని జగనన్న కాలనీలకు విద్యుత్తు పరికరాలు సరఫరా చేసే బాధ్యతను నాటి వైకాపా ప్రభుత్వంలో కీలకంగా ఉన్న 'పెద్ద' నాయకుడి బంధువుకు అప్పగించారు. అతడు తక్కువ మొత్తానికి టెండరు వేసి తర్వాత అంచనాలు పెంచి దోచేశారు. నిర్మించిన ఇళ్లకు విద్యుత్తు మీటర్, సర్వీస్ వైర్, మీటరు బోర్డు, సర్క్యూట్ బ్రేకర్, ఎర్తింగ్ ఉచితంగా అందించడానికి గుత్తేదారుతో అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఇళ్ల నిర్మాణాన్ని బట్టి అవసరాల మేరకు వీటిని సరఫరా చేసుకోవాల్సి ఉండగా.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే సమయానికి(ఈ ఏడాది జూన్ నాటికి) లక్ష గృహాలకు అవసరమైన పరికరాలు సరఫరా చేసేసి గుత్తేదారుకు బిల్లు చెల్లించారు. కమీషన్ల కోసం ఒకేసారి సరఫరా చేయడం గమనార్హం.

**దెబ్బతిన్న రూ.12.32 కోట్ల విలువైన పరికరాలు**

చిత్తూరులోని గోదాములో వృథాగా సర్వీసు తీగలు, మీటరు బోర్డులు, ఎంసీబీలు ఉన్నాయి. మీటరు బోర్డుల అవసరం లేకున్నా వైకాపా అస్మదీయులకు కోట్లాది రూపాయలు దోచిపెట్టాలనే లక్ష్యంతో రూ.2.68 కోట్లు బోర్డులకు ఖర్చు పెట్టారు. సర్వీసు వైర్లు రూ.8.13 కోట్లకు కొనుగోలు చేశారు. ఇప్పట్లో వీటిని వినియోగించే పరిస్థితి లేదు. గోదాములోనే ఉండటం వల్ల అవి పనికిరావని అధికారులు అంటున్నారు. మీటరు బోర్డుపై నేటికీ ఉన్న నాటి సీఎం జగన్ బొమ్మతో కూడిన స్టిక్కర్ తొలగించే విషయమై ఇటీవల అధికారులు చర్చించారు.

# ఆరోగ్యాన్ని కాల్చేస్తున్నాం..

తిరుపతి : ప్లాస్టిక్ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో కాల్చడం వల్ల ఏటా 20 మిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ప్రపంచవ్యాప్తంగా వెలువడుతోంది. దీనివల్ల 60 లక్షలకు పైగా మరణించగా ఎంతోమంది శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. సుమారు 700 జాతుల వన్యప్రాణులు కనుమరుగయ్యాయి. ప్లాస్టిక్ పాలిమర్ అవశేషాలతో ఎండోక్రైన్ గ్రంధి దెబ్బతిని చర్మవ్యాధులు, కాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని పర్యావరణశాఖ నిత్యం హెచ్చరికలు జారీ చేస్తున్నా మనుషుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

**విచ్చలవిడి వినియోగం**

ఉమ్మడి జిల్లాలోని నగర, పురపాలికల్లో ప్లాస్టిక్ వినియోగం భయంకరంగా పెరుగుతోంది. నిత్యం 554 టన్నుల వ్యర్థాలు వెలువడగా, వాటిల్లో 12 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉండటం గమనార్హం. ప్రతిదానికి ప్లాస్టిక్ సంచులే వాడటంతో డంపింగ్ యార్డులన్నీ ఆ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. క్లోరినేటెడ్ ప్లాస్టిక్‌తో మట్టిలో విషపు రసాయనాలు చేరి అవి భూగర్భ జలాల్లో కలుస్తున్నాయి. మనుషులు, జంతువులు ప్రాణాలు కోల్పోతున్నారు.

**అవగాహన అత్యంత అవసరం**

ప్రతి మనిషీ సగటున 31 గ్రాముల చొప్పున ఏడాదికి సుమారు 12 కిలోల ప్లాస్టిక్ వాడుతున్నాడు. చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఆ వ్యర్థాలను కాల్చడంతో విష రసాయనాలు వెలువడి పర్యావరణమంతా ఊహకందని స్థాయిలో కలుషితమవుతోంది. ఈ దారుణాన్ని కట్టడి చేయకుంటే భావితరాల భవిష్యత్తు అంధకారమవుతుంది. ప్రభుత్వాధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో ప్లాస్టిక్ కట్టడి గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం



ఎంతైనా ఉంది.

**నిబంధనల అమలేదీ?**

ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించాలని 2022 జులైలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వంద మైక్రాన్‌లలోపు బరువు ఉండే ప్లాస్టిక్, పీవీసీ బ్యానర్లను నిషేధించింది. ఒకేసారి వాడి పడేయకుండా తిరిగి వినియోగించుకునేందుకు 2021 సెప్టెంబరు 30 నుంచి ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల మందాన్ని 50 మైక్రాన్‌ల నుంచి 75 మైక్రాన్‌లకు పెంచారు. అదే సంవత్సరం డిసెంబరు 31 నుంచి 125 మైక్రాన్లకు పెంచారు. కానీ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. నిబంధనలు కాలరాస్తూ ఇష్టానుసారంగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు.

# పుత్తూరులో గలీజు వ్యవహారం

పుత్తూరు : వైకాపా హయాంలో పుత్తూరు పురపాలికలో లీజులు దక్కించుకున్న ఆ పార్టీ నేతలు వసూళ్లకు పరిమితమయ్యారు. పురపాలికకు మాత్రం బకాయిలు పెట్టారు. మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతు వధశాల తదితరాల నిర్వహణను వేలంలో అప్పగించాలి. వీటిలో కొన్నింటిని నామినేషన్ పద్ధతి అన్నట్లుగా వేలం లేకుండా పొందారు. లీజు మొత్తాలు దిగమింగినా అధికారులు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు.

పుత్తూరు పురపాలికలో 2021-22, 2023-24 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతు వధశాల దక్కించుకున్న గుత్తేదారులు లీజు మొత్తాన్ని చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి సైతం ఈ విషయాలను గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**బకాయిలు ..**

2023-24లో దినసరి మార్కెట్ దక్కించుకున్న పి.జనార్దన్ రూ.17.57లక్షలు. జంతువధశాల గుత్తేదారు సుబ్రహ్మణ్యం రూ.3.67 లక్షలు. ప్రైవేటు బస్టాండ్ నిర్వహణ గుత్తేదారు చిరంజీవి రూ.5.48 లక్షలు. 2022-23లో జంతువధశాల దక్కించుకున్న సునీల్‌కుమార్ రూ.2.74 లక్షలు. 2021-22లో జంతువధశాల నిర్వహణ గుత్తేదారు నాగేంద్రబాబు రూ.1.03 లక్షలు.

ఈ బకాయిల మొత్తం రూ.30.51 లక్షలు మున్సిపాలిటీకి చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. వీటి మొత్తానికి వడ్డీ సైతం రూ.17.58 లక్షలు చెల్లించాలని బకాయిదారులకు నోటీసులు ఇచ్చారు. స్పందన



లేకపోవడంతో వాటిని రాబట్టేందుకు అధికారులు తీర్మానం ద్వారా కోర్టులో దావా దాఖలు చేయడానికి గత నెల 30న అజెండాలో పెట్టడం గమనార్హం.

**తెదేపా హయాంలో అలా..**

2014-2019 ఆర్థిక సంవత్సరాల్లో తెదేపా అధికారంలో ఉంది. అప్పట్లో వేలం ముగిశాక హెచ్చుపాటదారు ఆ మొత్తాన్ని చెల్లిస్తేనే ఆశీల వసూలుకు అనుమతి ఇచ్చేవారు. దీంతో మున్సిపాలిటీకి ఆదాయం ఒనగూరేది.

**వైకాపా పాలనలో ఇలా..**వైకాపా హయాంలో నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా లీజు ఇచ్చేశారు. తద్వారా మున్సిపాలిటీకి గండి పడటమే కాక, ఆ మొత్తాన్ని చెల్లించక లీజు వసూలు చేసి వాటిని స్వాహా చేయడం గమనార్హం.

**చెల్లించకుంటే చర్యలు**

గుత్తేదారులు బకాయిలు చెల్లించకుంటే వారిపై చర్యలు తప్పవు. వసూలు చేసి చెల్లించకుంటే వారిపై కేసులు నమోదు చేసేందుకు సైతం వెనుకాడం. మంజునాథ్‌గౌడ్, పుత్తూరు కమిషనర్

# అమ్మలకు వైద్యం.. దైవాదీనం



హిందూపురం : హిందూపురంలోని జిల్లా మాతాశిశు ఆసుపత్రిలో వైద్యం దైవాదీనంగా మారింది. పెద్ద ఆసుపత్రి అయినా వైద్యుల కొరత కొట్టొచ్చినట్లుంది. నలుగురు గైనకాలజిస్టులు ఉన్నా అందులో ముగ్గురు సెలవుల్లోనే ఉన్నారు. ఇద్దరు మెడికల్ సెలవు పెట్టగా.. ఒకరు ప్రసూతి సెలవుల్లో ఉన్నారు. ఉన్న ఒక్క వైద్యుడు సైతం డిప్యుటేషన్‌పై వారంలో రెండు రోజులు పెనుకొండ ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. దీంతో ప్రసవాలకు వచ్చే వారికి, బాలింతలకు వైద్యం ప్రశ్నార్థకంగా మారే అవకాశాలున్నాయి.

**ఎంబీబీఎస్ వైద్యులతో సేవలు**

గైనకాలజిస్టులు లేనందున ఎంబీబీఎస్ వైద్యులతో వచ్చిన వారికి వైద్యసేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకొన్నారు. దీంతో గర్భిణి, బాలింతలకు సరైన వైద్యం అందక పోవచ్చనే విమర్శలు వ్యక్తం అవుతన్నాయి.

**మెడికల్ లీవ్‌ల్లో మతలబు ఏమిటి ?**

ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల్లో 90 శాతం వైద్యులకు ప్రైవేట్ క్లినిక్‌లు ఉన్నాయి. వీరిలో కొంతమంది ఆసుపత్రి వేళల్లో కూడా తమ సొంత క్లినిక్‌ల్లో ఉంటూ చికిత్సలు చేస్తుంటారు. ఆసుపత్రిలో పనిఒత్తిడి ఎక్కువ కావటంతో వీరు మెడికల్ లీవ్‌లపై వెళ్లి తమ క్లినిక్‌ల్లో చికిత్సలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివలన ఆసుపత్రిలో మిగిలిన ఒక వైద్యుడు ప్రతి రోజూ పగలు, రాత్రి ఎలా విధులు నిర్వహించి పూర్తి స్థాయిలో వైద్యసేవలు ఎలా అందించగ్గలడు అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

**ప్రతి రోజూ పది ప్రసవాలు**

ఇక్కడ ప్రతి రోజు పది మంది ప్రసవాల కోసం, వందకు పైగా గైనిక్ సంబంధించిన బాధితులు, దాదాపు 80 మంది గర్భిణి, బాలింతలు ఈ ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌లుగా చికిత్సలు పొందుతుంటారు. మడకశిర, గోరంట్ల, పెనుకొండ, పరిగి, కర్ణాటక ప్రాంతం నుంచి ప్రసవాలకు గర్భిణులు ఇక్కడికి వస్తూనే ఉంటారు. ఇలాంటి సమయంలో నలుగురు గైనకాలజిస్టుల సేవలు అవసరం. కాని ఉన్న ఒక్కరు సైతం వారంలో నాలుగు రోజులే అందుబాటులో ఉండటంతో వైద్యం అందని ద్రాక్షలా మారింది. **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను - బి.లింగన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్** మాతాశిశు ఆసుపత్రిలో వైద్యుల కొరత విషయాన్ని ఇప్పటికే డీసీహెచ్ దృష్టికి తీసుకెళ్లాను. ఒక గైనకాలజిస్టును పెనుకొండకు వారంలో రెండు రోజులు వేసిన డిప్యుటేషన్ చేసి, మరికొంతమంది గైనకాలజిస్టులను ఇక్కడికి నియమించాలని కోరాను.

# వరద కాలువలు.. కనుమరుగయ్యేలా ఆక్రమణలు



పెనుమూరు: ఈ చిత్రంలో కనిపించేది పెనుమూరు మండలం చిప్పారపల్లె పంచాయతీ పేటచెరువు నుంచి పెద్దచెరువుకు వరద నీటిని చేరవేసే మొరవ కాలువ. ఇది సుమారు కి.మీ.ఉంటుంది. ఇదేమిటి.. ఇంత చిన్న కాలువ వరద నీటిని ఎలా చేరవేస్తుందని అనుకుంటున్నారా.. మొరవ ప్రారంభంలో వెడల్పుగా ఉన్నా రానురాను పూర్తిగా ఆక్రమణకు గురై ఉనికినే కోల్పోయింది. భారీ వర్షాల సమయంలో వరద పొలాలపై ప్రవహిస్తోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. ఇది పెద్దచెరువు నుంచి గాగమ్మగారిపల్లెకు మొరవ నీరు అందించే కాలువ. ప్రారంభంలో కొద్దివరకు కాలువలా కనిపిస్తున్నా.. వంద మీటర్ల దూరం తరవాత కాలువ నామరూపాలే లేకుండా పోయింది. ఫలితం వరదలొస్తే అది పొలాలపై ప్రవహించి నష్టం కలిగిస్తోంది. దీంతో రైతులు నష్టపరిహారం కోరుతూ అధికారులకు వినతులు అందించడం పరిపాటి అయింది.

సాధారణంగా అక్రమార్కులు ప్రభుత్వ భూములు, డీకేటీ భూములు ఆక్రమించుకుంటారు.. సామాన్యుల భూములను సైతం ఒక్కోసారి తమ పలుకుబడి ఉపయోగించి తమ సొంతం చేసుకున్న సంఘటనలు లేక పోలేదు.. ఇలాంటి సంఘటనలను చూస్తూనే ఉన్నాం.. కానీ చెరువుల మొరవ కాలువలను సైతం ఆక్రమించుకుని వాటి ఉనికినే ప్రశ్నార్థకంగా చేసిన దాఖలాలు చాలానే ఉన్నాయి.. ఈ తంతు జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకున్నా అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు.

రాజుల కాలంలోనే పంటల సాగుకు చెరువులు తవ్వించారు. వర్షాలు అధికంగా కురిసిన సమయంలో ఒక చెరువు నుంచి దిగువన ఉన్న చెరువులకు నీటిని చేరవేసేందుకు ముందుచూపుతో మొరవలు కట్టించి కాలువలు, పంటలకు నీటిని అందించేందుకు తూములు నిర్మించారు. ప్రస్తుతం వీటి ఉనికే కనిపించడం లేదు. దీంతో కాలువల పరిస్థితి దారుణంగా మారింది. కాలువల పక్కన ఉండే భూములను కొందరు భూస్వాములు ఆక్రమించుకోవడంతో ఆనవాళ్లు లేకుండా పోయాయి. చిత్తూరు జిల్లాలో(పుత్తూరు, వడమాలపేట మండలాలు మినహా) మొత్తం 3,991 చెరువులు ఉన్నాయి. వీటిలో వంద ఎకరాల లోపు ఆయకట్టు భూములు ఉన్న చెరువులు 3,761, వంద ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నవి 230 ఉన్నాయి. సుమారు 70 శాతం చెరువుల మొరవ కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. ఫలితంగా అన్నదాతల అవస్థలు చెప్పనలవికావు. కనీసం సాగునీరు అందక వారు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆయా కాలువలకు కొత్తరూపు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

**సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తాం..**

జలవనరుల శాఖ ద్వారా తమకు సమాచారం రావాలి. ఆక్రమణకు గురైన కాలువలు గుర్తించి తమకు నివేదిక ఇస్తే సిబ్బందితో సర్వే చేయించి హద్దులు నిర్ణయించే బాధ్యత మాది. మండల అధికారులతో సర్వే చేయించి చర్యలు చేపడతాం. శ్రీనివాసులు, ఆర్డీవో, చిత్తూరు

**జిల్లాలో ఇలా..**మొత్తం చెరువులు: 3,991

ఆక్రమణకు గురైన కాలువలు: సుమారు 3 వేలు

ఉనికి కోల్పోయినవి: 900కు పైగా

# రాయితీపై టార్పాలిన్లు ఏవీ?

పుంగనూరు : వరి కోతలు ప్రారంభమయ్యాయి. మరోవైపు తుపాను ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యంత్రాలు పొలంలోకి వచ్చినప్పటి నుంచి ధాన్యాన్ని ఆరబెట్టుకునే వరకు టార్ఫాలిన్ల చాలా అవసరం. నియోజకవర్గంలో వరి సాగు అధికం. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకోవడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఏటా కోతల సమయంలో అన్నదాతలకు ఈ కష్టాలు తప్పడం లేదు. అరకొర పట్టాలు, తొలగించిన ఫ్లెక్సీలతో వాటిని కాపాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ, ఉపాధిహామీ పథకం ద్వారా వీటిని అందించేవారు. మార్కెట్ ధరలో 50 శాతం రైతు భరిస్తే మిగిలిన 50శాతం ప్రభుత్వమే ఇచ్చేది. ఒక్కో రైతుకు రెండేసి ఇచ్చేవారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల మండలాల్లో 3,824 హెక్టార్లలో వరి సాగైంది.

**ధాన్యం ఎలా కాపాడుకోవాలి**

ఏటా వరి కోతకొచ్చే సమయంలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురవడం సహజం. దీంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి టార్పాలిన్లు అత్యవసరం. ప్రస్తుతం రాయితీపై వాటిని సరఫరా చేయకపోవడంతో ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**వానొస్తే భయమేస్తోంది**

ఐదెకరాల్లో వరి సాగుచేశా. యంత్రంతో నూర్పిడి చేశా. వానొస్తే భయమేస్తోంది. ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలంటే కష్టంగా ఉంది. నిల్వచేయడానికి టార్పాలిన్లు లేక రూ.50తో అయిదు బాడుగకు తెచ్చి కప్పుతున్నా. మరో అయిదు అవసరం.శేఖర్, రైతు, పుంగనూరు

**ప్రభుత్వం ఆదుకోవాలి**




అన్నదాతలకు అండగా ప్రభుత్వం టార్పాలిన్లను 70శాతం రాయితీతో అందించాలి. వరి కోతలు, వేరుసెనగ ఒబ్బిడి సమయంలో వర్షాలు ఇబ్బంది పెడుతున్నాయి. రూ.వందలు ఖర్చుచేయలేక పాత పట్టలు, గోనె, ఎరువుల సంచులతో దిగుబడులపై కప్పి నష్టపోతున్నారు.టి.జనార్దన్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు

**ఉన్నతాధికారులకు నివేదించాం**

పొలంబడిలో వస్తున్న వినతుల్లో ఎక్కువగా టార్పాలిన్ల కోసమే. ప్రతి మండలానికి ఎన్ని అవసరమో ఉన్నాతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం సరఫరా చేసిన వెంటనే రైతులకు అందిస్తాం. శివకుమార్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, పుంగనూరు

# ఉషారాణి.. ఎటూ తేలని పంచాయితీ

పెద్దారవీడు : సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలకు పాల్పడిన ఒంగోలు డీఎల్‌డీవో, పూర్వ డీపీవో ఉషారాణిపై ప్రభుత్వం వేటు వేసింది. ఆమె రగిల్చిన పంచాయితీల చిచ్చు మాత్రం చాలా చోట్ల ఇంకా రగులుతూనే ఉంది. గ్రామ సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ సహాయకుల సాధారణ బదిలీల సందర్భంగా సాగించిన నిర్వాకంతో కొందరి ఉద్యోగాలు ఇప్పుడు గాలిలో దీపాల్లా మారాయి.

**నెల రోజులుగా ప్రదక్షిణలు...:** పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రామకోటమ్మను పుచ్చకాయలపల్లి పంచాయతీకి కలెక్టర్ ఆదేశాలతో అక్టోబర్ 7న బదిలీ చేశారు. ఆ మరుసటి రోజే పొన్నలూరు మండలంలో పని చేస్తున్న మంత్రునాయక్‌కు ఇదే పంచాయతీని కేటాయిస్తూ డీపీవో కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. మంత్రునాయక్‌ను విధుల్లో చేర్చుకున్నారు. రామకోటమ్మ డీపీవో కార్యాలయంలో సంప్రదించారు. కేటాయించిన పంచాయతీలోనే చేరాలని ఆమెకు సూచించినప్పటికీ ఇక్కడేమో చేర్చుకోకుండా అడ్డుకుంటున్నారు. ఆమె నెల రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

పెద్దారవీడు మండలం చిన్నగుడిపాడు పంచాయతీలోని పరిస్థితీ అలాగే ఉంది. ఇక్కడికి డి.బాలునాయక్‌ను గత నెలలో కార్యదర్శిగా అధికారులు బదిలీ చేశారు. మరుసటి రోజు అదే పంచాయతీకి శివకోటేశ్వరరావును కేటాయిస్తూ మరో ఉత్తర్వులు ఇచ్చారు. శివకోటేశ్వరరావు విధుల్లో చేరారు. బాలునాయక్‌కు మాత్రం ఏ పంచాయతీ కేటాయించలేదు. దీంతో ఆయన కూడా ఖాళీగా ఉండాల్సి వస్తోంది. ఈ విషయమై పెద్దారవీడు ఎంపీడీవో జాన్ సుందరం మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో కార్యదర్శుల బదిలీలు ఉన్నాయని, పోస్టింగ్ లేని పంచాయతీ కార్యదర్శుల విషయాన్ని డీపీవో కార్యాలయానికి తెలిపినట్లు చెప్పారు.

# ఆహ్లాదం మాటున దోపిడీ

మార్కాపురం : గత పాలకుల హయాంలో అభివృద్ధి.. ఆహ్లాదం మాటున సాగిన అవినీతి ఒక్కొక్కటిగా వెలుగు చూస్తోంది. అడిగేవారు లేకపోవడంతో అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై అందినకాడికి దండుకున్నారు. మార్కాపురంలో పార్కు అభివృద్ధి ముసుగులో రూ.కోటి మేర దోచుకున్నారు. మార్కాపురం పట్టణంలోని సుబ్బరామిరెడ్డి మున్సిపల్ పార్కు అభివృద్ధికి గత ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు మార్కాపురం - తర్లుపాడు రహదారిలోని లక్ష్మీచెన్నకేశవనగర్ పరిధిలోని ఈ పార్కులో వసతుల కల్పనకు రూ.కోటి మున్సిపల్ నిధులు వెచ్చించి పనులు మొదలుపెట్టారు. మొక్కలతో పాటు ఫ్లోరింగ్ బండలు, గడ్డితో లాన్ ఏర్పాటుకు సంకల్పించారు. ఇవేకాక చిన్న పిల్లల కోసం ఆట వస్తువులు, జారుడు బల్లలు ఏర్పాటు చేశారు. వ్యాయామం చేసేందుకు జిమ్ పరికరాలు, నడక మార్గం వంటివి అభివృద్ధి చేసేందుకు రూ.కోటి నిధులు ఖర్చు చేశారు. వైకాపా నాయకులు, గుత్తేదారులు, అధికారులు నాణ్యత లేని సామగ్రిని కుమ్మరించి నిధులను అందినకాడికి దండుకున్నారు.

**ఆరు నెలలకే బయటపడిన నాణ్యత**

ఆర్భాటంగా ఏర్పాటుచేసిన ఆట వస్తువులు, ఇతర సామగ్రి ఆరు నెలలకే ఎక్కడికక్కడే పాడైపోయింది. చిన్న పిల్లలు ఊగే ఇనుప ఉ



య్యాలలు తప్ప మిగతావేవీ వినియోగంలో లేవు. జారుడు బల్లలు ధ్వంసమయ్యాయి. జిమ్ పరికరాలు కూడా చాలా వరకూ విరిగిపోయాయి. దీంతో ఎవరూ వినియోగించకుండా తాళ్లతో కట్టివేశారు.

**పగిలిన ఫ్లోరింగ్..కనపించని గ్రాసం**

పార్కు లోపలి భాగం ఆహ్లాదంగా ఉండేందుకు చాలాచోట్ల ఫ్లోరింగ్ చేశారు. ప్రకృతి ప్రియులు కూర్చోడానికి..వ్యాయామాలు చేసిన వారు సేదతీరడానికి అరుగులు నిర్మించగా, ఇవన్నీ ఛిద్రమయ్యాయి. చీమకుర్తి గ్రానెట్ బండలు కూడా పలిగిపోయాయి. అందంగా రూపొందించిన ల్యాన్ కళావిహీనంగా మారింది. పార్కులో రోజువారీ సేకరించే చెత్తా చెదారాన్ని దూరంగా తరలించకుండా అక్కడే కుప్పలు కుప్పలుగా పోసి వదిలేశారు.

**ప్రతిపాదనలు పంపుతాం**

- నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

సుబ్బరామిరెడ్డి పార్కును గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం అక్కడ చిన్నారుల ఆట వస్తువులు, జిమ్ పరికరాలు దెబ్బతిన్నాయి. బాగు చేయించడానికి, కొత్తవి కొనుగోలు చేయడానికి నిధులు లేవు. పార్కు అభివృద్ధికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

# గ్రోత్ సెంటరూ ఊపిరి పీల్చుకో..

ఒంగోలు : కడుపు కొట్టడమే తప్ప.. కడుపు నింపడం తెలియని వారికి ఉపాధి కల్పన ఊసే పట్టదు. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, అవకాశవాదం, అధికార దాహం, అరాచకత్వాలు రాజ్యమేలితే అభివృద్ధి ఉండదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇవే పరిస్థితులు. పరిశ్రమలు ఏర్పాటైతే పలువురికి ఉద్యోగాలొస్తాయనే విషయాన్ని నాడు విస్మరించారు. తమ విధానాలతో చిన్న పరిశ్రమలను బతకనివ్వలేదు. పెద్ద వాటిని రానివ్వలేదు. అటువంటి వాటిలో మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలోని గ్రోత్ సెంటర్ ఒకటి. రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదిగా పేరొందిన ఈ ప్రాంతం అనేక అవకాశాలను పోగొట్టుకోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పరిస్థితులు మారాయి. ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు ఉత్సాహం చూపుతున్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేస్తామంటూ దరఖాస్తులు అందజేస్తున్నారు. అన్నీ సవ్యంగా సాగితే.. వందల మంది నిరుద్యోగులకు త్వరలోనే ఉద్యోగాలు దొరుకుతాయి. చిరు వ్యాపారులు, కూలీలు తదితరులకు మంచి రోజులు మళ్లీ రానున్నాయి.

నాడు చేతులెత్తేసిన నిర్వాహకులు...: మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలో ఏర్పాటైన గ్రోత్ సెంటర్ రాష్ట్రంలోనే రెండో అతి పెద్దది. 2019కి ముందు తెదేపా పాలనలో ఒక వెలుగు వెలిగింది. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వ విధానాలతో అధ్వానంగా తయారైంది. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించే ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ కమిటీ(ఐలా)ను పట్టించుకోలేదు. పరిశ్రమలకు కేటాయించిన ప్లాట్లు ముళ్లచెట్లతో కళావిహీనంగా తయారయ్యాయి. యువతకు ఉపాధి చూపిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులు తాము నడపలేమని చేతులెత్తేసి అద్దెకిస్తామంటూ బోర్డులు పెట్టుకొని లీజుకు తీసుకునే వారి కోసం ఎదురుచూశారు. బీటీ కొట్టుకుపోయి.. గుంతలు ఏర్పడి.. వానొస్తే బురద, ఎండకాస్తే దుమ్ముతో రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. చీకటి పడితే విద్యుత్తు దీపాలు వెలుగక అంధకారం అలముకునే పరిస్థితి. ఇదే అదనుగా అసాంఘిక కార్యక్రమాలు. యువత, పేదలకు అన్నం పెట్టే ప్రాంగణం శిథిలాలకు నిలయంగా మారుతున్నా.. పట్టించుకునే వారు కరవయ్యారు. నేడు ముందుకొస్తున్న ఔత్సాహికులు...: వైకాపా ప్రభుత్వ హయాంలో 120 పరిశ్రమలు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం కొలువు దీరాక పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది.

# కుటుంబాల లెక్క తేలేదెలా?

చిత్తూరు : పల్లె, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటిని మ్యాపింగ్ (జియో ట్యాగ్) చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఈ నెల మొదటి వారంలో ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 15 నాటికి సర్వే పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. జిల్లాలో పరిశీలిస్తే కుటుంబ మ్యాపింగ్ సర్వే నత్తనడకన సాగుతోంది. ఎంపీడీవోలు, పురపాలక కమిషనర్ల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 35.94 శాతం పూర్తయింది. పంచాయతీలు, పురపాలక, నగరపాలక సంస్థల్లో 5,91,601 కుటుంబాలు ఉన్నాయి. నాటికి 2,12,639 కుటుంబాలను సర్వే చేశారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో సుమారు పది వరకు కుటుంబాలు అందుబాటులో ఉండటం లేదు.

**పూర్తయితేనే స్పష్టత**

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలన్నీ కలిపి 612 ఉన్నాయి. వీటి పరిధిలో 4,839 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు సర్వే విధుల్లో సక్రమంగా పాల్గొనడం లేదనే విమర్శలున్నాయి. వైకాపా హయాంలో వాలంటీర్లు కుటుంబ మ్యాపింగ్ సర్వే చేశారు. అప్పట్లో చేసిన సర్వేకు, ప్రస్తుత కుటుంబ సర్వేకు వ్యత్యాసం ఉంది. సచివాలయ ఉద్యోగులు చేస్తున్న సర్వేలో కొన్ని కుటుంబాలు స్థానికంగా లేనట్లు గుర్తించారు. వారి జాడ గుర్తించడం ఇప్పుడు కష్టంగా మారింది. పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. స్థానికంగా లేని కుటుంబాలను షిఫ్టింగ్ చేసేందుకు ఆప్షన్ లేకపోవడంతో మ్యాపింగ్ ఆలస్యమవుతోందని చెబుతున్నారు. పూర్తిస్థాయిలో



మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయితేనే ఉన్న కుటుంబాలు ఎన్ని? లేని కుటుంబాలు ఎన్ని అనే వివరాలపై స్పష్టత వస్తుంది.

**సాంకేతిక సమస్యలు..**యాప్ ద్వారా సచివాలయ సిబ్బంది తమ చరవాణిలో కుటుంబ వివరాలు నమోదు చేస్తున్నారు. క్లస్టర్ వారీగా వివరాలు సేకరించి చిత్రం తీసి నమోదు చేయాలి. తర్వాత కుటుంబ సభ్యుల్లో ఒకరి వేలిముద్రలు అనుసంధానం చేయాలని ఆదేశాలు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య వేధిస్తోంది. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తిచే యాలని ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. ఎంపీడీవోలు, పురపాలక, నగరపాలక కమిషనర్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిం చారు. అధికారులు రోజువారీ సమీక్షిస్తూ మ్యాపింగ్‌ను వేగవంతం చేయిస్తున్నారు.

# దస్త్రాలు లేకుండానే ఉద్యోగోన్నతులా?

చిత్తూరు : దస్త్రాలు లేకుండా ఉద్యోగోన్నతుల జాబితా రూపొందించడంతో పురపాలికాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. డీఈవో కార్యాలయాల తీరును తప్పుబడుతున్నారు. పురపాలక, నగరపాలక సంస్థల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు.. జిల్లా విద్యాశాఖ ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా ప్రకటించింది.. ఇందులో తప్పిదాలు ఉంటే సంబంధిత ఆధారాలతో అభ్యంతరం తెలియజేయాలని కోరింది.. దీంతో వందకు పైగా వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించేందుకు సంబంధిత ఉపాధ్యాయుల రికార్డులు ఇంకా జిల్లా విద్యాశాఖ వద్ద లేకపోవడం గమనార్హం..

**వైకాపా హయాంలో లోపం..**

వైకాపా హయాంలో పురపాలక, నగరపాలక పాఠశాలలు అప్పటివరకు సంబంధిత కమిషనర్ల పర్యవేక్షణలో ఉండేవి.. వైకాపా పాలనలో వాటిని జిల్లా విద్యాశాఖ పరిధిలోకి విలీనం చేశారు.. అప్పటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయుల వ్యక్తిగత రికార్డులు ఏ పురపాలక, నగరపాలక కమిషనర్లు.. జిల్లా విద్యాశాఖకు అందించకపోవడంతో సీనియారిటీకి సంబంధించిన అభ్యంతరాలు ఎలా పరిష్కరించాలో అర్థంకాక సతమతమవుతున్నారు.

**పురపాలక ఐ విద్యాశాఖ**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామక బాధ్యత జిల్లా విద్యాశాఖదే. ఉద్యోగోన్నతులు, బదిలీ ప్రక్రియలో.. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా రూపొందించి వారి పరిధి మేరకు బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టేవారు. తాజాగా విలీనమైన తర్వాత జిల్లా యూనిట్‌గా బదిలీ, ఉద్యోగోన్నతులు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా సిద్ధం చేయాలంటే డీఎస్సీల వారీగా రెగ్యులరైజేషన్ జాబితా రూపొందించాలి. ఇందుకు అవసరమైన రికార్డులు లేకుంటే తుది సీనియారిటీ జాబితా రూపొందించడం కష్టం. ఇవన్నీ పూర్తి కాకుండానే జాబితా రూపొందించడం గమనార్హం.

**వందకు పైగా అభ్యంతరాలు..**

జిల్లా విద్యాశాఖ తాత్కాలికంగా విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో అన్ని కేడర్లకు సంబంధించి వందకు పైగా అభ్యంతరాలు డీఈవో కార్యాలయానికి వచ్చాయి. వీటిని పరిష్కరించడానికి రికార్డులు లేకపోవడంతో సంబంధిత కమిషనర్లకు.. జిల్లా విద్యాశాఖ నుంచి లేఖలు పంపారు. వారి నుంచి సమాధానం వచ్చే వరకు జిల్లా విద్యాశాఖకు నిరీక్షణ తప్పనిసరి.

# అడవిపల్లె నుంచి చిత్తూరుకు తాగునీరు

చిత్తూరు : అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరు నగరానికి 0.785 టీఎంసీల నీటిని కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నగరానికి తాగునీరు అందించడానికి నిర్దేశించిన అడవిపల్లె ప్రాజెక్టు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో నీటి కేటాయింపుపై జలవనరులశాఖ ఉత్తర్వులిచ్చింది. తాగునీటి సరఫరా పనులు కొన్ని వివిధ దశల్లో.. మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ నుంచి నగరానికి 18 కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ వేయడానికి జాతీయ రహదారుల శాఖ అనుమతించాల్సి ఉంది. చంద్రగిరి నియోజకవర్గం దామలచెరువులోని పుదిపట్లబైలులో నీటి శుద్ధి పథకం నిర్మాణానికి సంబంధించి తిరుపతి ఆర్డీవో, పాకాల తహసీల్దార్ అనుమతి పొందాలి. సార్వత్రిక ఎన్నికల సమయంలో చిత్తూరుకు తాగునీరు తెస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే జగన్మోహన్ పబ్లిక్‌హెల్త్, నీటి పారుదలశాఖ, నగరపాలక సంస్థ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి పనులు వేగిరం చేయించారు. జాతీయ రహదారులు, రెవెన్యూ అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించారు. రిజర్వాయర్ నుంచి నీటిని కేటాయించాలని జలవనరుల శాఖ మంత్రిని కలిసి విన్నవించగా ఈ ప్రక్రియ ప్రభుత్వం పూర్తి చేసింది.

# జీవనాడికి జవసత్వాలు



అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు.. 10 లక్షల మందికి తాగునీరు అందించే హంద్రీనీవా పథకం గత వైకాపా ప్రభుత్వంలో నిరాదరణకు గురైంది. ఐదేళ్లలో పథకం నిర్వహణను గాలికొదిలేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పథకానికి పునరుజ్జీవం పోసేందుకు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే బడ్జెట్‌లో రూ.1,867 కోట్లు కేటాయించింది. ఈ మొత్తాన్ని ఇదే ఆర్థిక సంవత్సరానికి ఖర్చు చేయనున్నారు. అత్యవసర పనులపై అధికారులు దృష్టి సారించారు. ఈ డిసెంబరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పనులు మొదలు పెట్టనున్నారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు పేర్కొంటున్నారు.

**అంచనాల రూపకల్పన**

తొలిదశలో నంద్యాల జిల్లా మల్యాల నుంచి జీడిపల్లి(88-216కి.మీ.) వరకు కాలువ విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల్ని రెండు ప్యాకేజీలుగా విభజించి 2021లోనే టెండర్లు పిలిచారు. గుత్తేదారు పనులు మొదలుపెట్టి నిలిపివేశారు. ఇప్పుడు ఆ గుత్తేదారును కొనసాగించాలా? లేదా అనే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. 128 కిలోమీటర్ల లైనింగ్ పనులకు రూ.2,150 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. రెండో దశలో జీడిపల్లి నుంచి శ్రీసత్యసాయి జిల్లా సరిహద్దు వరకు (216-400 కి.మీ.) 184 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు అంచనాలు రూపొందిస్తున్నారు. లైనింగ్ పనులతో అక్కడక్కడ మట్టి పనులు చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.1,200 కోట్లు అవసరమని హంద్రీనీవా అధికారులు పేర్కొంటున్నారు. ఇందులోనే పుంగనూరు బ్రాంచి కెనాల్‌లోనూ 75 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

**లైనింగ్ పూర్తి చేస్తేనే..**

హంద్రీనీవా ప్రధాన కాలువ చాలాచోట్ల పూడుకుపోయింది. శ్రీశైలం నుంచి 3,850 క్యూసెక్కుల నీటిని తీసుకునే వెసులుబాటు ఉన్నా.. 2,200 క్యూసెక్కులకు మించి తీసుకోలేకపోతున్నారు. అనంతపురం సరిహద్దు 144వ కిలోమీటరు వద్దకు వచ్చేసరికి ప్రవాహం 1,400 క్యూసెక్కులకు తగ్గిపోతుంది. జీడిపల్లి రిజర్వాయర్ వద్ద 1,100 క్యూసెక్కుల ప్రవాహం మాత్రమే ఉంటోంది. ఇదే ప్రవాహం తలుపుల మండలంలోని పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు వచ్చేసరికి 200 క్యూసెక్కులు కూడా ఉండటం లేదు. ప్రధాన కాలువలో లైనింగ్ పనులు చేస్తేనే పూర్తి స్థాయిలో నీటిని తీసుకోవచ్చు. దాంతోపాటు హంద్రీనీవాపై ఆధారపడి నిర్మిస్తున్న జీడిపల్లి-పేరూరు, జీడిపల్లి-భైరవానితిప్ప, మడకశిర బ్రాంచి కాలువలకు నీరందించవచ్చు. ఈ నేపథ్యంలో మొదట లైనింగ్ పనులపై అధికారులు దృష్టి సారించారు.

**పెండింగ్ పనులపై దృష్టి**

ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల పరిధిలోని 33, 34 ప్యాకేజీల్లో కల్వర్టులు, వంతెనలు మినహా డిస్ట్రిబ్యూటరీల పనులు గతంలోనే పూర్తి చేశారు. కొంతమేర భూసేకరణ పెండింగ్‌లో ఉంది. రూ.50 కోట్లు ఖర్చు చేస్తే ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల పరిధిలోని 38 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు సాగునీరు అందించే 36వ ప్యాకేజీ పనుల్ని గత వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది. అధికారులు ప్రస్తుతం ఆ పనులపై కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంది. కదిరి పరిధిలోని పట్నం, తలుపుల మధ్య హంద్రీనీవా పనుల్ని 14వ ప్యాకేజీగా విభజించారు. రూ.102 కోట్ల అంచనాతో మొదలుపెట్టి రూ.61 కోట్లు ఖర్చు చేశారు. 24 పనుల్లో 17 పూర్తికాగా మిగిలినవి చేయాల్సి ఉంది.

# ఊసేలేని 'ఉపాధి కల్పన'




అనంతపురం : 'ఉపాధి కల్పన' పథకం కింద 2019 జులైలో రూ.10లక్షల బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేశా. అదే ఏడాదిలో రుణం మంజూరు కావడంతో స్వగ్రామంలోనే పరిశ్రమను స్థాపించా. నిర్దేశిత కంతుల ప్రకారం రుణాన్ని పూర్తిగా చెల్లించా. కాని.. 35 శాతం రాయితీ రూపంలో రూ.3.5లక్షలు రావాలి. ఇప్పటి దాకా పైసా జమ కాలేదు. క్షేత్ర పరిశీలన అసలు జరగలేదు. జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేదు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వెన్నుదన్నుగా నిలవాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం(పీఎంఈజీపీ) అమలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దరఖాస్తుల స్వీకరణ.. బ్యాంకులకు సిఫార్సు చేయడం దాకా కొంతమేర పర్వాలేదు. రుణాలు పొందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బ్యాంకులకు కంతులు చెల్లించినా.. రాయితీ అందని ద్రాక్షలా మారింది. దీనికి క్షేత్రస్థాయిలో యూనిట్ల నిశిత పరిశీలన అటకెక్కడమే అసలు కారణం. గత వైకాపా ప్రభుత్వం ఈ పథకం అమలుపై ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ప్రతి నెలా జరిగే సమీక్షల్లో మాత్రం రాయితీ మంజూరు చేస్తున్నట్లు అధికారులు దస్త్రాల్లో 'లెక్క' రాసుకుని చేతులు దులుపుకొంటున్నారు.

**10,213 మంది దరఖాస్తు**

కేంద్ర ప్రభుత్వం పీఎం ఉపాధి కల్పన పథకాన్ని 2008-09లో ప్రారంభించింది. ఉమ్మడి అనంత జిల్లాలో 2016 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. తాజా మార్గదర్శకాల ప్రకారం ఉత్పత్తి రంగంలో గరిష్ఠంగా రూ.50లక్షలు, సేవా రంగంలో గరిష్ఠంగా రూ.20లక్షల దాకా బ్యాంకు రుణం పొందవచ్చు. దీనికి 15 నుంచి 35 శాతం దాకా రాయితీ సొమ్ము కేంద్రమే ఇవ్వనుంది. కొత్తగా పరిశ్రమ స్థాపించే వారికే ఈ పథకం వర్తించనుంది. 2014-19 మధ్య కాలంలో ఏటా క్రమంగా రాయితీ సొమ్ము జమ అవుతూ వచ్చింది. 2019-20 నుంచి ఇప్పటి దాకా నయా పైసా అందలేదు. గడిచిన ఐదేళ్లలో మొత్తం 10,213 మంది ఉపాధి కల్పన కింద దరఖాస్తు చేసుకున్నా... వీటిలో చాలా వాటిని తిరస్కరించారు.

**రూ.11.71 కోట్ల రాయితీ ఏదీ?**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 257 యూనిట్ల పరిధిలో 1,861 మందికి రూ.11.71 కోట్ల రాయితీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోనే రూ.8.25 కోట్లు ఉంది. పరిశ్రమ ఏర్పాటు, ఇతరాత్ర సౌకర్యాలు ఉన్నాయా లేదా అని క్షేత్ర పరిశీలన చేసి.. నివేదిక పంపితేనే రాయితీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుంది. ఐదేళ్లుగా ఈ తంతు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

**త్వరలోనే పరిశీలనకు వచ్చే అవకాశం–** జీఎం శ్రీధర్, జిల్లా పరిశ్రమల అధికారిపరిశ్రమ స్థాపించిన మూడేళ్ల తర్వాత రాయితీ సొమ్ము జమ అవుతుంది. ఈలోపు ఖాదీ కమిషన్ థర్డ్ పార్టీ ద్వారా క్షేత్ర పరిశీలన చేయాల్సి ఉంటుంది. ఈ నివేదిక ఆధారంగానే రాయితీ జమ అవుతుంది. ఈ ప్రక్రియలో కొంత ఆలస్యమైంది. త్వరలోనే పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది.

# దస్త్రాల్లోనే దేవుడి భూములు

గుత్తి :గుత్తి మండలంలోని రజాపురం బురుదాల విఘ్నేశ్వరస్వామి ఆలయం ఇది. ఈ ఆలయానికి గ్రామంలోని సర్వేనంబర్ 82లో 17.65 ఎకరాలు, సర్వే నంబరు 83లో 17.45 ఎకరాలు ఉంది. ఈ భూమిని శ్రీపురానికి చెందిన 15మంది ఆక్రమించారు. కొందరు పథకం ప్రకారం క్రయవిక్రయాలు చేసుకున్నారు. లింకు డాక్యుమెంట్లు ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. వాటిని రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు దొడ్డిదారిన పట్టాదారు పాసుపుస్తకాలు కట్టబెట్టారు. గ్రామస్థులు ఐక్యంగా న్యాయపోరాటం చేశారు. ఆక్రమణ దారులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా దేవాదాయశాఖకు అనుకూలంగానే 6నెలల కిందట తీర్పు ఇచ్చింది. ఇప్పటికి ఆక్రమణదారులు భూమిని వదలడం లేదు. పాసుపుస్తకాలను రద్దు విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దేవాదాయశాఖ నిర్లక్ష్యం వల్ల గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లో రూ.కోట్లు విలువైన ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. దేవుళ్ల ఆస్తులకే రక్షణ లేకుండాపోతోంది. దేవాదాయశాఖ అధికారులు గ్రామాల్లో ఉన్న ఆలయ భూములను రికార్డుల్లో నమోదు చేసుకున్నారే తప్ప అవి ఎక్కడెక్కడ ఉన్నాయో పట్టించుకోవడం లేదు. ఆక్రమణల విషయంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేస్తున్నారు. కొన్నింటిని నివాస స్థలాలుగా మార్చి ఇంటి పట్టాలు ఇస్తున్నారు.

**ఖాళీ స్థలం కనబడితే కబ్జానే**

గుత్తి పట్టణంలో వ్యాసరాయుడి మఠానికి చెందిన సుమారు రూ.20 కోట్లు విలువైన 3 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. రెవెన్యూ అధికారులు కొన్నేళ్ల కిందటే నివాస స్థలాలు ఇచ్చారు. పట్టాలతో ఇళ్లు చేతులు మారుతున్నాయి. గొందిపల్లిలో బొలికొండ రంగనాథ స్వామి భూమి మూడెకరాలు ఆక్రమణకు గురైంది. అనేక మంది ఇంటి పట్టాలు పొంది పక్కా ఇళ్లను నిర్మించుకున్నారు. జక్కలచెరువులో ఇనాంభూమికి మూడేళ్ల కిందట ఓ వ్యక్తి మరొకరికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాడు. చెట్నేపల్లిలో ఈశ్వరుడి ఆలయ భూమి అన్యాక్రాంతం అవుతోంది. కొందరు వామిదొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటికి కొందరు అక్రమంగా శిస్తు వసూలు చేసుకుంటున్నారు. అయినా అధికారులకు పట్టడం లేదన్న విమర్శలున్నాయి. రజాపురంలోని మఠం భూమి 6.85 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకోగా గ్రామస్థులు అడ్డుకున్నారు.

**ఆక్రమణలపై విచారణ చేస్తాం - ఓబులేశు, తహసీల్దారు, గుత్తి**

ఆలయ భూములు ఇతరులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి హక్కులు కల్పించడం చేయరాదు. దేవుడి పేర్లపైనే పాసుపుస్తకాలు ఇవ్వాలి. అలా కాకుండా ఆక్రమణదారుల పేరుతో పాసుపుస్తకాలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం. దేవుడి ఆస్తుల అన్యాక్రాంతంపై విచారణ చేస్తాం.

# అక్రమార్కుల భక్ష్యం... వృక్షాలే సాక్ష్యం

పలమనేరు : ఇసుకాసురుల ఆగడాలకు అడ్డేలేకుండా పోతోంది. ఇంత కాలం నదులు, చెరువుల్లోని ఇసుకను తోడేసి పర్యవరణాన్ని నాశనం చేశారు. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ ఆస్తులు కూడా ధ్వంసం చేస్తున్నారు. కౌండిన్య నది పొడవునా ఇసుకరేణువులు లేకుండా చేశారు. అక్రమంగా ఇసుకను ఎక్కడపడితే అక్కడ తోడేయడంతో అక్కడ అంచునున్న వృక్షాల వేర్లు కూడా తేలిపోయాయి. క్యాటిల్‌ఫారం వద్ద అయితే అటవీశాఖకు చెందిన తోపులోని భారీ వృక్షాలు కూలిపోయే స్థితికి చేరాయి. నదిలో ఇసుకను తోడితే రెవెన్యూ, భూగర్భగనులశాఖ ఎవరూ పట్టించుకోవడంలేదు. కనీసం అటవీ భూముల్లో తోడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకునే పరిస్థితి కనిపించలేదు. దీంతో వృక్ష సంపద చాలా వరకు నాశనమవుతోంది.

**చోద్యం చూస్తున్న అధికారులు**

అక్రమార్కులు అడ్డుఅదుపు లేకుండా పేట్రేగిపోతున్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకున్న దాఖలాల్లేవు. వైకాపా హయాంలో నాయకులు ఇసుకను ఇష్టానుసారంగా తోడేస్తే.. ఇప్పుడు అధికారి పార్టీ పేరు చెప్పుకొంటూ వ్యాపారులు దండుకుంటున్నా అధికారులు ఎవరి జోలికి వెళ్లడంలేదు. కనీసం ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడం కోసమైనా స్పందించాల్సిన అవసరం ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్డీవో మనోజ్‌రెడ్డి ఇసుక తోడే ప్రదేశాల్లో వాహనాలు రాకుండా కందకాలు తవ్వించారు. ప్రస్తుతం వాటిని పూడ్చేసి తరలిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని నాగమంగళం వద్ద వక్ఫుబోర్డుకు చెందిన భూమిలోనే కాకుండా ప్రైవేటు వ్యక్తుల భూముల్లో, మున్సిపల్



పంప్‌హౌస్‌కు చెందిన ప్రాంతంలో ఇసుకను తోడేస్తున్నారు. బోర్డుకు చెందిన వారు కొంత కాలం అడ్డుకున్నా తరువాత ఏమీ చేయలేక వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు ఇసుకాసురుల ఆగడాలకు అడ్డుకట్ట వేయకుంటే నదిమీద నిర్మించిన వంతెన కూలిపోవడం ఖాయమేననే మాటలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆర్డీవో భరణిని అడగ్గా ఇసుక తొడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణాలు, వంతెనల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

**అడ్డగోలు తవ్వకాలు**

కౌండిన్య నది పొడవునా మొత్తం 11 చెక్‌డ్యామ్‌లున్నాయి. వాటి అడుగుభాగంలో సన్నటి ఇసుక ఉంటుంది. దాని కోసం స్మగ్లర్లు ఇష్టమొచ్చినట్లు తోడేయడంతో డ్యామ్‌లు కూలిపోయాయి. చివరగా ఏకంగా నాలుగోనంబరు జాతీయ రహదారిపైనున్న వంతెన వంతొచ్చింది. క్యాటిల్‌ఫారం వద్ద వంతెన కింద ఇసుకను ఇప్పటికే పూర్తిగా తోడేశారు. దీంతో వంతెనకు సపోర్టుగా నిర్మించిన కాంక్రిట్ దిమ్మెలకు పగుళ్లు ఏర్పడ్డాయి. భారీ వర్షాలొస్తే ప్రమాదం సంభవిస్తుంది.

# అంతా వారిష్టం!

చిత్తూరు : నిబంధనలు తోసిరాజంటున్నారు.. ఉన్నతాధికారుల ఆదేశాలను తుంగలో తొక్కేస్తున్నారు.. బదిలీ చేసినా కదలరు.. ఇదీ ఎస్పీడీసీఎల్‌లో కొందరు అధికారుల తీరు. వైకాపా హయాం నుంచి ఈ సంస్థలో ఈ దుస్థితి నెలకొంది. పెద్దాయనగా పిలిపించుకున్న వైకాపా నేత నోటి మాటతో కొందరు అధికారులు ఇష్టమైన చోట విధులు నిర్వర్తిస్తున్నారు.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరినా వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతుండటం గమనార్హం. ఉమ్మడి చిత్తూరు జిల్లా పాత తిరుపతి సర్కిల్ పరిధిలో 40-45 మంది ఉద్యోగులు మౌఖిక ఆదేశాలు, డిప్యూటేషన్లపై కోరుకున్నచోట విధులు నిర్వర్తిస్తున్నారు. రాజకీయ పైరవీలతో రెండేళ్లుగా తమకిష్టమైన ప్రాంతాల్లో.. స్థానాల్లో దర్జాగా కొనసాగుతున్నారు. వీరికి వేతనం ఒక చోట.. విధులు మరొకచోట అన్న చందంగా పరిస్థితి ఉంది. అదేమిటని అడిగే నాథుడే లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. కనీసం ఎంతమంది అలా ఉన్నారని తెలిసినా మనకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

**కింది స్థాయి సిబ్బందితో విధులు..**

మౌఖిక ఆదేశాలతో బదిలీ అయిన ప్రాంతంలో పోస్టులు లేవు. ఏదో ఒకచోట కూర్చొని కాలయాపన చేస్తూ పలువురు వేతనాలు పొందుతున్నారని ఆ శాఖ అధికారులే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. చిత్తూరు అర్బన్ తదితర డివిజన్లలో ఉద్యోగుల కొరతతో మిగిలిన ఉద్యోగులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లో కింది స్థాయి సిబ్బంది



విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాలనా వ్యవహారాలు గాడిన పడేలా, పారదర్శకంగా సాగేలా దృష్టి సారించాలని ఆ శాఖ అధికారులు కోరుతున్నారు.

**సర్కిల్‌ను విభజించినా కదలరు**

ఇటీవల తిరుపతి సర్కిల్‌ను విభజించి చిత్తూరు జిల్లాలో నూతన సర్కిల్ ఏర్పాటు చేశారు. కొత్త కార్యాలయానికి అధికారులు, సిబ్బందిని కేటాయించారు. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు చిత్తూరులోనే పనిచేస్తున్నారు. మిగిలిన అధికారులు, ఇంజినీర్లు ఈ నెల 15లోగా కొత్త సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించాలని సీఎండీ సంతోష రావు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త సర్కిల్ ఏర్పాటు, ఉద్యోగుల కేటాయింపులు జరుగుతున్నా డిప్యూటేషన్లు, మౌఖిక ఆదేశాలపై కొనసాగుతున్న ఉద్యోగుల వైపు ఉన్నతాధికారులు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. ఇదిచాలు విద్యుత్తు శాఖలో పాలన ఎలా సాగుతుందని చెప్పేందుకు.

చురకలు



# రష్మిక.. కనీసం పెళ్లికి అయినా గంట టైమిస్తుందా?

'పుష్ప 2 ది రూల్' అద్భుత విజయాన్ని ఆస్వాధిస్తోంది రష్మిక మందన్న. ఈ సమయంలో తన వ్యక్తిగత కమిట్ మెంట్లను కూడా విడిచిపెట్టడం లేదు. తాజాగా తన బెస్ట్ ఫ్రెండ్ సంగీత్ కార్యక్రమానికి రష్మిక హాజరయ్యారు. సంగీత్ వేడుక కోసం గంటసేపు ప్రయాణించి కేవలం 15 నిమిషాలు మాత్రమే అక్కడ సమయం గడిపానని చెప్పారు. ప్రయాణ సమయాన్ని కూడా అక్కడ స్నేహితురాలి కోసం కేటాయించలేకపోయింది. వెంటనే తిరుగు ప్రయాణం అయ్యానని తెలిపింది. స్నేహితురాలి సంగీత్ కార్యక్రమం నుంచి ఫోటోలను కూడా రష్మిక షేర్ చేసారు. పొడవాటి కుర్తా, పైజామా, దుపట్టాతో ఆకర్షణీయమైన దుస్తుల్లో రష్మిక ఈ వేడుకకు హాజరయ్యారు. ప్రస్తుతం ఈవెంట్ కి సంబంధించిన ఓ మూడు ఫోటోలు అంతర్జాలంలో షేర్ చేయగా అవి వైరల్ గా మారాయి. "వరుస



కమిట్‌మెంట్ల కారణంగా ఈ వేడుకలో ఎక్కువ సమయం గడపలేకపోయానని రష్మిక వెల్లడించారు.

నా బెస్టీ శ్రావ్యవర్మ సంగీత్ కోసం.. గంట పాటు అటూ ఇటూ ప్రయాణించాను. కేవలం 15 నిమిషాలు మాత్రమే వేడుకలో ఉన్నాను. కానీ తనను కలిసినందుకు గర్వంగా ఉంది" అని రష్మిక సోషల్ మీడియాలో రాసారు. మై హీరోయిన్ మూమెంట్... సరైన సమయానికి అసైన్‌మెంట్ కోసం చేరుకునే మోడల్స్, నటీనటులు ఎల్లపుడూ ఆకర్షిస్తారు. అనుకున్నది సాధించడానికి నేను నా జీవితంలో నిజంగా చాలా కష్టపడ్డాను. నేను-కొంతవరకు-సాధించానని అనుకుంటున్నాను అని రష్మిక తెలిపింది. సరైన వ్యక్తులతో కలిసి పని చేయడం కూడా ముఖ్యం. తెరవెనక పని చేసే సాంకేతిక నిపుణుల సాయంతోను ఇదంతా సాధ్యమైంది అని వెల్లడించింది.

# రాశీ కిల్లర్ భంగిమలు

నేటి తరంలో తీవ్రమైన పోటీ ప్రపంచంలో తెలివిగా కెరీర్ బండిని నడిపిస్తున్న భామ రాశీ ఖన్నా. దశాబ్ధ కాలంగా ఈ బ్యూటీ టాలీవుడ్‌లో కెరీర్ జర్నీ సాగించింది. తమిళం, హిందీ భాషల్లోను వీలున్నప్పుడల్లా నటిస్తూనే ఉంది. మూడు భాషల్లో అవకాశాలను అంది పుచ్చుకుంటోంది. ఒక్క అడుగుతో మొదలైన కెరీర్ అంచెలంచెలుగా ఎదిగింది. రాశీ విభిన్నమైన పాత్రల్లో నటించి తనదైన అందం, నట ప్రదర్శనతో మైమరిపించింది. ఇదే విషయాన్ని రాశీ తెలివైన పంథాలో అభిమానుల కోసం వెల్లడించింది. మద్రాస్ కేఫ్ నుండి ది సబర్మతి రిపోర్ట్ వరకు, ఇది చాలా సుసంపన్నమైన ప్రయాణం. వైవిధ్యభరితమైన పాత్రలను పోషించినందుకు గౌరవం పొందాను.. వినయంగా ఉంటాను. ఎక్స్‌ట్రార్డినరీ సెన్సేషనల్ పెర్ఫార్మర్ అవార్డుకు ఏnexbrands.incకి ధన్యవాదాలు అని రాసింది. రాశీ ఖన్నా తన అవార్డును ప్రదర్శిస్తూ ఫోజులిచ్చింది. ఈ ఫోటోషూట్



కోసం వంగ పువ్వు (బ్రింజాల్) రంగు ఫ్రాక్ ధరించి వయ్యారంగా హొయలు పోయింది. పరిమిత మేకప్ తో కనిపించిన రాశీ హాఫ్ షోల్డర్ దుస్తుల్లో సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. అది థై స్లిట్ ఫ్రాక్. హై హీల్స్ ధరించి ఫోజులిచ్చింది. ముఖ్యంగా ఆ మెడలో అందమైన లాకెట్ తన గ్లామ్ ని పదింతలు పెంచిందని చెప్పాలి. రాశీ ఇటీవల మూడు భాషల్లో నటించింది. రాజ్ అండ్ డీకే వెబ్ సిరీస్ ఫర్జీలోను కీలక పాత్రను పోషించింది. మునుముందు మరిన్ని వెబ్ సిరీస్ లకు సంతకాలు చేయనుందని తెలుస్తోంది. తెలుసు కదా.. అగాథియా లాంటి చిత్రాల్లోను నటిస్తోంది.




# రాజా సాబ్ తప్పుకుంటే.. ఆ ముగ్గురు రెడీ..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కాంపౌండ్ నుంచి వస్తున్న చిత్రాల్లో రాజా సాబ్ ఒకటి. హర్రర్ కామెడీ జోనర్ లో మారుతి తెరకెక్కిస్తున్న ఆ సినిమా షూటింగ్ కొన్ని నెలల క్రితం మొదలవ్వగా ఏప్రిల్ 10వ తేదీన రిలీజ్ చేస్తామని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రభాస్ లుక్స్ తో పాటు మోషన్ పోస్టర్స్ కూడా షేర్ చేసి హైప్ క్రియేట్ చేశారు. అయితే రాజా సాబ్ రిలీజ్ వాయిదా పడుతుందని రీసెంట్ గా టాక్ రావడం మొదలైంది.

అందుకు కారణం సిద్ధు జొన్నలగడ్డ అప్ కమింగ్ మూవీ జాక్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడమే. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతుండగా ఏప్రిల్ 10న విడుదల చేస్తామని రీసెంట్ గా ప్రకటించారు. దీంతో రాజా సాబ్ విడుదల పోస్ట్ పోన్ అవ్వనుందని ప్రచారం జరుగుతోంది. వీఎఫ్ ఎక్స్ వర్క్ చాలా పెండింగ్ ఉందని, షూటింగ్ కూడా పూర్తవ్వలేదని సమాచారం. దానికి తోడు ప్రభాస్ తాను గాయపడినట్లు రీసెంట్ గా వెల్లడించారు. ఇప్పుడు రిలాక్స్ డ్ మోడ్ లో ఉన్న ఆయన.. ఇంకొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటారని టాక్ వినిపిస్తోంది. అలా వివిధ కారణాల వల్ల రాజా సాబ్ రిలీజ్ వాయిదా పడుతుందని తెలుస్తోంది. అందుకే సిద్ధు జొన్నలగడ్డ జాక్ ను అప్పుడు రిలీజ్ చేస్తున్నారన్నమాట! అదే సమయంలో ఏప్రిల్ 10వ తేదీపై జాక్ తోపాటు మరో రెండు చిత్రాలు కన్నేశాయని ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. నితిన్ నటిస్తున్న ఓ సినిమా,రాబిన్ హుడ్ అప్పుడే విడుదల అవ్వనున్నాయట.

బాలీవుడ్ యాక్టర్ సన్నీ డియోల్ హీరోగా టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న జాట్ మూవీని రాజా సాబ్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీనే నిర్మిస్తోంది. దీంతో రాజా సాబ్ అనుకున్న తేదీకి ఆ సినిమా బదులు జాట్ ను రిలీజ్ చేయాలని నిర్మాత విశ్వప్రసాద్ భావిస్తున్నారట. నితిన్ కూడా తన మూవీతో రానున్నారని టాక్. అయితే నితిన్ చేతిలో ఇప్పుడు రాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలు ఉన్న విషయం తెలిసిందే. రాబిన్ హుడ్ క్రిస్మస్ కు వస్తుందని అనుకోగా వాయిదా పడింది. శివరాత్రి కానుకగా రిలీజ్ చేద్దామనుకుంటున్నారట. అదే సమయంలో తమ్ముడు మూవీ ఫిబ్రవరి 25న విడుదవ్వనుందని ఇప్పటికే ప్రకటించారు. కాబట్టి ఏప్రిల్ 10న రాబిన్ హుడ్ రిలీజ్ అయ్యే అవకాశం ఉందని ఇప్పుడు తెలుస్తోంది. అలా మూడు సినిమాలు.. ప్రభాస్ డేట్ పై ఫోకస్ చేశాయన్నమాట.

# మిల్కీ కాదు గోల్డెన్ బ్యూటీ



మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి సుదీర్ఘ కాలం అవుతున్నా ఇప్పటికీ వరుస సినిమాలతో, సిరీస్‌లతో బిజీ బిజీగానే ఉంటుంది. తాజాగా ఈమె బాలీవుడ్‌లో చేసిన సినిమా ప్రమోషన్‌లో భాగంగా పలు ఆసక్తికర పోస్ట్‌లను, ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. ఈ మధ్య కాలంలో టాలీవుడ్‌లో ఈ అమ్మడు సినిమాలు చేయక పోయినా అభిమానులు సోషల్ మీడియా ద్వారా ఆమె షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెట్టింట తమన్నాను ఎప్పుడూ అభిమానిస్తూ, ఫాలో అవుతున్న వారు చాలా మంది ఉన్నారు. తాజాగా వారి కోసం మరో అందాల ఆరబోత ఫోటో షూట్‌ను ముద్దుగుమ్మ తమన్నా షేర్ చేసింది. ఈసారి మిల్కీ బ్యూటీ తమన్నా క్లీ వేజ్ షో చేస్తూ బంగారు వర్ణపు డ్రెస్‌లో మెరిసింది. నేను గోల్డెన్ గర్ల్ అంటూ తనకు తాను ట్యాగ్ ఇచ్చుకుని అందమైన ఫోటోలను షేర్ చేసిన ముద్దుగుమ్మ తమన్నా పోటోలు ఎప్పటిలాగే వైరల్ అవుతున్నాయి. ఇండస్ట్రీలో వచ్చి ఇన్నాళ్లు అయినా, మూడు పదుల వయసులోనూ మిల్కీ బ్యూటీ ఈ స్థాయి అందం ఎలా సాధ్యం అర్థం కాదు అంటూ నెట్టింట కొందరు కామెంట్ చేస్తూ ఉంటారు. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో పాపం టాలీవుడ్ లో ఆఫర్లు దక్కక పోవడం విచారకరం అంటూ ఆవేదన చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా సీనియర్ హీరోలకు జోడీగా అయినా వరుసగా సినిమాలు చేస్తే బాగుంటుంది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. వెబ్ సిరీస్‌లతో పాటు ప్రత్యేక పాటల్లోనూ కనిపించేందుకు ఎలాంటి మొహమాటం లేదని చెబుతూ ఉన్న ఈ అమ్మడు మరోసారి ఒక స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ ను చేసేందుకు రెడీ అయ్యిందని తెలుస్తోంది. హిందీలో ఈమె వరుసగా సినిమాలు చేస్తోంది. కానీ ఇప్పటి వరకు ఈమెకు సాలిడ్ సక్సెస్, మంచి గుర్తింపు దక్కించుకోలేక పోయింది. హిందీతో పాటు ఇతర భాషల్లో ఆఫర్లు సొంతం చేసుకుంటూనే మరో వైపు సోషల్ మీడియాలో ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా తమన్నా తన ఉనికిని కాపాడుకుంటూ వస్తుంది. మరో అయిదు పదేళ్ల పాటు తమన్నా ఇదే అందంతో, ఇంతే బిజీగా ఉండాలని, మరిన్ని సినిమా ఆఫర్లు తమన్నాకు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం మిస్ అయిన స్టార్ హీరోల సినిమాలు ఈమెకు మళ్లీ దక్కాలని కొందరు కోరుకుంటున్నారు. టాలీవుడ్‌లో మిల్కీ బ్యూటీ ఇదే అందంను కంటిన్యూ చేస్తే బిజీ అయ్యేనా చూడాలి.

# కావ్య పాప గ్లామర్ ఫీస్ట్

గంగోత్రి, బాలు సినిమాలలో చైల్డ్ యాక్టర్ గా నటించిన కావ్య కళ్యాణ్ రామ్ ను అంత ఈజీగా ఎవరూ మర్చిపోరు. ఈ పిల్లి కళ్ళ పాప 'మసూద' సినిమాతో హీరోయిన్ గా మారింది. మొదటి చిత్రంతోనే సక్సెస్ అందుతుంది. తర్వాత 'బలగం' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ దక్కింది. ఈ రెండు సినిమాలు ఆమెకు టాలీవుడ్ లో మంచి క్రేజ్ తీసుకొచ్చాయి. తర్వాత శ్రీ సింహకు జోడీ 'ఉస్తాద్' సినిమాలో ఈ బ్యూటీ నటించింది. అయితే ఈ చిత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో సక్సెస్ కాలేదు. ఈ మూవీ తర్వాత ఇప్పటివరకు కావ్య కళ్యాణ్ రామ్ కొత్త చిత్రం అయితే రాలేదు. కానీ సోషల్ మీడియాలో ఆమె చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో తన అప్డేట్స్ షేర్ చేస్తూ ఉంటుంది. అలాగే అప్పుడప్పుడు గ్లామర్



ఫోటోలతో ఎట్రాక్ట్ చేస్తోంది. ఈ అమ్మడు ఫోటోలకు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉంది. అందుకే ఎలాంటి ఫోటోలు పెట్టిన వైరల్ అవుతూ ఉంటాయి. ఇదిలా ఉంటే తాజాగా ఈ బ్యూటీ వైట్ కలర్ గౌన్ లో అదిరిపోయే లుక్స్ తో గ్లామర్ ఫోటోలని షేర్ చేసింది. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ లుక్స్ లో కావ్య కళ్యాణ్ రామ్ మెస్మరైజ్ చేస్తోందనే మాట వినిపిస్తోంది. తన అందానికి కాస్త గ్లామర్ టచ్ ఇస్తూ కుర్రాళ్ళకి విజువల్ ఫీస్ట్ అందిస్తోందని కామెంట్స్ వస్తున్నాయి. ఈ ఫోటోలు పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆమె అందాన్ని వర్ణిస్తూ ఎమోజీలు పెడుతున్నారు. తెలుగు అమ్మాయిలను తెలుగు సినిమాల్లో హీరోయిన్స్ గా ఎంకరేజ్ చేయడం లేదనే మాట చాలా కాలంగా వినిపిస్తోంది. కావ్య కళ్యాణ్ రామ్ లాంటి హీరోయిన్స్ కి సరైన అవకాశాలు ఇస్తే స్టార్ హీరోయిన్ గా సత్తా చాటే అందం ఆమెకు ఉందని ఫ్యాన్స్ అంటున్నారు. ఈ స్థాయిలో గ్లామర్ ఫోటోలను చూసిన తర్వాత ఎవరైన సరే కావ్యకి పిలిచి మరి అవకాశాలు ఇస్తారనే కామెంట్స్ చేస్తున్నారు.

# ఆషిక రంగనాథ్.. స్లీవ్‌లెస్ టచ్‌తో చీరకట్టు

కన్నడ చిత్రపరిశ్రమ నుంచి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆషిక రంగనాథ్, తన అందం, అభినయంతో ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంటోంది. అమిగోస్ చిత్రంతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఈ కన్నడ బ్యూటీ, మొదటి సినిమాతోనే ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. 'ఎన్నో రాత్రులు' పాటలో తన అందం, డ్యాన్స్‌తో యూత్‌ను ఫిదా చేసింది. సినిమాలో ఆమె నటన కూడా పాజిటివ్ కామెంట్స్ అందుకోవడంతో, తనకంటూ ఓ ఫ్యాన్ బేస్‌ను సృష్టించుకుంది. ఆ తర్వాత నాగార్జున సరసన 'నా సామి రంగ' చిత్రంలో వరలక్ష్మి పాత్రలో కనిపించి, తన నటనతో మెప్పించింది. ఈ సినిమా ద్వారా ఆమె టాలీవుడ్‌లో తన క్రేజ్‌ను మరింత పెంచుకుంది. ప్రస్తుతం ఆషిక తెలుగుతో పాటు కన్నడ చిత్రపరిశ్రమలోనూ వరుస అవకాశాలను దక్కించుకుంటోంది.



చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతున్న ఆషిక, తన కెరీర్‌ను మరో లెవెల్ కు తీసుకెళ్లడానికి కృషి చేస్తోంది. ఇక సోషల్ మీడియాలో కూడా ఆషిక రంగనాథ్ బాగా యాక్టివ్‌గా ఉంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన లుక్ ఒకటి నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో క్రీమ్ కలర్ ప్లెయిన్ చీరలో దిగిన ఫోటోలు చూస్తుంటే, ఆమె సౌందర్యం మరింత మెరుస్తోందని చెప్పవచ్చు. ఓ ఫోటోలో ఆమె చిరునవ్వు కుర్రకారును ఆకర్షిస్తుండగా, మరో ఫోటోలో ఆషిక కవ్వింపు అందాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చీరకట్టులో ఆమె అందం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుండటంతో, నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఆషిక రంగనాథ్‌కు సంబంధించిన అప్‌కమింగ్ ప్రాజెక్టులు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి. ఆమె ప్రస్తుతం మెగాస్టార్ నటిస్తున్న 'విశ్వంభర'లో కీలక పాత్రలో కనిపించనుంది. అలాగే సిద్ధార్థ్ హీరోగా తెరకెక్కుతున్న 'మిస్ యూ' చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. మరికొన్ని కథలు చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536